
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



భారత శక్తి®
తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:232 హైదరాబాద్, గురువారం, 20 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00

# రూ.3,04,965 కోట్లతో తెలంగాణ బడ్జెట్





హైదరాబాద్: శాసనసభలో తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. 2025-26 ఏడాదికి రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను సభకు సమర్పిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా పేర్కొన్నారు.

"తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం. కొందరు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి చర్యనూ నిందిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం 2 పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రజలకు నిరాశ మిగిల్చింది.

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు 'మెగా మాస్టర్ ప్లాన్ 2050'

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించాం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నాం. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేస్తాం. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తాం. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ.

దేశానికే తలమానికంగా ఉండేలా 'ఫ్యూచర్ సిటీ'

ఓఆర్ఆర్ ఫేజ్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుంది. ఫేజ్-2 ద్వారా హెచ్ఎండీఏలో విస్తరించిన ప్రాంతాలకు తాగునీరు అందిస్తాం. హైదరాబాద్‌లో సమగ్ర వరద నీటిపారుదల ప్రాజెక్టుకు రూ.5,942 కోట్లు కేటాయిస్తాం. దేశానికి తలమానికంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. శ్రీశైలం-నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఇది ఉంటుంది. 56 గ్రామాలు, 765 చదరపు కి.మీ విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో ఏఐ సిటీ, ఫార్మా హబ్, స్పోర్ట్స్ సిటీ, క్లీన్ ఎనర్జీ, ఇన్నోవేషన్ జోన్లు, మల్టీ మోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉంటాయి. ఈ ప్రాజెక్టును ఎఫ్‌సీడీఏ పర్యవేక్షిస్తుంది" అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

%బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయింపులిలా..

పంచాయతీరాజ్ శాఖ- రూ.31,605 కోట్లు
వ్యవసాయశాఖ- రూ.24,439 కోట్లు
విద్యాశాఖ- రూ.23,108కోట్లు
మహిళా శిశుసంక్షేమశాఖ- రూ.2,862 కోట్లు
పశు సంవర్ధకశాఖ- రూ.1,674 కోట్లు
పౌరసరఫరాల శాఖ- రూ.5,734కోట్లు
కార్మికశాఖ- రూ.900 కోట్లు
ఎస్సీ సంక్షేమం: రూ40,232 కోట్లు
ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు
బీసీ సంక్షేమం- 11,405 కోట్లు
చేనేత రంగానికి- రూ.371 కోట్లు
మైనార్టీ సంక్షేమశాఖ- రూ.3,591 కోట్లు
పరిశ్రమలశాఖ- రూ.3,527 కోట్లు
ఐటీ రంగం- రూ.774 కోట్లు
విద్యుత్ రంగం- రూ.21,221 కోట్లు
వైద్య రంగం- రూ.12,393 కోట్లు
పురపాలక రంగం- రూ.17,677 కోట్లు
నీటి పారుదలశాఖ- రూ.23,373 కోట్లు
రోడ్లు, భవనాల శాఖ- రూ.5,907 కోట్లు
పర్యాటక రంగం- రూ.775 కోట్లు
క్రీడలు- రూ.465 కోట్లు
అటవీ, పర్యావరణం- రూ.1,023 కోట్లు
దేవాదాయశాఖ- రూ.190 కోట్లు
ఆరు గ్యారంటీలు- రూ.56,084 కోట్లు
రైతు భరోసా- రూ.18వేల కోట్లు
చేయూత పింఛన్లు రూ.14,861 కోట్లు
ఇందిరమ్మ ఇళ్లు రూ.12,571 కోట్లు
మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు
గృహజ్యోతి- రూ.2,080 కోట్లు
సన్నాలకు బోనస్ రూ.1,800 కోట్లు
రాజీవ్ ఆరోగ్యశ్రీ- రూ.1,143 కోట్లు
గ్యాస్ సిలిండర్ రాయితీ- రూ.723 కోట్లు
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా- రూ.600 కోట్లు
రాజీవ్ యువ వికాసం- రూ.6వేలకోట్లు
ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు




హైదరాబాద్: తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్‌కు నోటీసులు జారీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ రంగం సిద్ధం చేస్తోంది. ఇన్నోవా వాహనం అద్దె కింద తీసుకున్న నిధులు తిరిగి యూనివర్సిటీకి చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనుంది. ఒకటి రెండు రోజుల్లో ఆమెకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో సీఎంఓలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న స్మితా సభర్వాల్ లేఖ మేరకు 2016 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు.. నెలకు రూ.63 వేల చొప్పున అద్దె రూపంలో యూనివర్సిటీ నుంచి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనం అద్దె పేరిట 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడాన్ని ఆడిట్ శాఖ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది.

స్మితా సభర్వాల్ అద్దెకు తీసుకున్న టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు, ఎల్లో ప్లేట్ వాహనం కాదు. ప్రైవేటు వ్యక్తిగత వాహనం పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో వెల్లడైంది. సీఎంవో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో యూనివర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పనితీరుపై ఇటీవల ఏజీ జరిపిన విచారణలో కొన్ని తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు వెల్లడయ్యాయి. అందులో ఈ అంశం కూడా ఉంది. ఈ విషయంపై వివరణ కోరగా... స్మితా సభర్వాల్ వాహన అద్దెపై ఆడిట్ అభ్యంతరం నిజమేనని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్దాస్ జానయ్య అన్నారు.

ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ, విశ్లేషణ జరిపించామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి తీసుకురావడం ద్వారా సమావేశంలో కూడా విస్తృతంగా చర్చించామని, ఈ విషయంపై సమగ్ర నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, న్యాయనిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వర్సిటీ వీసీ పేర్కొన్నారు.

## స్పై కెమెరా.. నియంత్రణ విధించే వస్తువు కాదు: కేంద్రం

హైదరాబాద్: స్పై కెమెరాల విక్రయాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. "ఆన్‌లైన్, షాపుల్లో సులభంగా స్పై కెమెరాలు లభిస్తున్నాయి. ఇటీవల మహిళల వసతి గృహాల్లోని బాత్‌రూమ్‌లు, గదుల్లో ఇవి బయటపడ్డాయి. స్పై కెమెరాల విక్రయాలపై నియంత్రణ ఉండాలి" అని న్యాయవాది శ్రీరమ్య కోర్టును కోరారు. అవి దుర్వినియోగమైతే చర్యలు తీసుకునేలా చట్టాలున్నాయని కేంద్రం తరఫు న్యాయవాది ముఖర్జీ కోర్టు దృష్టికి తెచ్చారు.



ప్రతి మొబైల్‌లోనూ కెమెరాలున్నాయని, వాటిని ఎలా నియంత్రించగలమని ఈ సందర్భంగా సీజే ప్రశ్నించారు. మొబైల్ కెమెరాలను గుర్తించే అవకాశం ఉందని, స్పై కెమెరాలను రహస్యంగా అమర్చుతున్నారని న్యాయవాది శ్రీరమ్య తెలిపారు. స్పై కెమెరాల విక్రయాలపై మార్గదర్శకాలు జారీ చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరారు. స్పై కెమెరా.. నియంత్రణ విధించే వస్తువు కాదని కేంద్రం తరఫు న్యాయవాది తెలిపారు. వీటి విక్రయాలపై కేంద్రానికి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేమన్న హైకోర్టు.. పిటిషన్‌పై విచారణను ముగించింది.

## అంకెల గారడీతో ప్రజలను మరోసారి మోసం చేశారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

%హైదరాబాద్: అట్టహాసంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన జరిగిందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్‌పై కిషన్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడీతో తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసిందన్నారు.



"పదేళ్లపాటు భారాస రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అగాథంలోకి నెట్టేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు రాష్ట్రాన్ని పెనంపై నుంచి పొయ్యిలోకి పడేసినట్టు చేసింది. గతేడాది బడ్జెట్ పెట్టినప్పుడు తొలి ఏడాదే కదా అని తప్పించుకున్నారు. 15 నెలలు పాలించిన తర్వాత కూడా ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలును పూర్తిగా విస్మరించారు. వివిధ ప్రాజెక్టులకు భారీగా ప్రకటనలు చేసినా.. కేటాయింపులు, ఆచరణ శూన్యమని ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. అంకెల గారడీ ద్వారా మరోసారి తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిన బడ్జెట్ ఇది. ఎన్నికల హామీలపై ప్రజలు ఆశలు వదులుకోవాలని బడ్జెట్ నిరూపించింది. ప్రభుత్వ ఆదాయం, రాబడిపై కనీస అవగాహన లేకుండా అంచనాలు రూపొందించారు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## తెలంగాణ బడ్జెట్.. పేదల కష్టాలను తీర్చేలా లేదు: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ బడ్జెట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి పేక మేడలా కూల్చిందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల కష్టాలను తీర్చేలా లేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్ దిల్లీకి మూటలు పంపేందుకు మాత్రమే ఉపయోగపడేలా ఉందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. రుణమాఫీ జరిగిందో లేదో కాంగ్రెస్ వాళ్లకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. అంకెలు ఎందుకు మారాయో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్ల ప్రగతి రథ చక్రానికి పంక్చర్ చేశారని కేటీఆర్ దుయ్యబట్టారు.



# అస్ట్రోనట్స్ సేఫ్ ల్యాండ్ పూర్తిగా కోలుకోవడానికి 6 నెలల టైమ్

వ్యోమనౌక మొరాయించడంతో తొమ్మిది నెలలుగా అంతరిక్షంలోనే ఉండిపోయిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు భువిపై సురక్షితంగా అడుగుపెట్టారు.. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి మంగళవారం తిరుగుప్రయాణం అయిన సునీతా విలియమ్స్, విల్మోర్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3:27కి ఫ్లోరిడా తీరంలో సేఫ్‌గా ల్యాండ్ అయ్యారు.. డ్రాగన్ వ్యోమనౌక సముద్ర తీరంలో ల్యాండ్ అవ్వగానే.. సహాయ బృందాలు రంగంలోకి దిగి.. క్రూ డ్రాగన్‌ను వెలికితీస్తాయి. ఆ తర్వాత ఆస్ట్రోనాట్‌లను స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్' క్యాప్సూల్ నుంచి బయటకు తీసుకొచ్చారు.. ఊహించని సవాళ్లు, చారిత్రాత్మక క్షణాలతో నిండిన ఈ మిషన్ సేఫ్ గా ముగియడంతో ఆనందం వెల్లివిరిసింది. 286 రోజుల తర్వాత సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లు సురక్షితంగా పుడమిని చేరినట్లు నాసా ప్రకటించింది..ఫ్లోరిడా తీరంలో స్పేస్‌ఎక్స్ క్రూ-9 మిషన్ భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించిన క్షణాలను నాసా టీవీ, యూట్యూబ్, ఔయాం+లో లైవ్ ప్రసారం చేసింది.. దివి నుంచి భువికి చేరిన వారిలో సునీతా విలియమ్స్, విల్మోర్‌తో పాటు స్పేస్‌ఎక్స్ క్రూ-9 వ్యోమగామి నిక్ హేగ్, రష్యన్ వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ ఉన్నారు.వ్యోమగాముల జీవితం ఓ సాహసం. అంతరిక్షంలోకి వెళ్లడమే ఓ సాహసం అయితే అక్కడ వాతావరణాన్ని తట్టుకుని నిలబడటం, తిరిగి భూమిపైకి వచ్చిన తర్వాత ఈ వాతావరణంలోకి మారే సమయంలో వారి జీవన గమనం అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటుంది. అలాంటిది పలుమార్లు అంతరిక్షయానం చేసిన సునీతా విలియమ్స్ గతంలో చాలా సార్లు ఇలాంటి అనుభవాలను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి ఆమెకి మరో పెద్ద సవాల్ ఎదురైంది. దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలో అక్కడి వాతావరణానికి అలవాటు పడిన ఆమె రేపటి నుంచి భూమి వాతావరణానికి అడ్జస్ట్ కావాల్సి ఉంటుంది. వ్యోమగాములు శారీరకంగా కొన్ని సవాళ్లను ఎదుర్కొంటారు, మానసికంగా కూడా మరిన్ని సవాళ్లను వారు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి తక్కువ. స్పేస్ లో వారు ఉన్న ఆ కాస్త ప్లేస్ లోనే ఒంటరిగా జీవితం గడపాల్సి ఉంటుంది. అంతరిక్ష కేంద్రంలో మరో వ్యక్తి తోడు ఉన్నా కూడా ఇరుగు పొరుగుతో మాట్లాడినట్టు అక్కడ కబుర్లు, కాలక్షేపానికి చోటు ఉండదు. అందుకే నిరంతరం తమ శరీరాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ తిరిగి భూమిపైకి వెళ్లే సమయం వరకు ఆరోగ్యంగా ఉంటూ సమయం కోసం వేచి చూస్తుంటారు వ్యోమగాములు. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి తక్కువ కాబట్టి.. దానికి తగ్గట్టే వారి జీవన విధానం మారిపోతుంది. ముఖ్యంగా గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం వల్ల మానవ శరీరంలో కండరాలు ఇబ్బంది పడతాయి. వాస్తవంగా గురుత్వాకర్షణ శక్తి ఉంటే కండరాలకు పని ఉంటుంది. అది లేకపోవడం వల్ల కండరాలు ఎక్కువ కష్టపడాల్సిన అవసరం లేదు. ఒకరకంగా ఈ స్థితి కండరాల క్షీణతకు దారి తీస్తుంది.అంతరిక్షంలో మానవ శరీరంలోని ఎముకలు తమ ద్రవ్యరాశిని 1 నుంచి 2 శాతం కోల్పోతాయి. ఆస్టియో పోరోసిస్ లాగా ఎముకలకు నష్టం జరుగుతుంది. ఎముకల సాంద్రత తగ్గుతుంది, వాటిల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. భూమిపైకి వచ్చిన తర్వాత ఆ నష్టం నుంచి కోలుకోడానికి వారికి సరైన వ్యాయామం అవసరం. పూర్తిగా కోలుకోడానికి కనీసం 2 నుంచి 3 నెలల సమయం పడుతుందని అంచనా.అంతరిక్షం నుంచి భూమిపైకి వచ్చిన తర్వాత హృదయ స్పందనలు, రక్త సరఫరా వంటి వాటిల్లో కూడా సమతుల్యత లోపించే ప్రమాదం ఉంది. భూమిపైకి వచ్చిన తర్వాత వ్యోమగాములకు తరతిరగడం వంటివి సహజం. దీన్ని నివారించేందుకు వారికి రోజుల తరబడి బెడ్ రెస్ట్ అవసరమని చెబుతుంటారు వైద్యులు. తిరిగి వారు సాధారణంగా నడవడం, ఇతర పనులు చేసుకోడానికి తగిన సమయం ఇస్తారు.అంతరిక్ష కేంద్రంలో రక్తంతోపాటు శరీరంలోని ఇతర ద్రవాల ప్రవాహం ఎక్కువగా తలవైపునకు ఉంటుంది. అందుకే వ్యోమగాములకు ముఖాల వాపు సహజ లక్షణం. వారు భూమిపైకి తిరిగి వచ్చిన తర్వాత రక్తపోటులో అసహజ మార్పులు కనిపించవచ్చు. వారు పడుకొని ఉంటే రక్తపోటు సాధారణ స్థాయిలో ఉంటుంది. నిలబడితే మాత్రం రక్తపోటు తక్కువగా ఉండే ప్రమాదం ఉంది.అంతరిక్ష కేంద్రంలో బ్యాక్టీరియా, వైరస్‌లకు చోటు ఉండదు కాబట్టి శరీరంలో ఉండే రోగ నిరోధక వ్యవస్థ కూడా పూర్తిగా చప్పబడి ఉంటుంది. భూమిపైకి తిరిగి వచ్చిన తర్వాత దాని అవసరం ఎక్కువగా ఉంటుంది. అయితే అప్పటికే బలహీన పడిన రోగనిరోధక వ్యవస్థ తిరిగి పూర్తిస్థాయిలో పనిచేయడానికి, శరీరానికి రక్షణ కవచంలా ఉండటానికి ఎక్కువ సమయం పట్టొచ్చు. అంతరిక్షంలో రేడియేషన్ ప్రభావానికి ఎక్కువగా శరీరం గురవుతుంది. భూమిపైకి తిరిగొచ్చిన తర్వాత ఆ ప్రభావం పూర్తిగా ఉండదు కాబట్టి దానికి తగినట్టు శరీరం సర్దుబాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.వ్యోమగాములకు దృష్టి సమస్యలు కూడా సహజం. అంతరిక్షంలో ఎక్కువరోజులు గడిపి భూమిపైకి వచ్చిన తర్వాత కంటి సమస్యలు ఎదురవుతాయి. ఇవి దీర్ఘకాలికంగా వారిని ఇబ్బంది పెట్టే అవకాశముంది. స్పేస్ ఫ్లైట్ అసోసియేటెడ్ న్యూరో ఓక్యులర్ సిండ్రోమ్ వ్యోమగాముల్ని ఇబ్బంది పెడుతుంది.శారీరక సమస్యలు ఒక ఎత్తు అయితే, మానసిక సమస్యలు మరో ఎత్తు. అంతరిక్షంలో నెలల తరబడి ఒంటరిగా జీవనం సాగించిన వ్యోమగాములు, భూమిపైకి చేరుకోగానే రోజువారీ జీవితాన్ని గడిపేందుకు ఇబ్బంది పడతారు. ఈ సమయంలో వారికి మానసిక వైద్య నిపుణుల మద్దతు, కౌన్సెలింగ్ అవసరం. కుటుంబ సభ్యులు కూడా వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని వారికి సహకరించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో తీవ్ర ఒత్తిడి, నిరాశకు వ్యోమగాములు గురవుతారని అంచనా. ఆ ఒత్తిడిని కూడా వారు జయించాల్సి ఉంటుంది.

# వెంటాడుతున్న పాపాలు

తిరుపతి, మార్చి 19,

సరిగ్గా రెండేళ్ల క్రితం జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. ఆరోజే వైసీపీ ఓటమి ఖరారయింది. 2022 జులై లేదా ఆగస్టు నెలలో నలుగురైదుగురితో ఒక కీలక మీటింగ్ .. నాకు సన్నిహితుడైన ఒక అన్న నువ్వు కచ్చితంగా రావాలి అని తీసుకెళ్లాడు.. 2023 మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మీద చర్చ నడిచింది.. అధికారపార్టీ పరిస్థితి బాగాలేదు అని అందరి అభిప్రాయం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగులుతుందని తేల్చి చెప్పారు.. ఆ కీలక నేత మాత్రం సర్లే చూద్దాం అంటూనే అయినా ఏమవుతుందిలే అనేశారు. ఈ మీటింగ్ జరిగిన రెండు నెలల తరువాత ఊహించని అభ్యర్థి ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలోకి వచ్చారు..పశ్చిమ రాయలసీమ మరియు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇద్దరూ నాకు సన్నిహితులే. రాజధాని పనులను సొంత ప్లానింగ్ తోనే... మరోవైపు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ప్రచారం మీద మంచి రిపోర్ట్ అందుతుంది.. మంచి ప్లానింగ్ ,ఓట్ల ఎన్ రోల్ మెంట్ , ప్రతి మండల కేంద్రంలో ఆయన టీమ్ తరుపున మీటింగులు పెట్టడం .. పని బాగుంది.. ఎక్కడ కూడా టీడీపీ పెద్ద స్థాయి నాయకుల మీద ఆధారపడకుండా ఆయన టీమ్ పనిచేసుకుంటూ వెళుంది.. గెలుపుకు ఏమి చేయాలో అది చేస్తున్నారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డితో వ్యక్తిగత పరిచయం లేదు కానీ ఆయన క్లాస్ మేట్స్ ,మిత్రులు చాలా మంది నాకు ఫ్రెండ్స్ .. మా శంకరన్న ,బి టెక్ రవి ఉ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి క్లాస్ మేట్స్ .. సో రాంగోపాల్ రెడ్డి గురించి బాగా తెలుసు మరో వైపు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చిన్నప్పుడు అంటే తాను చదివేటప్పుడు తెలుసు.. వాళ్ళ మేనబావ నాకు ఇంటర్లో క్లాస్ మేట్.. శ్రీకాంత్ తండ్రి ఈనాడు రామయ్య గురించి కూడా అప్పటి నుంచే తెలుసు.. ఈనాడు రామయ్య దగ్గుబాటి చంద్రబాబు వర్గాల వైరం మధ్య నలిగిపోయి ఏ పదవి పొందలేకపోయారు కానీ జిల్లాలో మంచి గుర్తింపు ఉన్న వ్యక్తి.. మా మార్కాపురం కూడా తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కిందికే వస్తుంది.. ప్రతి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా కుటుంబం కీలకంగా పనిచేస్తుంది.. మొదటి ఎమ్మెల్సీ (2007)విఠపు బాలసుబ్రహ్మణ్యం మా తండ్రి కాలేజ్ మేట్స్. 2023 జనవరి వచ్చింది.. అధికార వైసీపీ అభ్యర్థుల ప్రచారం ఎవరికీ అర్థం కాలేదు.. ఒక నియోజకవర్గం పోవటం స్థానిక ఎమ్మెల్యేతో కలసి వంద రెండు వందల మందితో మీటింగ్ పెట్టటం జగన్ కోసం ఓటు వేయండని అడగటం.. ఒక టీమ్ కానీ వార్ రూమ్ కానీ లేకుండా ప్రచారం జరిగింది.. టీడీపీ అభ్యర్థుల గెలుపు జనవరికే నిర్ధారణ అయ్యింది.. అనుకున్నట్లే సరిగ్గా రెండేళ్ల కిందట ఇదే రోజు. 18 మార్చి 2023న కౌంటింగ్ జరిగింది ,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ మూడు వైసీపీ ఓడిపోయింది. విద్యా శాఖలో ఒక కీలక అధికారి ప్లానింగ్ వలన టీచర్స్ ఎమ్మెల్సీ లు రెండు వైసీపీ గెలిచింది.సరే.. ఎందుకు ఓడిపోయాం అని అంతర్మథనం జరిగిందా అంటే నాకు తెలిసి లేదు... మా ఓటర్లు వేరే ఉన్నారు అని సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందు అన్నారు.. అది సజ్జల గారి నిజమైన అభిప్రాయం కాకపోవచ్చు.. మీడియాకు ఏదో ఒక సమాధానం చెప్పాలి కాబట్టి ఆమాట అన్నారనిపించింది.. అప్పటి నుంచే పునాదులు... 2023 జనవరి నుంచే వైసీపీ ఓటమికి పునాదులు పడ్డాయి.. అప్పటి నుంచి టీడీపీ ప్రతి స్టెప్ 2024 అసెంబ్లీ ఎన్నికల గెలుపు వైపే పడింది.. వైసీపీ 2023 జనవరిలో మేలుకొని ఉంటే గెలిచినా గెలవకున్నా ఇంత ఘోరమైన ఓటమి పాలయ్యేది కాదు .మొన్న మార్చి రెండో తేదీన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గారిని ఒక పెళ్ళిలో కలిసి మాట్లాడాను.. నాలుగో తారీఖున కౌంటింగ్ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల మీద ఆయన అభిప్రాయం అడిగాను .. గుంటూరు-కృష్ణా ఉ గోదావరి గ్రాడ్యుయేట్ గెలుస్తాం, ఉత్తరాంధ్ర టీచర్స్ ఓడిపోతాం అని చెప్పారు. భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గోదావరి ఎమ్మెల్సీ ఎన్నికకు, కంచర్ల శ్రీకాంత్ గుంటూరు-కృష్ణా ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంచార్జులుగా పనిచేశారు.. ఉత్తరాంధ్ర టీచర్స్ లో అభ్యర్థి వీరి మాట వినలేదు.. అందుకే ఓడిపోతాం అని ఆయన అంచనా.. ఆయన అంచనాలు



నిజమయ్యాయి.. పోలింగ్ రోజున... గుంటూరు-కృష్ణ పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణ్ రావు నాకు ,మా అన్నకు చాలా కాలంగా పరిచయం.. ప్రతి ఎన్నికకు ఆయనకు మేము చేయగల మద్దతు ఇస్తాం.. మొన్న కూడా ఫిబ్రవరి పదిహేనున కలిశాను .. టీడీపీ బలాన్ని తట్టుకోగలమా అనే అనుమానం అందరిలో ఉంది. అనుకున్నట్లే పోలింగ్ రోజు అధికారపార్టీ బలాన్ని చూపించింది.. సార్ ఓడిపోయిన రెండుసార్లు టీడీపీ అభ్యర్థి మీదనే కావటం విశేషం. ఉత్తరాంధ్ర టీచర్స్ ఓటమి ప్రభుత్వానికి టీచర్లు కర్రు కాల్చి వాత పెట్టారు అని నాటి ప్రతిపక్షం విమర్శించింది. ఈ మూడు అంటే టీడీపీ గెలిచిన రెండు గ్రాడ్యుయేట్ , ఓడిపోయిన టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితాలు ప్రభుత్వం మీద ప్రజా అభిప్రాయంగా చూడవలసిన అవసరం లేదు. సమర్ధులైన నాయకులు.. ప్రభుత్వ పనితీరు అద్భుతంగా ఉంది కాబట్టి గెలిచారనో ప్రభుత్వ పనితీరు బాగాలేదు అందుకే టీచర్స్ ఓడించారనో భావించవలసిన అవసరం లేదు..ఆ స్థాయి అభిప్రాయలు గ్రౌండ్లో ఇంకా ఏర్పడలేదు. టీడీపీ ఎన్నికలను ఎంత సీరియస్ గా తీసుకుంటుంది ఉ ఏ స్థాయిలో ఎన్నికలు చేయగలదో ఈ ఫలితాలు చెబుతాయి.భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఉ కంచర్ల శ్రీకాంత్ రూపంలో మాత్రం టీడీపీకి ఎన్నికలు చేయగలిగిన ఇద్దరు సమర్థమైన నాయకులు దొరికారు ... పూర్వ ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన కంచర్ల శ్రీకాంత్ మూడేళ్ళ నుంచీ కుప్పంలోనే కాపురం ఉంటూ చంద్రబాబు గారి ఎన్నిక కోసం పనిచేశారు.. ఇప్పుడు కూడా అక్కడే ఉంటున్నారు.

# లయోలాలకు అటానమస్ రద్దు...

విజయవాడ, మార్చి 19, (

విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అటానమస్ హోదాను కృష్ణా యూనివర్శిటీ రద్దు చేసింది. కృష్ణా యూనివర్శిటీ నియమించిన కమిటీ విచారణలో పలు లోపాలను గుర్తించడంతో అటానమస్ హోదాను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. లయోలా కాలేజీలో అకడమిక్, ఎగ్జామినేషన్స్, ఫైనాన్షియల్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలపై కృష్ణా యూనివర్శిటీ కొద్ది నెలల క్రితం విచారణకు ఆదేశించింది. కమిటీ దర్యాప్తులో పలు ఉల్లంఘనలు గుర్తించారు. యూజీసీ నియమనిబంధనలు ఉల్లంఘించినట్టు తేలడంతో ఆంధ్రా లయోలా కాలేజీ స్వతంత్ర హోదాను రద్దు చేసి కృష్ణా యూనివర్శిటీ అనుబంధ కళాశాలగా పరిగణించనున్నట్టు పేర్కొన్నారు.ఆంధ్రా లయోలా కాలేజీకి సంబంధించిన అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, కోర్సులు, ఫీజుల వివరాలు, పరీక్షలకు సంబంధించిన డాక్యుమెంట్స్, సర్టిఫికెట్స్‌లను పది రోజుల్లో యూనివర్శిటీకి అప్పగించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిగిలిన అఫిలియేటెడ్ కాలేజీలతో పాటు విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు.విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ అటానమస్ హోదాను రద్దు చేయడానికి యూజీసీ నియమ నిబంధనలు పాటించకపోవడం కారణంగా చెబుతున్నా అసలు కారణం మాత్రం కాలేజీ ప్రాంగణంలోకి వాకర్లను అనుమతించ పోవడంగా తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా లయోలా కాలేజీ ప్రాంగణంలోకి వాకర్లను అనుమతించాలంటూ స్థానికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇందుకు కాలేజీ యాజమాన్యం నిరాకరిస్తోంది.ఈ వివాదంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయింది. ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిలో రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు కూడా చేసింది. సమీపంలో ఉన్న ప్రభుత్వ కాలేజీల్లో కాకుండా ప్రైవేట్ కాలేజీ స్థలంలో వాకింగ్ కోసం పట్టుబడుతున్నారని లయోలా అభ్యంతరం తెలిపింది.నగరం మధ్యలో ఉన్న ఆంధ్రా లయోలా కాలేజీలో వాకింగ్ చేయడానికి అనుమతి కోసం వాకర్ సంఘాలు కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నాయి. సున్నితమైన ఈ వ్యవహారంలో ప్రభుత్వం నెలల తరబడి ఉదాసీనంగా వ్యవహరించడంతో ఇది కాస్త రాజకీయ రగడగా మారింది. నగరం మధ్యలో ఉన్న ఈ కాలేజీ దాదాపు 100ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది.1950వ దశకంలో మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం అవతరించే సమయంలో లయోలా కాలేజీకి అంకురార్పణ జరిగింది. ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటైన ఈ విద్య సంస్థ ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. క్యాథలిక్ మైనార్టీ విద్యా సంస్థగా.. జెస్యూట్ మిషనరీల ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా నడుస్తున్న లయోలా అనుబంధ సంస్థల్లో ఆంధ్రా లయోలా కాలేజీ ఒకటి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం మద్రాసు వెళ్లాల్సిన రోజుల్లో విజయవాడ కేంద్రంగా తెలుగు ప్రజల కోసం ఈ కాలేజీని ఏర్పాటు చేశారు. అప్పట్లో విద్య ప్రాధాన్యతను గుర్తించిన విజయవాడ నగరానికి చెందిన ప్రముఖులు, భూస్వాములు ఈ సంస్థకు భూములను సేకరించడానికి సహకరించారు. కాలేజీ నిర్మాణానికి దేశవిదేశాల నుంచి ఎంతోమంది దాతలు ఉదారంగా విరాళాలు ఇచ్చారు.ఒకప్పుడు విజయవాడ నగరానికి దూరంగా ఉన్న లయోలా కాలేజీ పట్టణీకరణ నేపథ్యంలో ప్రస్తుతం విజయవాడ నగరం మధ్యలోకి చేరింది. చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై దాదాపు 100ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాలేజీలో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, సాంస్కృతిక కేంద్రాలు ఉన్నాయి. అధ్యాపకులకు శిక్షణ ఇచ్చే కేంద్రం కూడా ఉంది. కాలేజీ ఆవరణలో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు వేర్వేరుగా



హాస్టళ్లు ఉన్నాయి. డిగ్రీ, పీజీ విద్యార్థినులకు కూడా హాస్టళ్లు ఉన్నాయి. విద్యార్థినుల భద్రతా కోణంలో కూడా లయోలా వాకర్ల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తోంది.కాలేజీ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్థానిక ప్రజలు కొన్నేళ్లుగా కాలేజీ ప్రాంగణంలో వాకింగ్ చేస్తున్నారు. మొదట్లో పదుల సంఖ్యలో ఉన్న వాకర్లు ఇప్పుడు వందల సంఖ్యకు చేరుకున్నారు. కోవిడ్ 19 ప్రబలిన తర్వాత కాలేజీ ప్రాంగణంలో వాకింగ్ చేయడంపై కాలేజీ యాజమాన్యం ఆంక్షలు విధించింది. వాకింగ్‌కు అనుమతించకపోవడంతో వాకర్ అసోసియేషన్లు? పోలీసులకు, ప్రభుత్వ శాఖలకు, స్థానిక రాజకీయ నాయకులకు ఫిర్యాదు చేయడంతో కాలేజీలో వాకింగ్ చేయడానికి అనుమతించాలని తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనట్టు లయోలా గతంలో ఆరోపించింది. ఈ క్రమంలో కాలేజీ యాజమాన్యం కళాశాల ప్రాంగణంలోకి ప్రైవేట్ వ్యక్తులను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దీంతో వివాదం మొదలైంది. క్రమంగా ఇది కాస్త రాజకీయ రగడగా మారింది.లయోలా కాలేజీ గ్రౌండ్స్‌లోకి వాకర్లను అనుమతించే విషయంలో వివాదం కొనసాగుతుండగానే కాలేజీ వ్యవహారాలపై యూనివర్శిటీకి ఫిర్యాదులు అందాయి. యూజీసీ అనుమతులు పునరుద్ధరించక పోవడంతో పాటు పరీక్షల నిర్వహణ, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలపై కృష్ణా యూనివర్శిటీ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో కాలేజీ అటానమస్ హోదాను రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

====================

# వైసీపీ నేతల మెడకు లిక్కర్ స్కాం

కడప, మార్చి 19,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని విస్తృత ప్రచారం జరుగుతోంది. రాజకీయ ఎత్తుగడలతో పాటు ప్రత్యర్థులపై పై చేయి సాధించే క్రమంలో తాజా పరిణామాలు చోటు చేసుకుంటాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం ధరల్ని అమాంతం పెంచేసింది.సంపూర్ణ మద్య నిషేధంలో భాగమంటూ మద్యం విక్రయాలపై రకరకాల ప్రయోగాలు చేశారు. 2019 చివరిలో కొత్త లిక్కర్ పాలసీని వైసీపీ ప్రవేశపెట్టింది. మద్యం దుకాణాల స్థానంలో ప్రభుత్వమే మద్యం విక్రయించేలా వైన్ షాపుల్ని ఏర్పాటు చేశారు.ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం భారీగా పెరిగింది. అదే సమయంలో మద్యం బ్రాండ్లపై తీవ్ర విమర?శలు వచ్చాయి. పొరుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఏపీలో మద్యం ధరల్ని పెంచేశారు. 2019 మే నెలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే రెండు, మూడు రెట్లు అధికంగా వసూలు చేశారు. ఆ తర్వాత పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం రవాణా అధికం కావడం, నాటుసారా వినియోగం పెరగడంతో విధిలేని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాలతో సమానం చేశారు.ధరల్ని కొంత మేర తగ్గించిన మద్యం బ్రాండ్ల మతలబు మాత్రం ఐదేళ్ల పాటు సాగింది. జనం కోరుకునే బ్రాండ్లను కాకుండా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్మే బ్రాండ్లను మాత్రమే కొనాల్సిన పరిస్థితి కల్పించారు. బ్రాండ్లతో సంబంధం లేకుండా రూ.150 నుంచి ధరల్ని ఖరారు చేసి మద్యాన్ని విక్రయించారు. దీంతో నాణ్యత లేని మద్యాన్ని కూడా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందనే అక్రోశం ప్రజల్లో పెరిగింది. ఊరు పేరు లేని బ్రాండ్లను ఊరురా విక్రయించడంలో ప్రభుత్వ పెద్దలు వ్యూహాత్మకంగా వ్యవహరించినట్టు సిట్ దర్యాప్తులో వెల్లడైంది.ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారు రాజ్ కసిరెడ్డి కనుసన్నల్లో ఈ కొనుగోళ్ల తతంగం నడిచింది. మద్యం విక్రయాలను కేవలం నగదును మాత్రమే అనుమతించడం ద్వారా ఎప్పటికప్పుడు ముడుపులు నేరుగా ప్రభుత్వ పెద్దలకు చేరి ఉంటాయని కూటమి ప్రభుత్వం అనుమానిస్తోంది. ఏపీబేవరేజీస్ కార్పొరేషన్ ఉద్యోగులను విచారించడంతో లిక్కర్ ఇండెంట్ల గుట్టు మాత్రం వీడింది. ఏ రోజు ఏ దుకాణానికి ఏ బ్రాండ్లు వెళ్లాలో కూడా ప్రభుత్వంలో కీలక వ్యక్తులే నిర్ణయించే వారు.మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో రూ.3వేల కోట్ల రుపాయల అక్రమాలు జరిగాయని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ ముడుపులన్నీ చివరిగా ఓ చోటకు చేరినట్టు సాక్ష్యాధారాలు లభించాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సన్నిహితుడు, ఎంపీ మిథున్ రెడ్డి వరకు చేరాయి. వైసీపీలో కీలకంగా ఉన్న నాయకుల్లో మిథున్ రెడ్డి కూడా ఒకరు. మరోవైపు మద్యం కొనుగోళ్లు, అక్రమాల వ్యవహారంలో వైసీపీ అగ్రనేతలపై కూడా చర్యలు ఉంటాయని విస్తృత ప్రచారం జరుగుతోంది. మద్యం ప్రయోజనాలన్నీ అంతిమంగా ఒకే చోటుకు చేరాయని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల కాకినాడ సీ పోర్టు వ్యవహ?రంలో సీఐడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా లిక్కర్ సిండికేట్ల అంశాన్ని ప్రస్తావించారు. ఈ కేసుల్లో సాయిరెడ్డి అప్రూవర్‌గా మారుతారనే ప్రచారం కూడా జరుగుతోంది. సాయిరెడ్డి గుట్టు విప్పితే వైసీపీ పెద్దలు చిక్కుల్లో పెడతారని ప్రచారం ఉంది.

ఆంధ్రప్రదేశ్ మద్యం కొనుగోళ్లలో అక్రమాలపై సిట్ దర్యాప్తు నేపథ్యంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టను ఆశ్రయించారు. గత ఏడాది సెప్టెంబరు 23న సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలని వైకాపా ఎంపీ మిథున్ రెడ్డి.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కేసులో మధ్యంతర ముందస్తు బెయిలు ఇవ్వాలని కోరుతూ అనుబంధ పిటిషన్ సమర్పించారు. మద్యం కుంభకోణం కేసులో తనను చేర్చినట్లు ఇటీవల మీడియా కథనాలు వచ్చా యని ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రత్యే కాధికారిగా పనిచేసిన సత్యప్రసాద్ మెజిస్ట్రేట్ ముందు ఇచ్చిన వాంగ్మూలాన్ని సైతం మీడియా ప్రచురించిందని మిథున్ రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు.వైసీపీ ప్రభుత్వంలో మద్యం కంపెనీలకు నష్టం, కొన్నింటికి అనుచిత లబ్ధి కలిగేలా లావాదేవీలను తానే పర్య వేక్షించినట్లు అందులో ఆరోపించారని, ఇవి నిరాధారమై నవని తెలిపారు. సంబంధిత కోర్టులో మెమో దాఖలు చేసి నిందితులను అరెస్టు చేసేందుకు సీఐడీ చర్యలు తీసుకుంటోందని, ఈ మెమో కోసం తాను విఫల యత్నం చేశాన, తనను ఎప్పుడైనా అరెస్ట్ చేసే అవకాశముందన్నారు.ప్రత్యేకాధికారి, వాంగ్మూలంలోని అంశాలు వాస్తవమనుకున్నా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న సెక్షన్లు తనకు వర్తించబోవని తెలి పారు. ఏప్రిల్ వరకు బడ్జెట్ సమావేశాలు ఉన్నం దున సభకు తాను హాజరుకావాల్సి ఉందని తెలి పారు. తన కస్టోడియల్ విచారణ అవసరం లేదని దర్యాప్తునకు సహకరిస్తానని, మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# మంత్రి పదవికి ఇంకా టైముంది

విజయవాడ, మార్చి 19,

నాగబాబుకు మంత్రి పదవి ఎప్పుడు? ఉగాదికి ఇస్తారా? లేకుంటే జూన్ లో పదవి ఇస్తారా? లేకుంటే మంత్రివర్గ విస్తరణ సమయంలో పదవి కేటాయిస్తారా? అన్నది ఇప్పుడు చర్చకు దారితీసింది. నాగబాబును క్యాబినెట్ లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు కొద్ది నెలల కిందట ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే నాగబాబు ఏ సభలోను సభ్యుడు కారు. అందుకే ముందుగా ఎమ్మెల్సీ ని చేసి.. ఆపై మంత్రిని చేస్తారని ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఎమ్మెల్సీ కావడంతో మంత్రి పదవి ఎప్పుడు ఇస్తారు అన్నది ప్రశ్న.మరోవైపు బిజెపికి ఒక మంత్రి పదవి ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వస్తోంది. ఇప్పటికే జనసేనకు మూడు మంత్రి పదవులు ఇచ్చారు. సంఖ్యాబలం బట్టి తమకు మరో మంత్రి పదవి ఇవ్వాలని బిజెపి పట్టుబడుతోంది. బిజెపికి ఒకే ఒక మంత్రి పదవి కేటాయించారు. కానీ ఆ పార్టీ నుంచి దాదాపు 8 మంది గెలిచారు. సుజనా చౌదరి తో పాటు విష్ణుకుమార్ రాజు మంత్రి పదవి ఆశిస్తున్నారు. క్యాబినెట్ లో ఉన్నది ఒకే ఒక్క మంత్రి పదవి. అందుకే ఆ పదవి జనసేనకు ఇవ్వాలా? బిజెపికి ఇవ్వాలా? అనే ఆలోచనలో ఉన్నారు చంద్రబాబు.అయితే నాగబాబు ఎమ్మెల్సీ అయ్యారు. ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలంటే తప్పకుండా మంత్రి పదవి ఇవ్వాలి. అయితే అది ఇప్పుడు ఇస్తారా? కొద్ది కొద్ది రోజులపాటు ఆగిన తర్వాత ఇస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం క్యాబినెట్లో ఉన్న మంత్రులు పదిమంది కొత్తగా గెలిచినవారే. రెండున్నర ఏళ్ల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అప్పట్లో సీనియర్లకు అవకాశం కల్పించి జూనియర్లకు పక్కన పెడతారని కూడా టాక్ నడుస్తోంది. అయితే అంతవరకు మంత్రి పదవి అందని ద్రాక్షగా ఉంటుందన్నది ఒకసారి కొత్త టాక్.నాగబాబు ఇటీవల ఎమ్మెల్సీ అయ్యారు. ఆయన పదవీకాలం ఆరేళ్లు. అందుకే మంత్రివర్గ విస్తరణ వరకు ఆయనకు వెయిట్ చేయిస్తారని తెలుస్తోంది. అప్పట్లో 25 మంది మంత్రుల్లో సగానికి పైగా ఉద్వాసన చెబుతారని.. వారి బదులు సీనియర్లకు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఈ లెక్కన నాగబాబు అప్పటివరకు ఆగాల్సిందేనని కూటమి వర్గాలు చెబుతున్నాయి. అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## పిల్లలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఎంతో మంది తల్లిదండ్రులకు కడుపుకోత: హోంమంత్రి వంగలపూడి అనిత

విజయవాడ

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం. హెల్మెట్ ధరించకపోతే రూ.1000 జరిమానా. 'హెల్మెట్' విషయంలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అమలు చేస్తున్నామని మంత్రి అనిత అన్నారు. బుధవారం నాడు ఆమె శాసనమండలిలో మాట్లాడారు. ప్రాణమా? వెయ్యి రూపాయలా? అన్న సున్నితత్వాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. పౌరుల్లో మార్పు కోసమే రూ.100 ను రూ.వెయ్యికి పెంచింది. మనమెంత జాగ్రత్తగా ఉన్నా ఎదుటివారి అజాగ్రత్తవల్ల కూడా ప్రమాదాలు జరిగే రోజులివి. హెల్మెట్ విషయంలో కఠినంగా వ్యవహరించకపోతే ఇంకా చాలా ప్రాణాలు పోగొట్టుకుంటాం. కేంద్రం, సుప్రీం మార్గదర్శకాలను అమలు చేయక తప్పదు. జాతీయ ,రాష్ట్ర రహదారి భద్రతామండళ్ల సంయుక్తంగా సభ్యులు. ఏడాదికి రెండు సార్లు ముఖ్యమంత్రి, రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖ మంత్రి, డీజీపీలు సమీక్షిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పర్యవేక్షణ వుంటుందని అన్నారు.

జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్పీతో కలిసి ప్రతి 15 రోజులకొకసారి సమీక్ష. రోడ్లు,భవనాలు, రవాణా, విద్యా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణ వుంటుంది. 961 బ్లాక్ స్పాట్లను గుర్తించి, 1117 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పకడ్బందీగా అమలు చేస్తున్నాం. 2021-2024 వరకూ జరిగిన ప్రమాదాలు సగటున ఏడాదికి 7వేల పైన ఘోర రోడ్డు ప్రమాదాలు. 2024లో 6,902 ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. సాధారణ ప్రమాదాల సంఖ్య ఏడాదికి 10వేల పైనే జరిగాయి. హెల్మెట్ లేకపోవడం వల్లే 2021లో 2,577 మంది మృతి. 2022లో 3042 మంది, 2023లో 3,108 మంది, 2024లో 3,400 మంది చనిపోయారు. హెల్మెట్ తప్పనిసరి అనేది అన్ని చోట్ల ఇంకా అమలు చేయడం లేదు. రద్దీ ఎక్కువ ఉండే ప్రమాదాలు జరిగే పట్టణ ప్రాంతాల్లో పైలట్ కింద మొదలుపెట్టాం. అవగాహన సదస్సులు నిర్వహించాక రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. హెల్మెట్ లేకపోవడం వల్ల గాయపడిన వాళ్లు మరణాల కన్నా 2,3 రెట్లు ఎక్కువ. తల్లిదండ్రుల కోణంలో ఆలోచిస్తే తీవ్రత తెలుస్తుంది. రూ.లక్ష పెట్టి బండి కొంటారు..హెల్మెట్ మాత్రం కొనరు. హెల్మెట్ల జరిమానా విషయంలో పోలీసులకు ప్రభుత్వం లక్ష్యాలేమీ ఇవ్వలేదని అన్నారు.

## కుల గణనబిల్లుల ఆమోదం చారిత్రాత్మకం

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టసభలో ఆమోదించడం చారిత్రాత్మక విషయమని, దేశ చరిత్రలోనే ఇలాంటి బిల్లును చట్టబద్ధత చేసింది తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారేనని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఎన్నికల ముందు కామారెడ్డి, చేవెళ్ల డిక్లరేషన్లలో ప్రకటించిన హామీలకు కట్టుబడి నేడు బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టబద్ధత చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతను చాటుకుందని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి చారిత్రాత్మక విషయాలను ఎప్పటికీ జ్ఞాపకం ఉండేలా గ్రామ గ్రామాన సంబరాలు చేసుకొని, ఆనందాన్ని ప్రతి ఇంటికి చేరవేసేలా కార్యక్రమాలను నిర్వహించుకుందాం

# రాష్ట్రం యూనిట్ గా ఎస్సీ వర్గీకరణ

కాకినాడ, మార్చి 19,

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికకు ఏపీ క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం మొత్తం యూనిట్‌గా రిజర్వేషన్లను అమలు చేయనున్నారుతాజా నిర్ణయం ప్రకారం ఏపీలో ఏ, బీ, సీ కేటగిరీలుగా రిజర్వేషన్ అమలు చేస్తారు. ఏ క్యాటగిరీలో రెల్లి, ఉపకులాలకు 1%, మాల, ఉపకులాలకు 7.5 శాతం, మాదిగ, ఉపకులాలకు 6.5%. రిజర్వేషన్లకు మంత్రుల సంఘం సిఫారసుల్ని క్యాబినెట్ ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయంపై మార్చి 20న అసెంబ్లీలో చర్చించి ఆ తీర్మానాన్నిజాతీయ ఎస్సీ కమిషన్‌కు పంపుతారు.ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేయాలని భావించినా 2021 జనాభా లెక్కలు జరగక పోవడంతో 2011 జనాభా లెక్కల ప్రకారమే వర్గీకరణ చేపడతారు. తాజా అంచనాల లేకుండా జిల్లా యూనిట్ అమలు చేయడంపై అభ్యంతరాల నేపథ్యంలో రాష్ట్రం మొత్తాన్ని యూనిట్‌గా పరిగణిస్తారు. ఉమ్మడి జిల్లాలను 26 జిల్లాలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఏపీలో కొత్త జిల్లాల్లో ఎస్సీల జనాభాపై కచ్చితమైన సమాచారం లేనందున రాష్ట్రం యూనిట్ గా అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. 2026 జనాభా గణన తర్వాత వర్గీకరణను జిల్లా యూనిట్ అమలు చేసే విషయాన్ని పరిశీలిస్తారు. ఏ- కేటగిరీలో రెల్లి, ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్.. బీ కేటగిరీలో మాదిగ, ఉపకులాలకు 6.5 శాతం.. సీ కేట గిరీలో మాల, ఉపకులాలకు 7.5 శాతం రిజ ర్వేషను ప్రతిపాదిస్తూ రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్ర ప్రభు త్వానికి ప్రతిపాదించింది.ఏపీలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపులో జాప్యం, తదితర అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాత రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఏక సభ్య కమిషన్ నివేదికపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించనున్నారు. బేడ, బుడగ జంగాలను రెల్లి కేటగిరీ కింద చేర్చే అంశంపై కూడా అసెంబ్లీలో చర్చిస్తారు.ఏపీలో ఎస్సీ వర్గీకరణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. మాల ఉపకులాలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి. జిల్లా యూనిట్ అమలు చేయాలని కొందరు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి సూచించారు. రాజీవ్‌రంజన్ మిశ్రా నివేదిక, ఆ నివేదికపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికలపై కేబినెట్‌లో చర్చించారు.గత ఏడాది నవంబరు 15న ఏకసభ్య కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం 2 నెలల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా రాష్ట్రంలోని ఆయా వర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. 13 ఉమ్మడి జిల్లాల్లో ఎస్సీ సంఘాలు, మేధావులు, ఉద్యోగుల నుంచి వినతులు తీసుకున్నారు. ఎస్సీల్లోని అన్ని ఉపకులాల నేతలు, ఉద్యోగ సంఘాలతో చర్చించారు. కొన్నిచోట్ల వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు వినతిపత్రాలు అందించారు.ఏడాది నవంబరు 7న సచివాలయంలో 23 మంది కూటమి దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతోపాటు ఎన్నికల హామీపై కూడా వారితో చర్చించారు. జనాభా దామాషా పద్ధతిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ అమలు చేస్తామని అప్పట్లో చంద్రబాబు ప్రకటించారుఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్.. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా చేపట్టిన ఎస్సీ జనాభా గణనను ప్రాతిపదికగా చేసుకుంది. ఆ సర్వే సమగ్రంగా జరగలేదని ఫిర్యాదులు వచ్చాయి. సర్వేను తిరిగి చేపట్టాలని ఎస్సీ మాల వర్గం డిమాండ్ చేస్తోంది.కొత్తగా పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ల పరిమితిని పెంచడం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సర్వేను పరిగణనలోకి తీసుకోకుండా సమగ్రంగా సర్వే చేపట్టాలని కోరుతున్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో కాకుండా కమిషన్ ఉమ్మడి 13 జిల్లాల్లోనే పర్యటించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

# గూడురు రైల్వేస్టేషన్ కు మహర్దశ

నెల్లూరు, మార్చి 19,

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కీలకమైన జంక్షన్లలో ఒకటైన గూడూరు రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడానికి రైల్వే మంత్రిత్వ శాఖ రూ.49కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో స్టేషన్ రూపురేఖల్ని సమూలంగా మారుస్తారు. ప్రయాణీకులకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని కల్పించడంతో పాటె? తిరుపతి, నెల్లూరు జిల్లా ప్రాంత ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగు పరచడానికి ఉపయోగ పడుతుంది.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న గూడూరు రైల్వే స్టేషన్ చెన్నైకు సమీపంలో ఉన్న కీలకమైన రైలు జంక్షన్, దక్షిణ కోస్తాలో గూడూరు కీలకమైన రవాణ కూడలిగా ఉంది. ఈ ప్రాంతంలోని కీలక స్టేషన్లను ఆధునీకరించే చర్యల్లో భాగంగా తాజాగా నిధులు కేటాయించారు.రైలు ప్రయాణీకులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి మద్దతు ఇవ్వడం కోసం ఈ నిధులు మంజూరు చేశారు. గూడూరు ప్రాంతం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా స్టేషన్ అభివృద్ధి పనులు చేపడతారు.

ప్రాజెక్టులో భాగంగా?

1. గ్రౌండ్ + 2 అంతస్తులతో కూడిన కొత్త స్టేషన్ భవనం నిర్మిస్తారు.

2. 1 నుండి 5 వరకు ప్లాట్‌ఫారమ్‌లపై పూర్తిగా కవర్ ఓవర్ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మిస్తారు.

3. తూర్పు నుండి పడమర ప్రవేశ ద్వారం వరకు 12 మీటర్ల వెడల్పు గల రూఫ్ ప్లాజాను స్టేషన్ భవనంతో అనుసంధానిస్తారు.

4. సర్క్యులేటింగ్ ఏరియాకు అభివృద్ధి చేస్తారు.

5. స్టేషన్ భవనాలకు కొత్త రూపురేఖలు కల్పిస్తారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో 21 రైల్వే స్టేషన్‌లను రూ.567.41 కోట్లతో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టినట్టు విజయవాడ డిఆర్ఎం నరేంద్ర పాటిల్ తెలిపారు.

## విచ్చలవిడిగా వర్శిటీలకు అనుమతులు

విజయవాడ, మార్చి 19,

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని అసెంబ్లీ వేదికగా ప్రకటించారు మంత్రి నారా లోకేష్. ముఖ్యంగా విశాఖలో ఏఐ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. అదే సమయంలో అమరావతిలో డీప్ టెక్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. గత కొద్దిరోజులుగా యూనివర్సిటీల ఏర్పాటు విషయంలో జాప్యం జరుగుతూ వచ్చింది. అందుకే త్వరగా ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.అమరావతి రాజధానినిర్మాణ పనులు ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. వచ్చే నెలలో ప్రధాని మోదీ పనులు పునః ప్రారంభించనున్నారు. అదే సమయంలో ఇతర సంస్థల నిర్మాణం పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అమరావతిలో డీప్ టెక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఐఐటి మద్రాస్, టోక్యో యూనివర్సిటీ, ఎల్ అండ్ టి సంస్థల సహకారంతో అమరావతి ప్రాంతంలో యూనివర్సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.ఏపీ ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆ రంగానికి సంబంధించి విశాఖలో ఏఐ యూనివర్సిటీ నెలకొల్పే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా నారా లోకేష్ ఈ విషయంలో పూర్తిస్థాయిలో క్లారిటీ ఇచ్చారు. ఏపీ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ చట్ట సవరణ బిల్లును నారా లోకేష్ మంగళవారం ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొత్తానికి అయితే ఏపీలో యూనివర్సిటీల ఏర్పాటు విషయంలో ఫుల్ క్లారిటీ వచ్చింది.

# లోకేశ్ కు పార్టీలో భారీ ఇమేజ్

విజయవాడ, మార్చి 19, (



ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు క్యాడర్ కు ఆశాజనకంగా ఉన్నారు. లోకేశ్ తోనే సాధ్యమవుతుందని క్యాడర్ బలంగా నమ్ముతుంది. చంద్రబాబు నాయుడు చట్టాలు, చట్టబండలంటూ కాలయాపన చేస్తారని, లోకేశ్ మాత్రం గత వైసీపీ ప్రభుత్వంలో తమపై జరిగిన కక్ష సాధింపు చర్యలకు దిగిన దానికి ప్రతీకారం తీర్చుకోవాలంటే నారా లోకేశ్ వల్లనే సాధ్యమవుతుందని గట్టిగా విశ్వసిస్తున్నారు. లోకేశ్ ఏడాదిన్నర పాటు యువగళం పాదయాత్ర జరిపినప్పుడు కూడా క్యాడర్ కు దగ్గరయ్యారని, వారి మనోభావాలను తెలుసుకుని వీలయినంత త్వరగానే క్యాడర్ ను తృప్తి పర్చేందుకు ప్రయత్నిస్తారని చెబుతున్నారు. టీడీపీ సోషల్ మీడియాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మే నెలలో కడపలో జరగనున్న మహానాడులో లోకేశ్ కు కీలక బాధ్యతలను అప్పగించాలన్న డిమాండ్ కూడా వినిపిస్తుంది. రాజధాని పనులను గత ప్రభుత్వ హయాంలో... గత ప్రభుత్వ హయాంలో అనేక మంది కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు. ఊళ్లను వదిలి పారిపోయారు. అక్రమ కేసుల్లో ఇరుక్కున్నారు. జైళ్లకు వెళ్లి వచ్చారు. యువగళం పాదయాత్రలోనూ, తర్వాత ప్రతి ఎన్నికల ప్రచార సభలోనూ లోకేశ్ బదులుకు బదులు తీర్చుకుంటానని హెచ్చరించారు. వడ్డీతో సహా చెల్లిస్తామని వార్నింగ్ ఇచ్చారు. రెడ్ బుక్ తయారవుతుందని, అందులో జాబితా ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేస్తూ క్యాడర్ ను పోలింగ్ కేంద్రాల వైపునకు వేగంగా నడవగలిగారు. లోకేశ్ వల్ల సాధ్యమవుతుందని క్యాడర్ కూడా నమ్మింది. చంద్రబాబు ఊరుకున్నప్పటికీ లోకేశ్ ఊరుకోరని, తమను వేధించేవారిని వరసగా జైలుకు పంపేందుకు నారా లోకేశ్ వెనుకాడరని క్యాడర్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.చంద్రబాబు నాయుడు ఒకింత ఆలోచన చేస్తారు. రాజకీయంగానే కాకుండా ఆయన ప్రతీకారం వంటి వాటికంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవడానికే ఎక్కువ మొగ్గు చూపుతారు. చంద్రబాబు నాయుడును కూడా గత ప్రభుత్వం వదల్లేదని, అలాంటి వారిని కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని క్యాడర్ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఒకరకంగా చంద్రబాబుకు యాంటీగా పోస్టులు పెడుతున్నారు. అదే లోకేశ్ విషయానికి వచ్చే సరికి లోకేశ్ ఖచ్చితంగా తమకు న్యాయం చేస్తారంటూ నమ్ముతున్నారు. అందుకే క్యాడర్ లో రోజురోజుకూ లోకేశ్ కు ఇమేజ్ మరింత పెరుగుతుంది. చంద్రబాబుకు కూడా కావల్సింది అదే కావడంతో టీడీపీ క్యాడర్ లో మరింత ఉత్సాహం కనపడుతుంది.

======================

# నాగ్ పూర్ హింస వెనుక కుట్ర

ముంబై, మార్చి 19,

మహారాష్ట్రలో ఔరంగజేబు సమాధి వివాదం చినికి చినికి గాలివానగా మారింది. నాగ్‌పూర్‌లో ఇది అల్లర్లకు దారితీసింది. సోమవారం రాత్రి చెలరేగిన అల్లర్లలో 33 మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కీలక ప్రకటన చేశారు. అల్లర్ల వెనుక భారీ కుట్ర ఉందన్నారు. అల్లర్లలో ప్రమేయమున్న 50 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అత్యంత ప్రశాంతమైన నగరంగా పేరుంది. 1993 నుండి ఇక్కడ మతపరమైన అల్లర్లు జరగలేదు. నేడు అది హింసాకాండలో మండుతోంది. నాగ్‌పూర్ పోలీసులు ఈ సంఘటనను బాగా ప్లాన్ చేసిన కుట్రగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నప్పటికీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్వయంగా ఈ వాస్తవాన్ని అంగీకరించి, దానికి సంబంధించిన ఆధారాలను కూడా అందించారు. ఈ సంఘటనకు అల్లర్లు ఇప్పటికే సన్నాహాలు చేశాయని ఆయన అన్నారు.ఛావా సినిమా తరువాత ఔరంగజేబు అకృత్యాలు ప్రజలకు తెలిశాయని, శంభాజీ వీరత్వంపై జనం ప్రశంసలు కురిపిస్తున్నారని ఫడ్నవీస్ అన్నారు. ఇది తట్టుకోలేక కొన్ని అరాచక శక్తులు హింసను రెచ్చగొట్టాయన్నారు. 11 పోలీసు స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. అల్లర్లలో ముగ్గురు డీసీపీలకు కూడా గాయాలైనట్లు తెలిపారు. అల్లర్లలో గాయపడ్డ డీసీపీతో ఫోన్లో వీడియోకాల్ మాట్లాడారు ఫడ్నవీస్. కాగా, ప్రజలు సంయమనం పాటించాలని సీఎం ఫడ్నవీస్ పిలుపునిచ్చారు. శాంతిని నెలకొల్పాలన్న ఆయన, మహారాష్ట్ర అభివృద్ధికి మారుపేరు అని, ఎన్నో పెట్టుబడులు ఇక్కడికి వస్తున్నాయి. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సీఎం అన్నారు.అయితే నాగ్‌పూర్ హింసపై మహాయుతి సర్కార్‌ను నిలదీశాయి. సీఎం ఫడ్నవీస్ మహారాష్ట్రను మణిపూర్‌లా మార్చేశారని శివసేన ఉద్ధవ్ వర్గం నేత ఆదిత్యా ఠాక్రే ఆరోపించారు. హోంశాఖ కూడా ఫడ్నవీస్ దగ్గరే ఉందని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఫడ్నవీస్ రాజీనామా చేయాలని ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. సీఎం సొంత నియోజకవర్గంలో హింస రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతోందన్నారు సంజయ్ రౌత్.

ఔరంగజేబు సమాధి చుట్టూ మహారాష్ట్రలో రాజకీయ, మతపరమైన వివాదాలు ఉద్రిక్తతలకు దారితీశాయి. నాగ్‌పూర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా హైటెన్షన్ వాతావరణం ఉంది.ఇదిలావుంటే, నాగ్‌పూర్ హింసను ప్రత్యక్షంగా చూసిన వారు మాట్లాడుతూ, అల్లర్లు పూర్తిగా సిద్ధమై వీధుల్లోకి ప్రవేశించి ఇళ్ళు, భవనాలు, దుకాణాలు, వాహనాలను రాళ్లతో రువ్వడం ద్వారా ధ్వంసం చేశాయని చెప్పారు. అది చాలా భయంకరమైన దృశ్యమని, ప్రజలు ఇప్పటికీ భయం నీడలోనే జీవిస్తున్నారని చెప్పారు.

ఈ సంఘటన గురించి పెద్ద ప్రశ్న ఏమిటంటే 1993 తర్వాత ఇక్కడ అల్లర్లు జరగలేదు, మరి ఇంత పెద్ద గొడవ అకస్మాత్తుగా ఎలా జరిగింది? పరిస్థితి ఎలాతయారైందంటే, ఇప్పటికీ 11 చోట్ల కర్ఫ్యూ ఉంది. మహల్, హంసపురి ప్రాంతాలు ఉద్రిక్తంగా మారిపోయాయి.పోలీసుల సమాచారం ప్రకారం సోషల్ మీడియాలో ఒక పుకారు వ్యాపించింది. దీని తరువాత, వందలాది మంది అల్లరిమూకలు కొద్దిసేపటిలోనే అక్కడికి చేరుకున్నారు. ఈ అల్లరిమూకలు రాళ్ళు, కర్రలు, రాడ్లు, కత్తులు, ఈటెలు, హాకీ కర్రలతో వచ్చారు. ఈ అల్లర్లలో కొందరు కాలినడకన వచ్చారు. మరికొందరు నంబర్ ప్లేట్లు లేని బైక్‌లు, స్కూటర్లపై వచ్చారు. పరిస్థితిని చూస్తుంటే ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు కర్ఫ్యూ విధించారు. మంగళవారం సాయంత్రం వరకు కూడా దానిని సడలించలేకపోయారు. పుకార్లు వ్యాప్తి చేసేవారిని, అల్లరిమూకలను గుర్తించడానికి పోలీసులు ఎలక్ట్రానిక్ నిఘాను ఉపయోగిస్తున్నారు.

## సిబ్బంది సమస్యల పరిష్కారంకే "పోలీస్ దర్బార్"

రామగుండం :

రామగుండం కమిషనరేట్ ఏఆర్ సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో "దర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం కు సీపీ హాజరై ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బంది తో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించే విధముగా చూస్తాం అన్నారు. ఏలాంటి సమస్య ఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్ కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు అన్నారు.ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ..... మనమందరం ఒక కుటుంబం. అందరం సమన్వయంతో క్రమ శిక్షణ, ప్రణాళికబద్దంగా డ్యూటీ లను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్ కి, తెలంగాణ పోలిస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచిప్రవర్తన తో విధులు నిర్వర్తించినప్పుడు అధికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు చేయడం జరిగింది. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్ట కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన శాఖ పరమైన చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు.

## నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని మార్చి 20 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఊరపిచ్చుకలు మరి ఇతర పక్షులను సంరక్షించాలన్న లక్ష్యంతో మార్చి 20 వ తేదీని పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. ప్రతి సంవత్సరం పిచ్చుకల దినోత్సవాన్ని మార్చి 20న జరుపుతారు. అంతర్జాతీయంగా పిచ్చుకల సంరక్షణ కోసం ఈ దినోత్సవాన్ని నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఫ్రాన్స్ కు చెందిన ఎకో-సిస్ యాక్షన్ ఫౌండేషన్ మరియు ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో నిర్వహిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న సహజ జీవవైవిధ్యం మరియు జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తెరిగి, అందుకోసం క్రియాశీలకంగా పనిచేయడం కోసం ప్రజలను ఏకం చేయడం ఈ పిచ్చుకల దినోత్సవ ముఖ్యోద్దేశం.

===============================

## అలనాటి అందాల నటుడు, ఎవర్ గ్రీన్ సోగ్గాడు శోభన్ బాబు.

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

కనురెప్ప మరల్చలేని అందం శోభన్ బాబు సొంతం. ఎన్నో మరిచిపోలేని పాత్రలకు జీవం పోసి, తెలుగు వారి గుండెల్లో మహారాజుగా వెలుగొందింది ఆయన రూపం. ఇద్దరు భార్యల మధ్యలో నలిగిపోయే పాత్రలో నటించి మహిళా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన సోగ్గాడు ఆయన. ప్రేమకథలకు రొమాంటిక్ హీరోగా, మాస్, క్లాసికల్ పాత్రలకు నిర్వచనంగా నిలిచారు శోభన్ బాబు. ట్రాయాంగిల్ లవ్ స్టోరీలకు ట్రెండ్ సెట్టర్ గా నిలిచిన అరుదైన హీరో శోభన్ బాబు. నేడు ఆ అందాల సోగ్గాడి జయంతి. జనవరి14,1937లో కృష్ణా జిల్లా చిన నందిగామలో పుట్టిన శోభన్ బాబు అసలు పేరు ఉప్పు శోభనా చలపతి రావు. సామాన్య రైతుల కుటుంబంలో జన్మించిన ఈయన హైస్కూల్లో చదివిన రోజుల్లోనే నాటకాలపై ఆసక్తిని పెంచుకున్నారు. మద్రాసు లా కోర్సులో చేరినప్పటికీ నటన పైన ఆసక్తితో సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉదయం కాలేజీకి వెళ్ళి, మధ్యాహ్నం నుండి స్టూడియోల వెంట తిరిగేవారు.. అప్పుడే తన పేరును శోభన్ బాబుగా మార్చుకున్నారు. 1959లో శోభన్ బాబు తన మొదటి సినిమా.. 'దైవబలం' చేశారు. ఎన్టీయార్ తో కలిసి చేసిన ఈ సినిమా విజయవంతం కాలేదు. దాని తర్వాత నెక్ట్స్ ఏడాదే భక్త శబరి చిత్రంలో మునికుమారుడుగా నటించారు. ఆ సినిమా సక్సెస్ కావడంతో .. సినీ పరిశ్రమకు, తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు శోభన్ బాబు. తర్వాత వచ్చిన చిన్న చిన్న అవకాశాలను సైతం సద్వినియోగం చేసుకుంటూ తెలుగు టాప్ హీరోల్లో ఒకరిగా నిలిచారు. నర్తనశాల, వీరాభిమన్యు, బంగారు పంజరం, మనుషులు మారాలి, దేవాలయం, సంపూర్ణ రామాయణం, బుద్ధిమంతుడు సినిమాలు శోభన్ బాబుకు మంచి పేరును తెచ్చిపెట్టాయి. దేవత, పండంటి కాపురం, కార్తీక దీపం సినిమాలతో శోభన్ బాబు మహిళా ప్రేక్షకులకు ఆరాధ్య కథానాయకుడుగా మారిపోయారు.హీరోగానే కెరీర్ ముగించిన శోభన్ బాబునటభూషణ, సోగ్గాడు, ఆంధ్రా అందగాడు బిరుదులను సొంతం చేసుకున్న శోభన్ బాబు సినీ ఫీల్డ్ లోనూ వెరీ హంబుల్ మ్యాన్ అనే పేరును తెచ్చుకున్నారు. ఎప్పుడూ ఎటువంటి కాంట్రవర్సీలకు పోకుండా?.అందరితోనూ కలిసిపోయే ఆయన సినిమాలకు దూరం అయిన తర్వాత మాత్రం ఎవరికీ కనిపించకుండా? కుటుంబానికే పరిమితమయ్యారు. హీరోగానే తన కెరీర్ ముగించారు. సహాయక పాత్రల జోలికి పోలేదు. సినీ జీవితానికి స్వస్తి చెప్పిన తర్వాత శోభన్ బాబు శేష జీవితాన్ని అందరికీ దూరంగా మద్రాసులో తన సొంత ఇంటిలోనే గడిపారు. మార్చి 20, 2008న కన్నుమూశారు. శోభన్ బాబు మనిషిగా మరణించినా.. నటుడిగా.. ఉత్తమ వ్యక్తిగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ఇప్పటికీ ఎవర్ గ్రీన్ సోగ్గాడిగానే నిలిచి ఉన్నారు.

# మలుపులు తిరుగుతున్న రన్యా రావు కేసు

బెంగళూరు, మార్చి 19, (న బెంగళూరు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నటి రన్యా రావుకు కష్టాలు రెట్టింపయ్యాయి.రన్యారావు.. అమ్మాయి బాగుందని..ముచ్చటపడేరు. ఖతర్నాక్ లేడీ. అమ్మాయి హీరోయిన్ కదాఅని జాలిపడేరు.. .పక్కా ఫోర్ట్వంటీ. ఇప్పడీ బంగారు తల్లి పేరు దేశం మొత్తం మార్మోగుతోంది. గోల్డ్ స్మగ్లింగ్ స్కూల్‌లో కొత్త పాఠాలు నేర్చుకుని.. కిలోల లెక్కన బంగారాన్ని చాలా పకడ్బందీగా.. పద్ధతిగా తరలిస్తూ కోట్లు వెనకేసుకుని కూర్చుంది. దొంగ బంగారాన్ని దొర వేషంలో దొంగచాటుగా చేరవేయడంలో ఎన్ని డిగ్రీ పట్టాలు తీసుకుందో కానీ.. కాళ్ల పట్టీల దగ్గర నుంచి నుదుటి పాపటి దాకా పసిడిని ఒడిసి పట్టిదంటే తస్సాదియ్యా మానవుడి కంటికి కనిపించదు. ౦ఎ టెక్నాలజీ కెమెరాకు చిక్కదు. రన్యా రావు బెయిల్ పిటిషన్‌పై విచారణను బెంగళూరు కోర్టు వాయిదా వేసింది. రన్యా రావుతో పెళ్లి విషయంపై ఆమె భర్త జతిన్ హుక్కేరి కోర్టుకు సంచలన విషయాలు వెల్లడించారు. రన్యతో తనకు గత నవంబరులో పెళ్లి జరిగిందని , కాని డిసెంబర్ నుంచే తాము విడిగా ఉంటున్నామని కోర్టుకు తెలిపారు. కాకపోతే తాము అధికారికంగా విడిపోలేదని, కొన్ని కారణాల వల్ల వేరుగా ఉంటున్నామని చెప్పారు.బంగారం స్మగ్లింగ్ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. బెంగళూరు మాత్రమే కాకుండా గోవా , ముంబై నుంచి కూడా రన్యా రావు దుబాయ్‌కు వెళ్లినట్టు ఆఖీఎ అధికారులు వెల్లడించారు. హవాలా మార్గంలో డబ్బులతో బంగారం స్మగ్లింగ్ జరుగుతోందని అనుమానాలు వ్యక్తం చేశారు. 45 సార్లు దుబాయ్‌కు ఉదయం వెళ్లిన రన్యా సాయంత్రానికి తిరిగి వచ్చినట్టు తెలిపారు.గోల్డ్ స్మగ్లింగ్ కేసులో రన్యా రావు భర్త జతిన్‌పై ఈనెల 24వ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కర్నాటక హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే జతిన్‌కు వ్యతిరేంగా పిటిషన్ వేస్తామని ఆఖీఎ అధికారులు వెల్లడించారు. గత నవంబర్‌లో బెంగళూరులోని హోటల్ తాజ్ వెస్ట్ ఎండ్‌లో రన్య- జతిన్ వివాహం జరిగింది. . ఈ సింగారమ్మ గోల్డ్ దెబ్బకు ఇప్పుడు కర్నాటక రాజకీయ కూసాలు కదిలిపోతున్నాయి. అసలే కన్నడ పాలిటిక్స్ ఎంత ఇంపుగా ఉంటాయో అందరికి తెలుసు. ఎక్కడ ఏ దగుల్బాజీ దందా జరిగినా.. దానికి అక్కడి పాలిటిక్స్‌కు లింకయి సింకై.. రచ్చ రచ్చ చేస్తుంటాయి. ఇప్పుడదే జరుగుతోందక్కడ. పోనీ అక్కడ దాకా ఆగిందా అంటే.. ఐపీఎస్ ఆఫీసర్ల దాకా పాకింది. ప్రొటోకాల్ రగడ అంటుకుంది. పోనీ అంతటితో ఆగిందా అనుకుంటే..చివరకు మన టాలీవుడ్ కొంపకూ నిప్పు అంటుకుంది. తరుణ్ రాజ్ కొండూరు అట. పాపం ఈ పిలకాయ పరిచయం అనే సినిమాతో




టాలీవుడ్ జనాలకు పరిచయం అయ్యాడు. తర్వాత పత్తాలేకుండా పోయాడు. చివరికి రన్యారావు పణ్యమా అని ఈ గోల్డ్ స్మగ్లింగ్ కేసులో తేలాడు.పసిడి దందాలో ఈ పిలకాయకీ ఘనమైన వాటానే ఇచ్చింది రన్యా మేడమ్. తురుణ్‌కు విరాట్ అని ఇంకో పేరు కూడా ఉంది. రన్యారావుతో 2019నుంచి తరుణ్‌రాజ్‌కు పరిచయం ఉన్నట్లు డీఆర్ఐ విచారణలో తేలింది. అప్పట్నుంచి క్రమ క్రమంగా రన్యారావుతో క్రమం తప్పకుండా సంబంధాలు కొనసాగిస్తూ, అవి కాస్తా అక్రమాలకు దారి తీసేంతగా వారి మధ్య బంధం బలపడిందట. అదెలాగో చెప్పే ముందు మనం రన్యారావు తన స్టేట్‌మెంట్‌లో ఎన్ని సుద్ధపూస కబుర్లు చెప్పిందో ఇక్కడ నోట్ చేయాల్సిన అవసరం ఉంది. నేను చాలా అమాయకురాలిని. ఫస్ట్ టైమ్ గోల్డ్ స్మగ్లింగ్ చేస్తున్నాను. గతంలో ఎన్నడూ ఇలాంటి దొంగపని చేయలేదు. యూట్యూబ్‌లో గోల్డ్ స్మగ్లింగ్ ఎలా చేయాలో నేర్చుకున్నాను. దాని ప్రకారమే బంగారం తరలించే పనికి ఒప్పుకున్నాను. అంతే తప్ప నాకెలాంటి పాపం తెలియదు. నేను చాలా మంచిదాన్ని అంటూ ఓ స్టేట్‌మెంట్ పోలీసులకు ఇచ్చింది. ఇంకో స్టేట్‌మెంట్‌లో ఎవడో తనను బ్లాక్‌మెయిల్ చేశాడని, బంగారం తరలిచ్చేలా తనపై ఒత్తిడి చేశాడని, అందుకే తానిలా చేయాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది.రావుపై బీజేపీ ఎమ్మెల్యే బసన్నగౌడ పాటిల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆమె తన శరీరంలోని అన్ని భాగాల్లో బంగారాన్ని దాచి స్మగ్లింగ్ చేసిందన్నారు. "మంత్రులకు ఈ కేసుతో సంబంధం ఉంది. సెక్యూరిటీని దుర్వినియోగం చేశారు. శరీరం లోని అన్ని భాగాల్లో బంగారాన్ని దాచారు. కేంద్రం ఎవరిని కాపాడే ప్రయత్నం చేయలేదు. కస్టమ్స్ అధికారుల ప్రమేయం ఉంటే కచ్చితంగా వాళ్లపై కూడా చర్యలు ఉంటాయి" బసన్నగౌడ పాటిల్ వ్యాఖ్యానించారు.

================

# కెనడా సర్కార్ లో ఇద్దరు ఇండియన్స్

న్యూఢిల్లీ. మార్చి 19, (

అందమైన, ధనిక దేశం కెనడా. ఈ దేశానికి భారతీయులు విద్య, ఉద్యోగాల కోసం వెళ్తున్నారు. ఇక కెనడా జనాభాలో 6 శాతం సిక్కులు ఉన్నారు. ఆ దేశ ఎన్నికల్లో వీరి పాత్ర చాలా కీలకం. అయితే రెండేళ్ల క్రితం వరకు భారత్?కెనడా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పెట్టుబడులు, దౌత్యపరమైన సంబంధాలు బలంగా ఉండేవి. అయితే ఆ దేవంలో నిజ్జర్ అనే వేర్పాటువాది హత్యకు గురయ్యాడు. దీనికి భారతీ దౌత్య వేత్తలే కారణమని అప్పటి ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. దీంతో అప్రమత్తమైన భారత్.. దౌత్యాధికారులను వెనక్కి రప్పించింది. ఆ తర్వాత ట్రూడో కూడా విశ్వాసం కోల్పోయారు. దీంతో నూతన ప్రధానిని ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మార్క్ కార్నీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. కార్నీ కేబినెట్‌లో ఇద్దరు భారత సంతతి మహిళలు, అనితా ఆనంద్ మరియు కమల్ ఖేరా, మంత్రులుగా చోటు దక్కించుకున్నారు. ఈ క్యాబినెట్ మార్చి 14న ఒట్టావాలోని రిడో హాల్‌లో గవర్నర్ జనరల్ మేరీ సైమన్ అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధికారికంగా ప్రారంభమైందిఅనితా ఆనంద్ (58): ఆమె నావీన్యత, విజ్ఞానం మరియు పరిశ్రమల మంత్రిగా నియమితులయ్యారు. ఆమె 2019లో ఓక్‌విల్లె నుండి మొదటిసారి ఎంపీగా ఎన్నికై, గతంలో ట్రెజరీ బోర్డు అధ్యక్షురాలు, జాతీయ రక్షణ మంత్రి, మరియు పబ్లిక్ సర్వీసెస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్ మంత్రిగా పనిచేశారు. నోవా స్కోటియాలో జన్మించిన ఆమె, టొరంటో విశ్వవిద్యాలయంలో చట్ట ఆచార్యురాలిగా పనిచేసిన న్యాయవాది మరియు పరిశోధకురాలు.కమల్ ఖేరా(36): ఆమె ఆరోగ్య మంత్రిగా నియమితులయ్యారు. ఢిల్లీలో జన్మించిన కమల్, చిన్నతనంలో కెనడాకు వలస వచ్చి, 2015లో బ్రాంప్టన్ వెస్ట్ నుండి ఎంపీగా ఎన్నికైంది. ఆమె కెనడా పార్లమెంట్‌లో ఎన్నికైన అతి పిన్న వయస్కురాలైన మహిళల్లో ఒకరు. రిజిస్టర్డ్ నర్సుగా పనిచేసిన ఆమె, కోవిడ్?19 మొదటి వేవ్ సమయంలో బ్రాంప్టన్‌లోని ఆరోగ్య సంస్థల్లో స్వచ్ఛందంగా సేవలందించారు. గతంలో ఆమె సీనియర్స్ మంత్రిగా, అంతర్జాతీయ అభివృద్ధి, జాతీయ ఆదాయ శాఖలలో పార్లమెంటరీ సెక్రటరీగా పనిచేశారు.కార్నీ యొక్క క్యాబినెట్‌లో 13 మంది పురుషులు, 11 మంది మహిళలు ఉన్నారు, ఇది గత ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో యొక్క 37 మంది సభ్యుల బృందం కంటే చిన్నది. 'మేము ఈ క్షణానికి సరిపడే చిన్న, దృష్టి కేంద్రీకరించిన, అనుభవజ్ఞులైన బృందాన్ని రూపొందించాము' అని కార్నీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇద్దరు భారత సంతతి మంత్రులు గత ట్రూడో క్యాబినెట్ నుంచి తమ పదవులను కొనసాగిస్తున్నప్పటికీ, వేర్వేరు శాఖలకు మారారు.

# బీసీ ఉచ్చులో బీజేపీ ఇరుక్కుంటుందా..?

హైదరాబాద్, మార్చి 19,

బీసీ రిజర్వేషన్ బిల్లు శాసన సభలోను, శాసన మండలిలో ఆమోదం పొందింది. ఇక బీసీ రిజర్వేషన్లు పెరగనున్నాయి. ఇప్పటి దాకా విద్య ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. దాన్ని పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన నిర్వహించింది. ఈ గణనలో 56.36 శాతం బీసీలు రాష్ట్రంలో ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్ల పెంచుతూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు సంబంధింత బిల్లులకు చట్ట సభలు ఆమోద ముద్ర వేశాయి. అంటే ఇక నుంచి విద్యా సంస్థల్లో, ప్రభుత్వ నియామకాల్లో, అదే రీతిలో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పోరేషన్ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల ఫలాలు బీసీలకు దక్కనున్నాయి. ఇంతటితో పని పూర్తి అయినట్లు కాలేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంలోని చట్ట సభలు బిల్లుకు ఆమోద తెలిపి కేంద్రానికి పంపనుంది.దేశంలో రిజర్వేషన్ల పెంచాలన్నా, తగ్గించాలన్నా, ఆయా కులాల జాబితాను మార్చాలన్నా రాష్ట్రాలకు అధికారం లేదు. ఈ అంశం కేంద్ర జాబితాలోది. కేంద్రమే నిర్ణయం తీసుకోవాలి. ఇక చట్ట సభల ఆమోదం పొందిన ఈ రిజర్వేషన్ల పెంపు బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. ఆ బిల్లును పార్లమెంట్ మూడింట రెండు వంతుల మెజార్టీతో ఆమోదించాలి. ఎందుకంటే సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు. అలా మించితే రాజ్యాంగ సవరణ చేసి షెడ్యూల్ -9లో చేర్చాలి. ఈ రిజర్వేషన్లు బీసీలకు రిజర్వేషన్ పెంచి ఇస్తే ప్రస్తుతం ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం కలుపుకుంటే మొత్తం 67 శాతానికి చేరుకుంటుంది. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకం. అలా సవరణ చేయాలంటే అందుకు సరైన కారణాలు వెల్లడించారు. అందుకు తగిన గణాంక



సమాచారం అందుబాటులో ఉంటే అప్పుడు తగిన కారణాలతో రిజర్వేషన్లు 50 శాతం కంటే ఎక్కువగా పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. ఈ కారణలతోనే రేవంత్ సర్కార్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసి లీగల్‌గా ఎదుర్కునే రీతిలో పటిష్టంగానే బీసీ గణన చేపట్టింది. సమగ్ర కుటుంబ సర్వే తర్వాతనే బీసీ లెక్కలను తెల్చి చెప్పింది. ఆ తర్వాత చట్టసభల్లో ఈ బిల్లులకు ఆమోద ముద్ర పడింది. ఇక ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బంతి కేంద్రం కోర్టులో పడేసింది. పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మద్దతు ఇస్తే రాజ్యాంగ సవరణ వీలవుతుంది. అప్పుడే రాష్ట్రంలో పెంచిన బీసీ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందే బీసీ గణన చేపడతామని చెప్పింది. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ ముఖ్యనేత రాహూల్ గాంధీ చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో ఇదే ప్రస్తావించారు. అందుకు అనుగుణంగా రేవంత్ సర్కార్ ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపింది. అయితే దేశవ్యాప్త కులగణన విషయంలో మోదీ సర్కార్ సానుకూలంగా స్పందిస్తుందా అన్నది వేచి చూడాలి. ఎందుకంటే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీసీలంతా ఐక్యంగా ఉండాలని, బీసీ లెక్కలు అవసరం లేదన్న రీతిలో మోదీ నర్మగర్భంగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు పెంపు బిల్లుకు ఆమోద ముద్ర వేస్తే అది కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఓ అస్త్రంగా మారనుంది. తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించినందుకు మేం బీసీలకు మేలు చేసేలా రిజర్వేషన్లు పెంచామని, పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టింది చేసి చూపించామని చెప్పుకునే పరిస్థితి ఉంటుంది. అలా బీసీ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు దగ్గరయ్యే అవకాశం లేకపోలేదు. ఇలా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేలా మోదీ సర్కార్ తెలంగాణ బీసీ రిజర్వేన్ల పెంపు బిల్లుకు సానుకూలంగా స్పందిస్తుందా లేదా చూడాలి.తెలంగాణ బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుకూలంగా ఎన్డీఏ ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే తేనె తుట్ట కదిపినట్లే. ఇదే రీతిలో అన్ని రాష్ట్రాల నుంచి రిజర్వేషన్ల పెంచాలన్న డిమాండ్లు వస్తాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ఈ సమస్య ఎదురుకావచ్చు. ఒక వేళ ఈ రిజర్వేషన్ల బిల్లుపై ఎలాంటి చర్చ లేకుండా పక్కన పెడితే బీసీ వ్యతిరేక పార్టీగా బీజేపికి తెలంగాణలోను, దేశవ్యాప్తంగా ముద్రపడే అవకాశం ఉంటుంది. ఇలాంటి డిమాండ్లే ఏపీ నుంచి, ఇతర ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నుంచి వచ్చే అవకాశం ఉంది. వారిని కాదని కేంద్రంలో బలహీనంగా ఉన్న బీజేపీ పార్టీ నిర్లయం తీసుకోలేని పరిస్థితి. ఒక వేళ తీసుకుంటే ఆ సక్సెస్ తన ఖాతాలో పడుతుందా లేక మొదటి నుంచి బీసీ రాగం వినిపించిన కాంగ్రెస్ ఖాతాలో పడుతుందా అన్న డైలమా కమలనాథుల్లో లేకపోలేదు. రానున్న రోజుల్లో ఈ బీసీ ఉచ్చు నుంచి బీజేపీ ఎలా తప్పుకుంటుందో వేచి చూడాలి. అయితే తెలంగాణలోని రాజకీయ పార్టీలను తీసుకుని ప్రధానికి కలవాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ రిజర్వేషన్ల బిల్లు ఎందాక ముందుకు సాగి ఆచరణలోకి వస్తుందో మాత్రం వేచి చూడాలి.

## ఐక్యరాజ్యసమితిలో హిందీకి మరింత ప్రాధాన్యం

న్యూయార్క్:

ఐక్యరాజ్యసమితిలో హిందీ భాష వినియోగాన్ని ప్రోత్సహించే ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నదని విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో శాశ్వత భారతీయ రాయబారి కార్యాలయ ప్రధాన అధికారి పర్వతనేని హరీష్‌తో న్యూయార్క్‌లోని ఆయన కార్యాలయంలో సమావేశయ్యారు. హిందీ వినియోగానికి సంబంధించిన అనేక అంశాలను వీరిరువురు చర్చించారు. ఐక్యరాజ్యసమితి నుంచి హిందీలో వార్తలను ప్రసారం చేయడంతో పాటు హిందీ భాషను మరింత మందికి చేరువ చేసే ప్రాజెక్టును మరో 5 సంవత్సరాల పాటు పొడిగించేందుకు ఒప్పందం కుదిరిందని ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమానికి భారత్ ప్రతి ఏడాది ?13 కోట్లు అందజేస్తుందని, ప్రస్తుతం వెబ్‌సైట్ ద్వారా కొనసాగుతోన్న ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో ఒక ప్రత్యేక యాప్ ద్వారా మరింత బలోపేతం చేయాలని యోచన జరుగుతోందని తెలిపారు.

ఆచార్య యార్లగడ్డ మాట్లాడుతూ, విదేశాంగమంత్రిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఐక్యరాజ్యసమితిలో హిందీలో ప్రసంగించిన తొలి నేత అని, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కూడా హిందీలో ప్రసంగించారని గుర్తుచేశారు. అలాగే, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల సమయంలో వివిధ దేశాధినేతలతో హిందీలోనే చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలో అరబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్ భాషలు అధికార భాషలుగా ఉన్నాయని, హిందీని కూడా అధికార భాషగా గుర్తింపు పొందేలా చేయడం అటల్ బిహారీ వాజ్‌పేయి గారి కలగా ఉందని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏలూరు

ఏలూరు జాతీయ రహదారిలోని ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మంగళవారం అర్ధరాత్రి కారును లారీ ఢీకొంది ఈ ఘటనలో కారుల ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణికులలో ఇద్దరు గాయాల పాలయ్యారు. లారీ తో సహా డ్రైవర్ పారారయ్యాడు. గుంటూరులో ఉన్న ఓ ఆసుపత్రిలో డిస్చార్జ్ అయిన వ్యక్తిని తాడేపల్లిగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో ఏలూరు జాతీయ రహదారిలో ఈ ఘటన చోటుచసుకుంది. పోలీసులు ఈ ఘటనపై విచారిస్తున్నారు

## బడ్జెట్ ప్రసంగమా ? రాజకీయ ప్రసంగమా ?

**అసెంబ్లీ సాక్షిగా అబద్దాల చిట్టా చదివారు**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనా వికాసాన్ని15 నెలల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం చేశారు**

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

హైదరాబాద్దక్షతతో, బాధ్యతగా హామీలు ఇచ్చాం, నెరవేర్చడం మాకు కష్టం కాదు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల మీద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. ఒక్క ఏడాది నోరు కట్టుకుంటే అన్ని హామీలు నెరవేరుస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒక మధ్యంతర బడ్జెట్ తో కలిపి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్నది మూడో బడ్జెట్. అజ్ఞానం, అనుభవరాహిత్యం, అహంకారం వెరసి తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్న పాలన అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు.

రెండేళ్ల పాలన పూర్తి కాక ముందే తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు .. 2050 తెలంగాణ రైజింగ్ ప్రణాళిక తయారు చేస్తున్నాం అని చెప్పడం హాస్యాస్పదం

కేసీఆర్ గారి నాయకత్వంలో పదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో జిల్లాలు, రెవిన్యూ డివిజన్లు, కొత్త మండలాల ఏర్పాటుతో పాలన వికేంద్రీకరించబడింది

పదేళ్ల కేసీఆర్ పాలనలో విధ్వంసం మూలంగానే తెలంగాణ తలసరి ఆదాయంలో, తలసరి విద్యుత్ వినియోగంలో నంబర్ వన్ గా నిలిచిందా ? విద్యారంగం, వైద్యరంగంలో మార్పులు, ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి సదుపాయం మూలంగా పంటల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచింది వాస్తవం కాదా ? పదేళ్లలో పచ్చబడ్డ తెలంగాణను ఎండబెట్టి చోద్యం చూస్తున్నది కాంగ్రెస్. అద్భుతమైన మిషన్ భగీరథ పథకం అమలై ప్రజలు బిందెలు పట్టుకుని వెళ్లే పరిస్థితి లేకుండా మార్చిన తెలంగాణలో మళ్లీ నీటి ఎద్దడితో బిందెలు పట్టుకుని వెళ్లే మంచినీటి కటకట దుస్థితి తెచ్చింది కాంగ్రెస్. పల్లెప్రగతితో పల్లెలు, పట్టణ ప్రగతితో కళకళలాడిన పల్లెలు, పట్టణాలు నేడు పారిశుధ్యం లోపించి కంపుకొడుతున్నాయి. హరితహారం మొక్కలు నీళ్లు పోసే దిక్కు లేక ఎండిపోతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కర్ఫ్యూ పరిస్థితి తీసుకువచ్చిందని అన్నారు.పారిశుద్ధ కార్మికులు, అంగన్వాడీ, ఆశాలు, ప్రభుత్వ ఉద్యోగుల వరకు అన్ని వర్గాలను ఆశల పల్లకిలో ఊరేగించి అథం పాతాళానికి విసిరేసింది కాంగ్రెసని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అని రైతులకు ఆశ చూపి మోసం చేశారు. ఎకరాకు ఏడాదికి రూ.15 వేల రైతుభరోసా అని చెప్పి 15 నెలల పాలనలో రెండు సార్లు ఎగ్గొట్టి రూ.12 వేలకు కుదించి కూడా కనీసం మూడు ఎకరాలు ఉన్న రైతులకు ఇవ్వలేదు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు మొదలే పెట్టలేదు .. దానిని అమలు చేస్తున్నాం అని పచ్చి అబద్దాలు చెప్తున్నారు. కౌలు రైతులకు కూడా ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు అని చెప్పి దాని ఊసెత్తడం లేదు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ బోగస్ అని తేలిపోయింది .. అసలు రాష్ట్రంలో పంటల కొనుగోలు అన్నదే ప్రహసనంగా మారింది. కాంగ్రెస్ 15 నెలల పాలన పాపం ఫలితంగా 450 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్యారంగంలో కాంగ్రెస్ 15 నెలల పాలన విధ్వంసం రేపింది .. గురుకుల పాఠశాలలలో 50 మందికి పైగా విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారు.

## ముందుకు సాగని చనాక, సదర్మాట్ పనులు

అదిలాబాద్, మార్చి 19,

ఆదిలాబాద్ జిల్లాకు సరిహద్దులో ఉన్న పెన్ గంగా నదిపై బ్యారేజీని నిర్మించాలనే ఆలోచనతో గత ప్రభుత్వ హయాంలో 2016వ సంవత్సరంలో రూ.386 కోట్ల అంచనా వ్యయంతో కొరాట- చనాక బ్యారేజి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పదేండ్లుగా పనులు నెమ్మదిగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తి అయితే అదిలాబాద్ ఇంకా బోథ్ నియోజక వర్గాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కానీ వారి ఆశలు అడిఆశలుగానే మిగిలిపోతున్నాయి. పదేండ్లు గడుస్తున్న పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. అధికారులు మాత్రం బ్యారేజీకు సంబంధించిన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే పనులను తిరిగి చేపడతాం అని స్పష్టం చేస్తున్నారు.

చనాక బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ ఇంక సాగు నీటి కాలువల నిర్మాణం పనులు పెండింగ్ లోనే ఉన్నాయి. హత్తి ఘాట్ పంప్ హౌస్ పనులను పూర్తి చేసి వెట్ రన్ నిర్వహించినా కూడా ఇప్పటి దాకా ఆయకట్టుకు చుక్క నీరుపారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బ్యారేజీ నిర్మాణంపై దృష్టి పెడుతుందని భావించినప్పటికీ సంవత్సరం గడిచి పోయిందే తప్ప బ్యారేజీ కాలువల నిర్మాణపు పనులు ఎక్కడి కక్కడే నిలిచి పోతున్నాయి. ఈ పనులు పూర్తి కావాలంటే మరో రెండేండ్ల సమయం పట్టే విధంగా కనిపిస్తుంది. అది కూడా పూర్తి స్థాయిలో నిధులు మంజూరు అయితేనే. నిధులు లేవన్న కారణం తోనే పనులను చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనే మాట వినిపిస్తోంది.గడిచిన పదేండ్ల నుంచి పనులు నత్త నడకగా నడుస్తున్నాయే తప్ప వేగంగా ముందుకు సాగడం లేదు. ఇష్టారీతిన బ్యారేజి నిర్మాణ పనుల అంచనాల వ్యయం పెంచేయడం కారణంగా నిధులు విడుదల కాక పోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతుంది. నిర్మించిన పనుల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పోయి కనిపిస్తున్నాయి. మరో వైపు అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో పనుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే బ్యారేజీ నిర్మాణపు పనులు పెండింగ్ లోనే ఉండే అవకాశాలు లేక పోలేదు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణం పనుల వైపు దృష్టి సారించి మిగిలిపోయిన పనులను త్వరిత గతిన పూర్తి చేసి ఆయకట్టుకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

సదర్మాట్ బ్యారేజీ పనులు అంతే సంగతులు

1892లో శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కంటే ముందు బ్రిటిష్ కాలంలో గోదావరి నదిపైన ఏర్పడిన సదర్మాట్.. ఆధునీకరణ పేరుతో చేపట్టినటువంటి పనులు సైతం కొనసాగుతున్నాయి. నిర్మల్ల జిల్లా మామడ మండలం పొనకల్త గ్రామ సమీపంలోని గోదారి నదిపైన సదర్మాట్ స్టోరేజీ పెంపుదల పనులు 10ఏళ్లుగా పనులు నడుస్తూనే వున్నాయి. ప్రతియేటా రెండు పంటలకు నిరంతరాయంగా సాగు నీరు అందించే టువంటి సదర్మాట్ వర్షాకాలం పంటలకే పరిమితం అయ్యింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఉద్యోగులకు వాహనాల పంపిణీ

హైదరాబాద్

నగరానికి చెందిన ముకుంద ఉద్యోగులకు వరాలు అందజేసింది. సంస్థ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 20 మంది ఉద్యోగులకు ద్విచక్ర వాహనాలు, ఇద్దరు ఉద్యోగులకు హై రేంజ్ కారులను అందజేశారు. బేగంపేటలోని కంట్రీ క్లబ్ లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో సంస్థ చైర్మన్ నరసింహారెడ్డి ఎండి నికిత రెడ్డిల చేతుల మీదుగా వాహనాలను అందజేశారు. ఉద్యోగులకు ప్రత్యేక ప్రోత్సాహకంగా ఒక నెల వేతనంతో కూడిన చెక్కులను అందజేశారు. అనంతరం ఉద్యోగులందరికీ సంస్థ యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది. ఉద్యోగులు చైర్మన్ నరసింహారెడ్డి నీ ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నరసింహ రెడ్డి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులు లాంటివారని వారిని అన్ని విధాలుగా ఆదుకోవడం లో తమకు ఎంతో ఆనందం ఉంటుందని అన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో ఉద్యోగులు ఆనందంగా ఆడి పాడారు.

## ఆర్ధంతరంగా వాయిదా పడిన లోకో పైలట్ పరీక్షలు

కాకినాడకేంద్ర ప్రభుత్వం లోని ఆర్ఆర్బీ ద్వారా ఈరోజు నిర్వహించనున్న లోకో పైలట్ పరీక్షలు అర్థంతరంగా వాయిదా పడ్డాయి. పరీక్ష హాల్లోకి వెళ్ళిన మూడు గంటల తర్వాత సర్వర్లు పని చేయడం లేదంటూ ఆర్ ఆర్ బి పరీక్షలు వాయిదా వేసింది. మరలా ఎప్పుడు నిర్వహించేది తెలియజేయలేదు. ఈ పరీక్ష రాయడదనికి వివిధ రాష్ట్రాల నుండి పరీక్ష రాసేందుకు అభ్యర్దులు కాకినాడ చేరుకున్నారు. పరీక్షలు వాయిదా పడడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ అసమర్థత వల్లనే రాష్ట్రంలో కరువు ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్శాసనమండలి ఆవరణలో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా పడ్డాయి నీళ్లు ఉన్నయి ఎండల వల్ల పంటలు ఎండుతున్నయి అని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గు చేటు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటర్ మేనేజ్మెంట్ తెలియక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# ఒక్కొక్కరిని దాటుకుంటూ వచ్చేశారే...రేవంత్ స్టైలే వేరు

హైదరాబాద్, మార్చి 19,



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాల్లో తనకు తిరుగు లేకుండా చేసుకుంటున్నట్లే కనిపిస్తుంది. కనుచూపు మేరలో మరో నేత ఆయనకు పోటీకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఉన్న నలుగురైదుగురు సీనియర్ నేతలు సయితం రేవంత్ రెడ్డి ధాటికి తట్టుకోలేకపోతున్నట్లే కనిపిస్తుంది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో చూసుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య పోటీ తీవ్రంగానే ఉంది. సిద్ధరామయ్యను తప్పించి డీకేను ముఖ్యమంత్రిని చేస్తారన్న ప్రచారం అక్కడ జరుగుతుంది. కానీ తెలంగాణలో అలాంటి ప్రచారానికి కూడా తావులేకుండా గ్రౌండ్ వర్క్ ను ముందుగానే రేవంత్ చేసుకున్నట్లు కనిపిస్తుంది.రేవంత్ రెడ్డికి సరిసమానంగా పోటీ పడే నేత ఎవరూ కనిపించకుండా చేసుకున్నారు. సీనియర్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వారు ఉన్నా వారికి అధినాయకత్వం వద్ద ముఖ్యమంత్రి పదవిని చేపట్టేంత స్థాయిలేదన్న రీతిలో ఇప్పటికే కలరింగ్ వచ్చేసింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండుసార్లు పీసీసీ చీఫ్ గా పనిచేసినా పార్టీని అధికారంలోకి తేలేకపోయారు. అది ఆయనకు మైనస్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి అధినాయకత్వం వద్ద మంచి మార్కులున్నప్పటికీ నాయకత్వంపై అనేక అనుమానాలున్నాయి. ఆయన సమర్థతపై సందేహాల వల్లనే ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి రేసులో లేరన్నది నిజమని చెప్పుకోవాలి. ఇటీవల తాను ముఖ్యమంత్రి పదవి రేసులో లేనని స్వయంగా చెప్పి అందరినీ ఆశ్చర్యపర్చారు.. ఇక మల్లుభట్టి విక్రమార్క కు మంచి మార్కులు ఉన్నప్పటికీ అందరినీ, కలుపుకుని పోయే నేత అయినప్పటికీ, పార్టీని విజయం వైపు నడిపించే శక్తి సామర్థ్యాలు లేవన్నది పార్టీ వర్గాలే అంగీకరిస్తున్న విషయం. ఆయన వ్యక్తిత్వం మంచిదే. అవినీతి ముద్ర లేదు. వివాదరహితుడు. అయితే ప్రజలను ఆకట్టుకునేంత ప్రసంగాలు చేయలేకపోవడం ఆయన బలహీనత. ఆయనకున్నంతలో మధిర నియోజకవర్గం నేతగానే ఎక్కువగా చెలామణి అవుతారు. అంతే తప్ప రాష్ట్ర స్థాయి నేత కాలేరన్నది కాంగ్రెస్ పార్టీ నేతలే అంగీకరిస్తున్న విషయం. అందుకే ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క పేరు కూడా రేవంత్ రెడ్డికి సరిసమాన స్థాయిలో లేకపోవడం రేవంత్ కు కలసి వచ్చినట్లుగానే కనిపిస్తుంది.ఇక కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తొలి నుంచి పార్టీని నమ్ముకున్న నేత. దశాబ్దాల నుంచి పార్టీలోనే కొనసాగుతుండటం ఆయనకున్న ప్రత్యేకత. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆయన పార్టీ జెండాను వదిలిపెట్టలేదు. అయితే కోమటిరెడ్డి దూకుడు మనస్తత్వంతో పాటు ఆయన పదిమందిని ఆకట్టుకునే పరిస్థితి లేదన్నది వాస్తవం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి సయితం స్వయంగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు కొనసాగుతారని చెప్పి సెల్ఫ్ గోల్ వేసుకున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అందుకే ప్రచారం జరుగుతున్నట్లు రేవంత్ రెడ్డి పదవికి ముప్పు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు. క్రౌడ్ పుల్లర్ గా కూడా ఆయనకు పేరుండటం, ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేత కావడం అదనపు బలం అని చెప్పక తప్పదు.

## ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా కు జాతీయ 'స్కోచ్ అవార్డు'

ఒంగోలుప్రకాశం జిల్లాలో బాల్య వివాహాలను నివారించెందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి బంగారు భవిష్యత్తు ఉన్న బాల్యానికి బాటలు వేసేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన స్కోచ్ అవార్డు లభించింది. బాల్య వివాహాల నివారణకై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తూ 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించి విజయం సాధించారు. త్వరలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ జాతీయ అవార్డును అందుకోనున్నారు. జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చే బడ్జెట్

హైదరాబాద్రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా ఉందని మంత్రి కొండ సురేఖ అన్నారు. ఉపాధి కల్పనకు ఊతం ఇస్తూ... మహిళా సంక్షేమం, యువత, దళితులు, గిరిజనుల సంక్షేమానికి దిక్సూచీలా ఉంది.యావత్ తెలంగాణ సమాజంలో అన్ని వర్గాల ఆకాంక్షలకు అద్దం పట్టేలా బడ్జెట్ను భట్టి విక్రమార్క రూపొందించడం ప్రశంసనీయం. సవాళ్ళపై స్వారీ చేస్తూనే... రాష్ట్ర బడ్జెట్ తెలంగాణ ప్రాంత ప్రజల ఆర్థిక స్థిరత్వానికి బాటలు వేస్తుంది. అసెంబ్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క, . శాసనమండలిలో ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబు కి అభినందనలని అన్నారు. .

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనల వెల్లువ

హైదరాబాద్ ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఎస్సీ సంఘాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

# భారీగా విస్తరిస్తున్న మహానగరం

హైదరాబాద్, మార్చి 19,

హైదరాబాద్ మహానగర విస్తరణపై రేవంత్ సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీలతో పాటుగా.. కొత్తగా ఫోర్త్ సిటీ (ఫ్యూచర్ సిటీ)ని నిర్మిస్తున్నారు. దాదాపు 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. ఇందులో భాగంగా.. హెచ్ఎండీఏ తరహాలో ఫ్యూచర్సిటీ అభివృద్ధి కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. దీనికి ముఖ్యమంత్రి ఛైర్మన్గా వ్యవహరించనున్నారు. ప్రస్తుత హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య వెం?త్తం 56 గ్రామాలతో ఈ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు.అయితే ఈ అథారిటీ పరిధిలోకి వచ్చే ప్రాంతాలను పక్కా మాస్టర్ ప్లాన్ ప్రకారం అద్భుతంగా డెవలప్ చేయనున్నారు. ప్రస్తుతం ఈఅఆం పరిధిలోకి 56 గ్రామాలను తీసుకున్నారు. గతంలో ఇందులోని కొన్ని గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉండగా.. తాజాగా ఎఫ్సీడీఏ పరిధిలో కలిపారు. ఔటర్ రింగ్రోడ్ అవతల, శ్రీశైలం నేషనల్ హైవే, నాగార్జున సాగర్ స్టేట్ హైవేల పరిధిలోని పలు గ్రామాలను సైతం దీని పరిధిలోకి తీసుకొచ్చారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పరిధిలోని శంషాబాద్, దాని పరిసర ప్రాంతాలు సైతం ఎఫ్సీడీఏ పరిధిలో చేర్చారు.ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా.. మీర్ఖాన్ పేట గ్రామంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ అండ్ ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నారు. దీంతో పాటుగా.. అథారిటీ పరిధిలోని పలు హబ్లను కలిపి 12 జోన్లుగా విస్తరించే ఛాన్స్ ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలోనే తెలంగాణ ఇండస్ట్రియల్ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆధ్వర్యంలో



ఇండస్ట్రియల్ క్లస్టర్లు, ఎకనామిక్ జోన్లు అభివృద్ధి చేయనున్నారు. అథారిటీ పరిధిలోనే కాంప్రహెన్సివల్ మాస్టర్ప్లాన్తో పాటు అన్ని ప్రాంతాలకు మల్టీ మోడల్ కనెక్టివిటీ, మోడరన్ అర్బన్ ఎమినిటీస్ సైతం కల్పించనున్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో కొత్తగా రేడియల్ రోడ్లు, మెట్రోరైల్ కనెక్టివిటీని కూడా అవకాశం కల్పించనున్నారు. ఫ్యూచర్ సిటీ మెట్రోపై ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

1.ఫ్యూచర్ సిటీ అథారిటీ పరిధిలోకి వచ్చే ప్రాంతాలను ప్లాన్ ప్రకారం డెవలప్చేయనున్నారు. దీంతో ఏయే ప్రాంతాలు ఇందులో కలుస్తాయన్న అంశంపై అంతా ఆసక్తి నెలకొన్నది.

2.ఎఫ్సీడీఏ పరిధిలోకి ఇప్పటికే హెచ్ఎండీఏలోని 56 రెవెన్యూ గ్రామాలను కలపగా.. ఔటర్ రింగ్ రోడ్ అవతల, శ్రీశైలం జాతీయ రహదారి, నాగార్జున సాగర్ స్టేట్ హైవేల పరిధిలోని పలు ప్రాంతాలను కూడా తీసుకువచ్చారు.

3.రాజీవ్గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పరిధిలోని శంషాబాద్, దాని పరిసర ప్రాంతాలు కూడా ఫ్యూచర్ సిటీలో వచ్చి చేరాయి. ఈ ప్రాంతంలోనే తెలంగాణ ఇండస్ట్రియల్ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆధ్వర్యంలో ఎకనామిక్ జోన్, ఇండస్ట్రియల్ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నారు.

4.ఈ అథారిటీ పరిధిలో కాంప్రహెన్సివల్ మాస్టర్ ప్లాన్ తో పాటు.. మల్టీమోడల్ కనెక్టివిటీ, మోడరన్ అర్బన్ ఎమినిటీస్ కల్పించనున్నారు. భవిష్యత్లో ఈ ప్రాంతంలో రేడియల్రోడ్లు, మెట్రోరైల్ కనెక్టివిటీని కూడా కల్పించనున్నారు.

5.ఫ్యూచర్ సిటీ అథారిటీ పరిధిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ అండ్ ఎడ్యుకేషన్ హబ్లతో కలిపి.. 12 జోన్లుగా విస్తరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

6.ఈ నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిని ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దాలని యోచిస్తోంది. హైదరాబాద్ నగరం విస్తరణ కూడా ఎక్కువగా అటువైపే ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

7.శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి మెట్రోరైలు విస్తరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

8.ఈ నగరం అభివృద్ధి చెందడంతో హైదరాబాద్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నగరంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి.

# పతాపం చూపిస్తున్న భార్య బాధితులు

కరీంనగర్, మార్చి 19,

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భార్య బాధితులు రెచ్చిపోయారు. వింత ఆందోళనలకు దిగారు. పెళ్ళాం కోసం ఒకరు విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కితే మరొకరు పెళ్ళాన్ని కాపురానికి పంపించాలని పోలీస్ స్టేషన్ ముందు బీరు బాటిల్ తో గాయం చేసుకున్నాడు. ఇంకొకరు రోడ్డుపై ఎర్రటి ఎండలో అర్థనగ్నంగా బైఠాయించాడు.కరీంనగర్లో పెళ్ళాం ఎడబాటును తట్టుకోలేక ముగ్గురు మూడు రకాల నిరసనలతో పోలీసులకు చుక్కలు చూపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భార్య భాదితుల ఆందోళనలు నవ్వుల పాలవుతున్నాయి.కరీంనగర్లో వారం రోజుల్లో ముగ్గురు మద్యం మత్తులో వినూత్న నిరసనలకు దిగి అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు. ఈనెల 11న పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం ఎన్టీపీసీ లో కూలీ పని చేసే బీహార్ కు చెందిన అజయ్ హల్ చల్ చేశాడు. భార్య ప్రీతితో గొడవ పడడంతో స్థానికంగా ఉండే బంధువుల వద్దకు ఆమె వెళ్ళిపోయింది.భార్య ఎడబాటును తట్టుకోలేని అజయ్ మద్యం సేవించి మత్తులో మేడిపల్లి సెంటర్ లోని విద్యుత్ హై టెన్షన్ టవర్ ఎక్కాడు. విద్యుత్ వైర్ల వరకు వెళ్ళి భార్య కావాలని డిమాండ్ చేశాడు. ప్రమాదక పరిస్థితిలో కరెంట్ హై టెన్షన్ వైర్ల వద్దకు వెళ్ళి కాపురానికి దూరమైన భార్యను రప్పించాలని, లేకుంటే కరెంట్ వైర్లు ముట్టుకుంటానని బెదిరించాడు.హై టెన్షన్ టవర్ పై అజయ్ హల్చల్ తో పోలీసులు స్థానికులు హైరానాకు గురయ్యారు. భార్య వచ్చే వరకు దిగనని స్పష్టం చేయడంతో పోలీసులు వెంటనే కూలీలు ఉండే ప్రాంతానికి చేరుకుని భార్య ప్రీతిని పట్టుకొచ్చారు.భార్య ను చూసిన అజయ్ ముసి ముసి నవ్వులు నవ్వుతూ టవర్ పై కిందకు దిగాడు. తాగొచ్చి కొట్టడంతోనే భర్తను వదిలేసి పోయానని భార్య ప్రీతి తెలుపడంతో ఇద్దరిని పోలీసులు తమ వాహనంలో స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద యువకుడు శివరాం హడావిడి చేశాడు. పెళ్ళాం కావాలని మద్యం మత్తులో గోల చేశాడు. బీర్ సీసాతో తలపై కొట్టుకుని గాయం చేసుకున్నాడు. రామడుగు మండలానికి చెందిన శివరాం మూడేళ్ల క్రితం జగిత్యాల పట్టణానికి చెందిన మంజుల ను వివాహం చేసుకున్నాడు.ఓ కేసులో జైలు శిక్ష అనుభవించిన శివరాంతో కాపురం చేయలేనని మంజుల పుట్టింటింటికి వెళ్ళిపోయింది. దీంతో మానసిక ఆందోళనలో ఉన్న శివరాం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళ్ళగా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదనతో బీరు బాటిల్ తో హల్ చల్ చేశాడు.భార్యను కాపురానికి పంపించాలని బీర్ బాటిల్ తో తల పై కొట్టుకుని ఆందోళనకు దిగాడు. పోలీసులు మత్తు వదిలేలా కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు.

హుజురాబాద్ లో ఎండలో రోడ్డుపై అర్థనగ్నంగా....

గోదావరిఖని, జగిత్యాల ఘటనలు మరిచిపోకముందే హుజురాబాద్ లో మరో యువకుడు రాజు పెళ్ళాం కోసం వినూత్న ఆందోళనలకు దిగాడు. పోలీస్ స్టేషన్ ముందు ఎర్రటి ఎండలో రోడ్డుపై అర్థనగ్నంగా బైఠాయించాడు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన రాజు భార్య తల్లిగారి ఊరు హుజురాబాద్ కాగా, అత్తమామలు కొట్టి తిట్టి భార్యను తనతో పంపకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. భార్య ను తనతో పంపాలని లేకుంటే చస్తానని సెల్ ఫోన్ తో తల కొట్టుకుంటు హెచ్చరించాడు. దీంతో స్థానికులు పోలీసులు అతన్ని సముదాయించి స్టేషన్ కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.ముగ్గురిది ఒకే డిమాండ్ పెళ్ళాం కావాలి...భార్యను కాపురానికి పంపించాలని. కానీ ముగ్గురు మద్యం మత్తులోనే అలా ప్రవర్తించారు. తాగిన మైకంలో పెళ్ళాంతో గొడవపడడంతోనే వేగలేక వాళ్ళు అవ్వగారింటికి వెళ్ళి వారి తిక్క కుదిర్చారు. మద్యం మత్తే వారిని అలా ప్రవర్తించేలా చేస్తుందని భావిస్తున్నారు. మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లడం లేదా మద్యం సేవించడం బంద్ చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## సన్న వడ్లకు రూ.500 బోనస్:

హైదరాబాద్రాష్ట్ర రైతులనుండి కొనుగోలు చేసే సన్న ధాన్యానికి ప్రతి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున అదనపు ప్రోత్సాహాన్ని (బోనస్) చెల్లిస్తున్నాం. దీని వల్ల రాష్ట్రంలో సన్న రకాల వరిసాగు గణనీయంగా పెరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.అకాల వర్షాల వల్ల ధాన్యం పాడవకుండా, పండిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో ఎటువంటి నష్టం జరుగకుండా, గంట గంటకూ వాతావరణ సూచనలను అటు రైతులకు, ఇటు కొనుగోలు కేంద్రాలకు తెలియజేస్తున్నాం. అధునాతన డ్రైయర్లు, ధాన్యం క్లీనర్లు, తగినన్ని టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. 2024-25 ఖరీఫ్ సీజన్ లో పది లక్షల ముప్పై ఐదు వేల నాలుగు వందల ఎనభై నాలుగు (10,35,484) మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, పన్నెండు వేల ఐదు వందల పదకొండు కోట్ల డెబ్బై ఆరు లక్షల రూపాయలు (12,511.76 కోట్లు) వారి ఖాతాలలో జమ చేయడమైనది

## యాదవ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయండి. మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేసిన యాదవులు.

కమాన్ పూర్ , మార్చి 19

రామగిరి మండలం కల్వచర్ల పరిధిలోని గోకుల్ నగర్ లో యాదవ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. కల్వచర్ల గ్రామ పరిధిలోని గోకుల్ నగర్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దుదిళ్ళ శ్రీధర్ బాబు ని హైదరాబాద్ లో కలిసి కల్వచర్ల గ్రామంలో సుమారు 200యాదవుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, గతంలో నిర్మించిన కుల సంఘం గదులు శిథిలావస్థకు చేరడం మరియు ప్రస్తుత జనాభా పెరుగుదల వల్ల దానిని వినియోగించలేకపోతున్నాము అని తెలుపుతూ కుల సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుకు ఉన్న భూమిలో మిని ఫంక్షన్ హాల్ నిర్మించుకోవడానికి ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయాలని యాదవ సంఘం తరపున వినతి పత్రం ఇవ్వడం జరిగింది మరియు సెంటినరీ కాలనీ లో మేకల మార్కెట్ లో జీవనోపాధి పొందుతున్న వారు ప్రస్తుతం ఉన్న స్థలంలోనే రేకుల షెడ్ వేసుకోవడానికి అనుమతులు ఇప్పించాలని శ్రీ రామాంజనేయ మేకల మార్కెట్ వారు విన్నవించగా మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందిస్తూ అర్జీ త్రి జనరల్ మేనేజర్ తో మాట్లాడటం జరిగింది. అలాగే తప్పకుండా యాదవ సోదరుల కోసం మినీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు అనంతరం మంత్రి గారిని యాదవ సంఘం సభ్యులు శాలువాతో సన్మానించి, జ్ఞాపకను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు కొయ్యడ కిష్టయ్య ,ఒర్రే సదయ్య,బనుక అంజయ్య, మేకల ఓదెలు,శీలం లక్ష్మయ్య, శీలం కొమురయ్య, బుట్టి రాజయ్య,కురుమల్ల కుమార్, చిగురు సూర్యం, మేకల మారుతి పాల్గొన్నారు.

## తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తీసెయ్యడాన్ని ఖండిస్తున్నాం. వైఎస్ షర్మిలా రెడ్డి

విజయవాడ , మార్చి 19

అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టుంది ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు. అనాడు జగన్ చేసిన తప్పే నేడు చంద్రబాబు చేస్తున్నారని ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను గాయపరిచింది. వైఎస్సార్ జిల్లాను తిరిగి వైఎస్సార్ కడప జిల్లా పేరుతో సవరించడంలో అభ్యంతరం లేకపోయినా. కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తీసెయ్యడాన్ని ఖండిస్తున్నాం. వైఎస్సార్ అంటే ఎందుకింత కక్ష అని అడుగుతున్నాం. వైఎస్సార్ జిల్లాలో తిరిగి కడప పేరు చేర్చినప్పుడు, విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు ఎన్టీఆర్ విజయవాడ అనో లేక. పాత కృష్ణ జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాగా పేరు ఎందుకు మార్చలేదు అని ప్రశ్నిస్తున్నాం. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి. దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆద్యుడు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నేత. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు లాంటి ప్రజాకర్షక పథకాలకు రూపశిల్పి మహానేత వైఎస్సార్. తెలుగు వారు తమ గుండెల్లో గుడి కట్టుకొని, ఇంట్లో దేవుడి ఫోటోల పక్కన వైఎస్సార్ ఫోటో పెట్టుకొని, పూజిస్తున్న గొప్ప నేతకు రాజకీయాలను ఆపాదించడం సరైంది కాదు. ఇది ఆయనకు ఇచ్చే గౌరవం అంతకన్నా కాదు. వైఎస్సార్ అనే పేరు ప్రజల ఆస్తి . ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు. వైఎస్సార్ తెలుగు వారి సొత్తని అన్నారు.

## అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్టు

కాకినాడఅంతర్ జిల్లా నేరస్తుడిని కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు... కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వివరాలు వెల్లడించారు.. విశాఖపట్నం కు చెందిన చిటికెల నాగేశ్వరరావు గతంలో చైతన్య గోదావరి బ్యాంక్ లో ఉద్యోగం చేసేవాడని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేసేటప్పుడు ఆన్లైన్ బెట్టింగ్ ఇతర వ్యసనాలకు అలవాటుపడి సుమారు 900 గ్రాముల బంగారాన్ని అధికార దుర్వినియోగం చేశాడని ఆ బంగారంనికి సంబంధించి 40 లక్షలు బ్యాంకుకి కట్టాడని ఆడబ్బులు ఎలా సంపాదించాలని ఉద్దేశంతో ఇప్పటివరకు పలుచోరీలు చేశాడని. ఈక్రమంలో ముద్దాయి ఒక్కసారి లైఫ్లో పెద్దగా సెటిల్అవ్వాలని ఉద్దేశంతో బ్యాంకు లేదా,ఏటీఎంలు దగ్గర గన్ లతో బెదిరించి చోరీలు చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఈక్రమంలో మాకు వచ్చిన సమాచారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో అతని అరెస్టు చేసి నేరస్తు నుండి బీహార్ లో కొనుగోలు చేసిన రెండు పిస్టలను,17 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు..ఈమీడియా సమావేశంలో కాకినాడ ఎస్డిపిఓ దేవరాజ్ పాటిల్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చైతన్యకృష్ణ, ఎస్సైలు మురళీమోహన్,రవీంద్రనాథ్ బాబు,సిబ్బంది పాల్గొన్నారు..

## ఏప్రిల్ 5 నుంచి ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు

బద్వేలు ఆంధ్ర భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట రామాలయం బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

# రేపటి నుంచి టెన్త్ ఎగ్జామ్స్... ఒక నిమిషం నిబంధన సడలింపు

హైదరాబాద్, మార్చి 19

: తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఎస్సీ-2025 వార్షిక పరీక్షలను 21.03.2025 నుంచి 04.04.2025 వరకు రాష్ట్రవ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇక పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహిస్తారు.

జీ. ఫస్ట్ లాంగ్వేజ్ (కాంపోజిట్ కోర్సు) సమయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకు.

ఎ. సైన్స్ సబ్జెక్టు విషయంలో రెండు భాగాలు ఉంటాయి. అంటే పార్ట్-ఎ ఫిజికల్ సైన్స్, పార్ట్-ఎఎ బయోలాజికల్ సైన్స్. వీటిని ఉదయం 9.30 నుండి ఉదయం 11.00 వరకు రెండు వేర్వేరు రోజులలో నిర్వహిస్తారు.

2650 పరీక్షా కేంద్రాలు

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 11,547 పాఠశాలల నుంచి మొత్తం 5,09,403 మంది (బాలురు: 2,58,895, బాలికలు: 2,50,508) విద్యార్థులు నమోదు చేసుకున్నారు. మొత్తం 2650 పరీక్షా కేంద్రాలకు 2650 చీఫ్ సూపరింటెండెంట్లు, 2650 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 28,100 ఇన్విజిలేటర్లను నియమించారు.రాష్ట్రంలోని సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారుల ద్వారా పాఠశాలలకు హాల్ టిక్కెట్లను ఇప్పటికే పంపారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి పొందవచ్చు. లేదా హాల్ టిక్కెట్లను లిలిలి.ఎబవ.బివశ్రీజీనిజినిజీ.ఇనిల.తిని వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావచ్చు.హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయంలో (ఫోన్ నంబర్: 040-23230942), అన్ని జిల్లా విద్యా కార్యాలయాలలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే పరిష్కరించడానికి 24/7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అన్ని పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను ఉదయం 09.35 గంటల వరకు (అంటే 5 నిమిషాల గ్రేస్ పీరియడ్) పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. వాతావరణం, ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు ఉదయం 08.30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం ఒకటి లేదా రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలి. తద్వారా పరీక్ష రోజున పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవచ్చు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి తెలంగాణ హైదరాబాద్‌లోని పాఠశాల విద్య డైరెక్టర్, సీనియర్ అధికారులను జిల్లా స్థాయి పరిశీలకులుగా నియమించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఎగ్జామ్ జరిగే సమయంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేస్తారు. పరీక్షల పర్యవేక్షణను అరికట్టడానికి 144 ఫ్లయింగ్, స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తారు. సంబంధిత జిల్లా



విద్యాశాఖాధికారులు సమస్యాత్మక కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌లను కూడా ఏర్పాటు చేస్తారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి ప్రతి పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్ రూమ్ లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ నిషేధం

పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను నిషేధించారు.

పరీక్షా రాసే విద్యార్థులు, సిబ్బంది పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు తీసుకెళ్లడం నిషేధం

విధుల్లో పాల్గొనే సిబ్బంది తప్పనిసరిగా ఫోటో గుర్తింపు కార్డులు ధరించాలి. బయటి వ్యక్తులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించడానికి అనుమతి లేదు.

అభ్యర్థులు తమతో పాటు ఈ క్రింది వస్తువులను పరీక్షా హాలులోకి తీసుకెళ్లడానికి అనుమతిస్తారు.

జీ. హాల్ టికెట్ ఎ. పరీక్ష ప్యాడ్ ఇ. పెన్, పెన్సిల్, స్కేల్, షార్పెనర్, ఎరేజర్, జామెట్రిక్ పరికరాలు

అభ్యర్థుల ఓఎంఆర్ వివరాలను ముందుగా ధ్రువీకరించాలి.

ప్రశ్నపత్రం ఇచ్చిన వెంటనే విద్యార్థులు ప్రశ్నపత్రంలోని పార్ట్-ఎలోని ప్రతి పేజీలో వారి హాల్ టికెట్ నెంబర్ రాయాలి.

ఆన్సర్ బుక్ లెట్ పై అభ్యర్థి తన హాల్ టికెట్ నంబర్ లేదా పేరును రాయకూడదు. తన సంతకం లేదా ఏదైనా గుర్తును సమాధాన బుక్‌లెట్, పార్ట్-బి (బిట్ పేపర్), గ్రాఫ్, మ్యాప్‌లోని ఏ భాగంలోనైనా రాయకూడదు.

అభ్యర్థులు హాల్‌టికెట్ షీట్‌లోని సమాధాన బుక్‌లెట్ సీరియల్ నంబర్‌ను సూచించిన పెట్టె, పార్ట్-బి (బిట్ పేపర్), గ్రాఫ్ మరియు మ్యాప్‌లో వ్రాయాలి.

పరీక్ష సమయంలో ఎవరైనా అభ్యర్థి కాపీయింగ్/మాస్ కాపీయింగ్‌లో దొరికితే వారిని డిబార్ చేస్తారు. తదుపరి పరీక్షలకు అనుమతించరు.

పరీక్షా విధుల్లో పాల్గొన్న ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్

చట్టం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటారు.

సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి, తహశీల్దార్, మండల విద్యాశాఖాధికారి ఫోన్ నంబర్లను పరీక్షా కేంద్రంలోని ప్రదేశాలలో ప్రదర్శించాలి.

# ఇక 15 నిమిషాలలో రిజిస్ట్రేషన్

నల్గొండ, మార్చి 19

లంగాణ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ సేవలను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ప్రజలకు వేగవంతమైన, అవినీతి రహిత సేవలు అందించేందుకు, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కు స్లాట్ బుకింగ్ తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నూతన విధానాన్ని అమలు చేస్తామన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న స్థలాల్లో గజం రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు తప్పవని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. భూముల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ వేగవంతం చేయాలని నిర్ణయించామన్నారు.ప్రస్తుతం ఒక్క డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు దాదాపుగా 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతోంది. ఆ సమయాన్ని తగ్గించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ విధానం అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం అమల్లోకి వస్తే 15 నిముషాల్లోనే ఒక్కో రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ విధానంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు గంటల తరబడి నిరీక్షించే అవకాశం ఉండదన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, చాట్‌బాట్ సేవల? వినియోగించుకుని రిజిస్ట్రేషన్ శాఖను సాంకేతికంగా మార్చాలని మంత్రి పొంగులేటి సూచించారు.నిషేధిత జాబితాలోని ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా సబ్ రిజిస్ట్రార్లు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూభారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేసి నిషేధిత ఆస్తుల వివరాలను పొందుపరచి, రెవెన్యూశాఖతో అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని నిషేధిత జాబితాలోని గజం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నిషేధిత జాబితా ఆస్తులలో గజం స్థలం రిజిస్ట్రేషన్ చేసినా క్షణాల్లోనే తన ఆఫీసుతో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమాచారం కనిపించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. భూముల క్రమబద్ధీకరణపై రిజిస్ట్రార్లు ప్రతి రోజు సమీక్షించాలని ఏవైనా సమస్యలుంటే పై అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో పెట్టకూడదని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని నిబంధనలకు తగిన విధంగా ముందుకెళ్లాలని సూచించారు.

# ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు

హైదరాబాద్‌తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ ఉ మెన్స్ గేమ్స్ మరియు కల్చరల్ కాంపిటీషన్ (పురుషులు, మహిళల) జిల్లా స్థాయి విద్యుత్ ఉద్యోగులు కల్చరల్ ప్రోగ్రామ్స్ ముగిసాయి. మహిళలకు కోసం క్యారం బోర్డ్, చెస్, టేబుల్ టెన్నిస్, స్పోర్ట్స్ టోర్నమెంట్ నాలుగు రోజులు తోపాటు జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు ఎర్రగడ్డ ప్రభుత్వ తెలంగాణ జెన్కో ఆడిటోరియం లో బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎండీ మహమ్మద్ ముషరాఫ్ అలీ ఫరుకి, చీఫ్ ఇంజనీర్ చక్రపాణి, సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు హాజయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగం తో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. మహిళలకు విద్యుత్ ఉద్యోగులకు ఈ కార్యక్రమాలు అటవిడుపు లాంటివి అని, వారానికి ఒక రోజు కేటాయించాలని అన్నారు. 4 రోజుల నుంచి జరుగుతున్న పోటీల్లో, తెలంగాణ రాష్ట్రం నుంచి క్రీడాకారులు హాజరై స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజయవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం సీఎండీ మహమ్మద్ ముషరాఫ్ అలీ ఫరుకి ని మహిళ విద్యుత్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం జనరల్ సెక్రెటరీ సాయి శ్రీనివాస్ మరియు స్పోర్ట్స్ చైర్మన్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

=========================

## మైనర్ స్కూల్ బాలికలను లైంగికంగా వేధిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రకాశం

ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని బాలికల పాఠశాలలో 6, 7వ తరగతి విద్యార్థినుల పట్ల రంగారెడ్డి అనే ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాని తల్లిదండ్రులు ఆరోపించారు. దాదాపు 6 మంది పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, ఇంట్లో చెప్తే కొడతానని ఆ ఉపాధ్యాయుడు పిల్లలను బెదిరించడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన పట్ల ఎంఈఓకు ఫిర్యాదు చేసినా ఉపాధ్యాయుడి పైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు తల్లిదండ్రులు.

## రేవంత్ రెడ్డి చేతకానితనం వల్లనే పంటలు ఎండిపోతున్నాయి: కేటీఆర్

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నయ్. అంటే ముందు చూపులేని ఈ సన్నాసి, సోయిలేని కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎండల వలన పంటలు ఎండిపోతున్నాయని ముఖ్యమంత్రి చేతకాని మాటలు చెబుతున్నాడు?దానికి ముమ్మాటికి కారణం రేవంత్ రెడ్డినే. రేవంత్ రెడ్డి చేతకానితనం, తెలివి లేని తనం, సాగునీటి నిర్వహణ ప్రాజెక్టుల నిర్వహణ చేయలేని చేతకాని లేనితనం వల్లనే పంటలు ఎండిపోతున్నాయి. తుల పట్ల, రైతాంగం పట్ల ప్రభుత్వం తన బాధ్యత మర్చిపోయి మొద్దు నిద్ర పోతున్నది కాబట్టే పంటలు ఎండిపోయాయి. ఎండిపోయిన ప్రతి ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున పంట నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాము. ఎండిన ప్రతి ఎకరానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. ఈ మేరకు రైతన్నలకు నష్టపరిహారం ఇచ్చేందుకు ఈ బడ్జెట్ లోనే నిధులను కేటాయించాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## హిజ్రా హత్య కేసు?ఎనిమిది బృందాలతో గాలింపు


అనకాపల్లి

ఏపీలో మరో దారుణం జరిగింది. ఓ హిజ్రాను దుండగులు అత్యాచారం చేసి ముక్కలుగా నరికి చంపిన ఘటన అనకాపల్లి జిల్లా వెలుగు చూసింది. పోలీసులు ఓ గుర్తు తెలియని మహిళా మృతదేహాన్ని స్వాధీనం చేసుకోగా..వారి విచారణ లో ఆమె దీప అనే హిజ్రా అని తేలింది.అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలోఆమె శరీర భాగాలు లభించాయి.మిగతా భాగాల కోసం పోలీసులు గాలింపు చేస్తున్నారు. కాగా, నిందితుల కోసం 8 బృందాలు గాలిస్తున్నా యని అధికారులు తెలిపారు. ఘటనపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు..

## ఈ నెల 20 న తిరుమల కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాక

రేణిగుంట, మార్చి 18 :

ఈ నెల 20 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి, తిరుమల కు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్.ఎస్. పేర్కొన్నారు. రేణిగుంట విమానాశ్రయం నందు జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు,ఎయిర్పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాథన్ తో కలసి యాఏ లో ( ముందస్తు భద్రత లైజన్ ) భాగంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా ఎలాంటి చిన్న పొరపాట్లు కు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను వంతం




చేయాలన్నారు. ఈ నెల 20 న గురువారం రాత్రి 9.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుంటారని తెలిపారు.,శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని అనంతరంతిరిగి మధ్యాహ్నం 2 గంటలకు తిరుమల నుండి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ వారు ప్రత్యేక డాక్టర్లు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఏర్పాట్లు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు, ఫైర్ సేఫ్టీ,శానిటేషన్, కాన్వాయ్ వాహనాలు తదితరాల ఏర్పాటు పై సమీక్ష నిర్వహించారు. విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ లు రవిమనోహరాచారి,వి.నాగభూషణ రావ్, ఆర్డీఓ శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలాజి నాయక్, , జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్పోర్ట్ అధికారులు,తహశీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాకు జాయింట్ సర్వే నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 19: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరాకు జాయింట్ సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రెవిన్యూ, మైనింగ్, భూగర్భ జల శాఖ, నీటిపారుదల శాఖల అధికారులతో జిల్లా స్థాయి సాండ్ (ఇసుక) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు కావలసిన ఇసుక నిమిత్తం జాయింట్ సర్వే నిర్వహించాలని రెవిన్యూ, మైనింగ్, భూగర్భ జల శాఖ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. మంజీరా నదిపై జరిగే అక్రమ ఇసుక రవాణా అరికట్టడం కోసం చెక్ పాయింట్ల ఏర్పాటు చేయాలని రెవిన్యూ, పోలీసు, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాలను అరికట్టేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ పాయింట్ ల వద్ద సీసీ టివి లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి,



ఆర్డీఓ లు ప్రభాకర్, వీణ, మైనింగ్ సహాయ సంచాలకులు పి.నగేష్, ఇరిగేషన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసం ఉంటే అద్భుతాలు సాధిస్తారు : జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మార్చి 19: దివ్యాంగ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ఉంటే జీవితంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష కామారెడ్డి జిల్లా, భారతీయ దివ్యాంగుల పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి దివ్యాంగ విద్యార్థుల కు ఉపకరణాలు పంపిణీ శిబిరాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దివ్యాంగులను వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ వాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. 2014 లో ఒక దివ్యంగా విద్యార్థి సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో టాపర్ గా నిల్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జిల్లాలో గుర్తించబడిన 207 మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. భవిత కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్నటువంటి సహిత విద్య కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి .ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు నాగ వేందర్,కృష్ణ చైతన్య, వేణుగోపాల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ పతి , ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ సహిత విద్య రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం.:కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చల్లా వెంకటనారాయణ



బూర్గంపాడు, మార్చి 19 (భారతశక్తి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చల్లా వెంకటనారాయణ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ పొదెం వీరయ్య, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవ ఆమోదం తెలిపినందుకు వెంకటనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్ల చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ముందుగా రాజ్యాంగ ప్రధాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేసిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు వర్గీకరణ బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బిల్లులో ఎస్సీలు గా ఉన్న 59 ఉప కులాలను మూడు గ్రూపులుగా చేసి 15 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వర రెడ్డి, బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, ఐ ఎన్ టి యూ సి యూత్ జిల్లా అధ్యక్షులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, మాజీ మండల అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, బెల్లంకొండ వాసుదేవరావు, భజన ప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాములోరి కళ్యాణం భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు:జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్

భద్రాచలం, మార్చి 19 (భారతశక్తి):భద్రాచలంలో ఏప్రిల్ 6న శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలకు భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ తెలిపారు. భద్రాచలంలో రామయ్య కల్యాణ మహోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ మాట్లాడుతూ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవ వేడుకలను తిలకించడానికి వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. ఎండ వేడిని దృష్టిలో ఉంచుకొని భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు తగు సూచనలు చేస్తున్నట్లు



కలెక్టర్ జితేష్ వి పటేల్ పేర్కొన్నారు.

# మిషన్ భగీరథ గ్రీడ్ నీటి పైపు లీకేజీని ఆసరాగా తీసుకున్న రైతన్న %-% అధికారుల నిర్లక్ష్యంతో త్రాగు నీటి కొరత

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 19: నిర్మల్ జిల్లా మండలంలోని అంబ కంటి తండా బామ్ని గ్రామాల మధ్యలోని మిషన్ భగీరథ గ్రీడ్ త్రాగు నీటి పైపులో లీకేజీ ఏర్పడిన నేపథ్యంలో, సమీపంలోని రైతున్న ఆ లీకేజీని తమకు అనుకూలంగా మలచుకున్నారు. త్రాగునీటి సరఫరా కోసం వేసిన పైప్‌లైన్‌లో గత కొన్ని రోజులుగా లీకేజీ ఏర్పడింది. దీనిపై సంబంధిత అధికారులకు, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతున్న ఆ లీకేజీ నీటిని తమ పొలాల్లోకి మళ్లించుకోవడం ప్రారంభించారు.



గ్రామానికి సమీపంలోని పొలాల్లో సాగు కోసం నీటి కొరత నెలకొన్న నేపథ్యంలో, రైతన్న పైప్ లీకేజీ ద్వారా లభించిన నీటిని ఉపయోగించుకోవడం ప్రారంభించారు. "ప్రభుత్వం త్రాగు నీటి సమస్యను సకాలంలో పరిష్కరించకపోవడంతో మేం లీకేజీ నీటిని వృధా కాకుండా పొలాలకు మళ్లించుకుంటున్నాం," అని ఓ రైతు వాపోయాడు.స్థానికులు

ఈ లీకేజీ వల్ల త్రాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే లీకేజీని చక్కదిద్దాలని అధికారులను కోరుతున్నారు. అయితే, అధికారులు నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే గ్రామస్థులు ఆందోళనకు దిగే అవకాశం ఉంది.గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "ఇది త్రాగునీటి పైపులో లీకేజీ సమస్య మాత్రమే కాదు, ఇది అధికారుల పనితీరును ప్రశ్నించే అంశం. త్రాగునీటి కొరతను అధిగమించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలి," అని తెలిపారు.స్థానిక ప్రజలు, రైతులు ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

# గ్రంథాలయంలో ఉద్యోగాల పంట,చక్కటి ర్యాంకులతో విద్యార్థులు





భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 19 (భారతశక్తి): గ్రంథాలయం పై ఆధారపడి చదివిన విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్ష ఫలితాల్లో ఇద్దరు చక్కటి ర్యాంకులు సాధించి ఉత్తమ ఫలితాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెం నందు గత మూడు సంవత్సరాలుగా గ్రంథాలయంలో వినియోగించుకుని వెలువడిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లలో రాష్ట్రస్థాయిలో 142వ ర్యాంకుతో జోనల్ స్థాయిలో 18వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో భారీ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్రస్థాయిలో 25 ర్యాంకుతో జోనల్ స్థాయిలో 35 ర్యాంక్ తో ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందిన సతీష్ శ్రీలత యాదవ్ ఉద్యోగం పొందారు. ఈ ఫలితాన్ని ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని జిల్లా కార్యదర్శి అర్జున్ అన్నారు. విద్యార్థుల కృషి పట్టుదల అమోఘం అని వీరు ఉద్యోగం సాధించడం కొత్తగూడెం జిల్లా గ్రంథాలయకే గర్వకారణం అని వీరు ఉద్యోగానికి పొందడానికి గ్రంథాలయంలో ఏర్పాట్లతో సహాయ సహకారాలు అందించిన గ్రంథ పాలకురాలు మణి మృదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు మూడు సంవత్సరాల గ్రంథాలయమును వినియోగించుకున్నామని ఎటువంటి కష్టం వచ్చినా గ్రంథపాలకురాలు తక్షణమే చర్యలు తీసుకొని సహాయ సహకారాలు అందించారని వారు ప్రోత్సాహంతోనే ఉద్యోగం పొందామని, ఇందుకు మేము జిల్లా గ్రంథాలయ సంస్థకు రుణపడి ఉన్నామంటూ ఉద్యోగం సాధించిన ఇరువురు తెలియజేశారు.

# బెట్టింగ్ యాప్ లకు పాల్పడితే కట్టిన చర్యలు

## -యువత సన్మార్గంలో ప్రయాణించాలి

## -అక్రమ బెట్టింగ్ యాప్స్ పై ప్రత్యేక నిఘా

## -భైంసా పట్టణ సీఐ గోపీనాథ్.






నిర్మల్, భారత శక్తి ప్రతినిధి, మార్చి 19:నిర్మల్ జిల్లా యువత బెట్టింగ్ యాప్ లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో ఉండి మంచిగా చదివి ఉన్నత స్థాయిలకు ఎదగాలని భైంసా పట్టణ సీఐ గోపీనాథ్ అన్నారు.

నిర్మల్ ఎస్పీ డాక్టర్ జాన్వి షర్మిల ఆదేశాల మేరకు బెట్టింగ్ యాప్ లపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ వేర్ ఉందని, ఫెక్ లింక్స్ తో వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు తెలుసుకునే అవకాశం ఉన్న క్రమంలో గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసే వరిపైనా ఉపేక్షించేది లేదని ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి,మీ చుట్టూ ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 కు కాల్ చేసి సమాచారాన్ని అందించాలన్నారు.యువత,విద్యార్థులు తక్కువ సమయంలో అధిక డబ్బు సంపాదించాలనే ఆలోచనలతో ఈ బెట్టింగ్ యాప్ లలో పాల్గొని తీవ్రంగా నష్టపోయి,అప్పులపాలై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు.

ఒక్కొక్కసారి ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆన్లైన్ బెట్టింగ్ ఆన్లైన్ గేమ్స్ వలన కలిగే పరిణామాల గురించి ప్రజలకు పట్టణ సీఐ గోపీనాథ్ క్షుణ్ణంగా వివరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దొంతి మాధవ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నర్సంపేట

ఎస్ సి వర్గీకరణ పై ఆమోదం తెలిపిన తెలంగాణ శాసనసభ, నేడు బి సి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాశనసభలో బిల్లు పెట్టి ఆమోదించడంపై సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సంపేట శాశానసభ్యులు దొంతి మాదవ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నెక్కొండ అంబేద్కర్ సెంటర్లో పాలాబీషేకం చేశారు.ఈ సందర్భంగా మండల,పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ,గత దశాబ్దాల కాలంగా బీసీలను పట్టించుకోని ప్రభుత్వాలు ఏ ఐ సి సి అగ్రనేత రాహుల్ గాంధీ అక్టోబర్ భారత్ జూడో యాత్రలో భాగంగా బీసీ కులగణన చేసి వెనుకబడిన వర్గాల వారికి 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని సూచించారని,మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావాగానే బీసీ కులగన నిర్వహించి ఈ రోజు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కూడా పార్లమెంట్ లో ఆమోదం తెలిపే విధంగా తెలంగాణ బీజేపీ ఎంపీలందరూ పోరాటం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్,నెక్కొండ మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి భాను ప్రకాష్,మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లి సుబ్బారెడ్డి,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముద్దరబోయిన శ్రీకాంత్,కొత్తపెల్లి రత్నం, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు మాదటి శ్రీనివాస్,మైనార్టీ నాయకులు మహ్మద్ అన్వర్, మహ్మద్ షబ్బీర్, వనం యాకంతం,దూదిమెట్ల కొమురయ్య, కిసాన్ సేల్ మండల అధ్యక్షులు,గై లక్ష్మణ్, రామారాపు రాము,గణేష్,ఉసిల్లపాటి రాజు, బోడ ప్రవీణ్ కుమార్,సురేష్,మహ్మద్ అఫ్జల్,కొమ్ము దయాకర్,కొమ్ము కార్తిక్, బొల్ల శివకుమార్,ఎం డి మధర్,ఇడెంపాక అన్వేష్,ఉప్పల లక్ష్మన్,శ్రీనివాస్, ఉడుగుల అశోక్,మచ్చ వీరన్న, మోటం కిట్టు, కొత్తకొండ గణేష్, నేతుల సారంగం, మహ్మద్ పాషా, సంపత్,రమేష్,కకర్ల దర్గయ్య గౌడ్, తల్లపెల్లి చెన్న కేశవులు గౌడ్, దుడిమెట్ల రాజు, వంగల బాబు,రావుల రాజు గౌడ్,శరత్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కరకగూడెంలో... సిండికేట్ దందా..!

## -ఎక్సైజ్ రూల్స్ బ్రేక్..

## -సొంత రూల్స్ అమలు చేస్తున్న మద్యం" వైన్ షాపు" వ్యాపారులు..

## -పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులు..

## - లైట్ తీసుకుంటున్న ఎక్సైజ్ అధికారులు





కరకగూడెం, మార్చి 19 (భారతశక్తి): మండలంలో మద్యం దందా మూడు పువ్వులు..ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. సిండికేట్ గా ఏర్పడిన మద్యం షాపుల నిర్వాహకులు ఎక్సైజ్ శాఖ నిబంధనలను పక్కనబెట్టి సొంత రూల్స్ అమలు చేస్తున్నారు. బ్రాండెడ్ మద్యాన్ని బెల్ట్ షాపులకు సరఫరా చేస్తూ మద్యం ప్రియులకు మొండి చేయి చుపిస్తున్నారు. మండలంలో బ్రాండెడ్ మద్యం కావాలంటే బెల్టు షాపులకు వెళ్ళాల్సిందే. ఎందుకంటే వైన్ షాపుల్లో బ్రాండుల మద్యం దొరకదు ఒకవేళ దొరికిన ఎక్కువ సేపు విక్రయించారు. మద్యం సిండికేట్ గాళ్ళు బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ వారికే అన్ని రకాల బ్రాండుల మద్యాన్ని అమ్ము కుంటూ మద్యం ప్రియుల జేబులను గుల్ల చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ వైన్ షాప్లో దొరికే మద్యమే తాగుదామంటే కనీసం ఎమ్మార్పీ ధరకు కూడా అమ్మకుండా అధిక రేట్లను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. బెల్ట్ షాపుల్లో ఒక క్వార్టర్కు సుమారు రూ.50 నుంచి రూ. 70లు అధిక ధర వసూలు చేస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారని పలువురు మద్యం ప్రియులు వాపోతున్నారు. వైన్ షాపుల యాజమాన్యాలు సిండికేట్ అవ్వడం వల్లనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మద్యం ప్రియులు తాము కష్టపడి సంపాదించిందంతా బెల్ట్ షాపులకి ధారబోయాల్సి వస్తుందంటున్నారు. ఈ కారణంగా వారి కుటుంబాలలో గొడవలు సైతం చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

:: పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు.!

తెలంగాణలో ఏర్పడిన ప్రభుత్వం బెల్టు షాపులు ఎత్తివేయాలని యోచిస్తుండగా కరకగూడెం మండలంలో మాత్రం విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ దోపిడీని నియంత్రించవలసిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుండి ఫిర్యాదులు వెళ్లినా ఆ ఫిర్యాదులను బుట్ట దాఖలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో బట్టుపల్లి లో బడి, కరకగూడెంలో గుడి తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్నా ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బట్టుపల్లి పగలు, రాత్రి తేడా లేకుండా బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు జరుపుతుండడంతో మందుబాబులు కిక్కు ఎక్కువ అయ్యి గొడవలకు దిగుతున్నారని ఈ వ్యవహారం తమకు ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి కరకగూడెం మండలంలోని సిండికేట్ దందాను అరికట్టవలసిందిగా స్థానికులు ఈ సందర్భంగా కోరుతున్నారు.

:: ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షులు పోలెబోయిన వెంకటనారాయణ::

విచ్చల విడిగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్న అబ్కారీశాఖ అధికారులు పట్టించుకో వడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లిప్తతతో మద్యం కల్తీ కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బెల్టు షాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలు న్నాయి. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల భారిన పడే ప్రమాదం ఉంది. అయినా సరే అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

# నిర్మల్ జిల్లా తానూర్ మండలంలో ప్రభుత్వ ఉద్యోగిపై దాడి %-% ప్రజల తీవ్ర ఆగ్రహం









భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 19 : నిర్మల్ జిల్లా తానూర్ మండల బోర్గావ్ గ్రామంలోలో ఓ ప్రభుత్వ ఉద్యోగిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. బాధితుడు మొహమ్మద్ వకీల్, తానూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్నారు. తన విధులను నిర్వర్తిస్తున్న సమయంలో అతను ఈ దాడికి గురయ్యారు.మొహమ్మద్ వకీల్ భైంసా ఆర్డీవో కార్యాలయం నుండి కొన్ని ప్రభుత్వ పత్రాలు, (పసుపు రంగు వస్త్రంలో కట్టబడి ఉన్నవి) తీసుకొని తానూర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తుండగా, బోర్గావ్ గ్రామం వద్ద కొంతమంది దుండగులు అతని వెంబడించారు.మొదట అతనిపై అపశబ్దాలు ప్రయోగించి, అనంతరం శారీరకంగా దాడి చేశారు.అదే సమయంలో, భైంసాకు చెందిన ఇద్దరు జర్నలిస్ట్ అక్కడి నుంచి తానుర్ వెళ్తుండగా ఈ ఘటనను గమనించారు. వెంటనే ఆయన తన వాహనాన్ని ఆపి మొహమ్మద్ వకీల్ను రక్షించి, తానూర్ పోలీస్ మరియు భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న తానూర్ పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని, తీవ్రంగా గాయపడ్డ మొహమ్మద్ వకీల్ను భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆయన బాధితుడి కుటుంబసభ్యులకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇదిలా ఉండగా, మొహమ్మద్ వకీల్ ఉపవాస (రోజా)లో ఉండడం తెలిసిన వెంటనే, భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి భారీ సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి శర్మిల, భైంసా అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ మరియు నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆభిలాషా ఆభినవ్ లను దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటన పై ప్రస్తుతం తానూర్ పోలీసులు నలుగురు దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఈ ఘటన పై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్పడ్డ నిందితులను రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధుల నిర్వహణలో ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం రాత్రికి ఒక ప్రకటనలో తెలిపారు. తానూరు మండలం బోరిగామ గ్రామంలో రెవెన్యూ ఉద్యోగిపై దాడి ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఘటనకు సంబంధించిసమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పోలీసు అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

# నిర్మల్ పోలీస్.. మీ పోలీస్..

## -పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 19: నిర్మల్ జిల్లా పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుండి ఏప్రియల్ 4 వరకు సెక్షన్ 163 %దీమీూ% యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల,ఐపీఎస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9129 విద్యార్థు లకు 47 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగాపరీక్షా కేంద్రాల వద్ద ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మునివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సెక్షన్ 163 %దీమీూ% అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# జిల్లా కేంద్రంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 19: నిర్మల్ పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) లో మున్సిపల్ అధికారులు బుధవారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ప్రజలకు కలెక్టర్ మంచినీటిని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో బస్టాండ్, ప్రధాన కూడళ్ళు, మార్కెట్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలంతా చలివేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, అర్బన్ తహసిల్దార్ రాజు, మున్సిపల్ డిఈ హరిభువన్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి. ఎన్. ఎస్. ఎస్ అమలు: పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ బ్యూరో(భారత శక్తి)మార్చి19:వరంగల్ పోలీస్ కమిషనరెట్ పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుండి ఏప్రియల్ 4 వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, మునివేయాలని సూచించారు.

పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ గారు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని సీపీ తెలిపారు.

# సింగరేణి ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ డే విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి : పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్

మందమర్రి టౌన్, మార్చి 19 (భారత శక్తి):సింగరేణి ఉన్నత పాఠశాలలో 2024 25 సంవత్సరానికి 10వ తరగతి పూర్తి చేసి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ ఏర్పాటు చేసిన ఫేర్వెల్ డే పార్టీ వేడుకలు ఆనందోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో సీనియర్ విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ కు విద్యార్థులు పుష్పగుచ్చం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో భాగంగా పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పెన్నులు హాల్ టికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులకు గౌరవాన్ని అందిసన్తూ చదువు పూర్తి చేసుకుని పాఠశాలను వదిలి వెళుతున్న వారి కోసం ఏర్పాట్లు అభినందనీయమని కొనియాడారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల శిక్షణలో విద్యను అభ్యసించిన అందరూ పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశాభవం వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడులకు లోను కాకుండా చదువు పైనే దృష్టి పెట్టి ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. సింగరేణి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం సింగరేణి యాజమాన్యం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలతో పాటు ఉచితంగా పుస్తకాలు యూనిఫాం పంపిణీ చేస్తూ మధ్యాహ్న భోజనం కూడా కల్పిస్తుందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.




# హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

నర్సంపేట మార్చి 19

వ్యవసాయ మార్కెట్లో పని చేసే హమాలి కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని అఖిల భారత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ కు బుధవారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ (న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోడం మల్లేశం మాట్లాడుతూ, నర్సంపేట వ్యవసాయ మార్కెట్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు, గత కొన్ని సంవత్సరముల క్రితం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వము, గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.అప్పటి నుండి నేటి వరకు అదే హమాలీ కార్మికులకు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయటం జరుగుచున్నదని,నూతనంగ సభ్యత్వం, గుర్తింపు కార్డులు ఇవ్వలేదన్నారు.వివిధ ముఠాలలో పనిచేస్తున్న హమాలీ కార్మికులు కొందరు 60 సంవత్సరములకు పైబడి వయస్సు మళ్ళీ నందున వారు హమాలీ పనులు చేయలేక హమాలీ పనిని మానుకోవటం, కొంతమంది కార్మికులు అనారోగ్యములతో మరణించటం, కొందరు హమాలీ పనుల నుండి వెళ్లిపోయి వేరే పనులు చేసుకోవడం జరుగుచున్నారు. వెళ్లిపోయిన కార్మికుల స్థానములలో ముఠామేస్త్రిలు కొత్త సభ్యులను చేర్చుకొని మార్కెట్లో జరుగుతున్న ఎగుమతులు దిగుమతుల పనులను వెళ్లదీయటం జరుగుచున్నదన్నారు.కార్డులు లేకుండ పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నుండి రావలసిన బట్టలు, తదితర రాయితీలు పొంద లేకపోతున్నారని అన్నాడు. ఏదైనా ప్రమాదములు జరిగిన ఎలాంటి సహకారములు వ్యవసాయ మార్కెట్ నుండి అందడం లేదన్నాడు.వెంటనే మార్కెట్ చైర్మన్,మార్కెట్ కమిటీ కార్యదర్శి స్పందించి నర్సంపేట వ్యవసాయ మార్కెట్లో పనిచేయుచున్న హమాలీ కార్మికులకు,కూలీ కార్మికులకు సభ్యత్వము ఇచ్చి గుర్తింపు కార్డు అందజేయాలని డిమాండ్ చేశాడు.ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షులు మంద మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మెరుగు జనార్ధన్, కోశాధికారి బొల్లెన రమేష్, సంఘం నాయకులు ఇప్ప బాబు, ఎద్దు రాములు, రమేషు, రవీందర్, కుమారస్వామి, రాజు, వెంకన్న, సతీష్, వీరన్న, రాజాలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఐపీఎల్‌లో ఆసక్తికరం ఆ రేసు.. ప్లేఆఫ్స్‌కా బాప్ ఎవరు..?

: క్రికెట్ అభిమానులకు అసలైన మజా అందించేది ఐపీఎల్ ( సమరమే. పది జట్లు హెూరాహెూరీగా తలపడే ఈ మెగా టోర్నీలో ప్లేఆఫ్స్ రేసు ఎప్పుడూ ఆసక్తికరమే. ప్రతి మ్యాచ్ ఫలితం.. నెట్ రన్‌రేట్ కీలకంగా నిలిచే ఈ టాప్ 4 రేసులోకి రావడం ఒకెత్తయితే.. ఆ తర్వాత ముందుకుసాగి టైటిల్ గెలవడం మరో ఎత్తు. మరి ఇప్పటి వరకూ ఐపీఎల్ చరిత్రలో ఈ ఆసక్తికర రేసులోకి ఎక్కువసార్లు వచ్చిన జట్లేంటి.. అవి ఎలాంటి ఫలితాలు సాధించాయి..?

ప్లేఆఫ్స్ ఛాంపియన్ చెన్నై..

ఐపీఎల్ చరిత్రలో ఎక్కువసార్లు ప్లేఆఫ్స్ ఆడింది చెన్నై అద్భుత ప్రదర్శనతో 12 సార్లు ఈ రేసులోకి వచ్చింది. ఇందులో 5 సార్లు టైటిల్ గెలిచి.. ఎక్కువసార్లు ట్రోఫీ గెలిచిన ముంబయితో సమానంగా నిలిచింది. నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచి సత్తా చాటింది. గతంలో ధోనీ సారథ్యంలో.. ఇప్పుడు రుత్‌రాజ్ నాయకత్వంలో ఆ జట్టు ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ముంబయిఏటాప్ 4

టాప్ 4 రేసులోకి ముంబయి ఇప్పటివరకూ పది సార్లు వచ్చింది. అందులో 5 సార్లు విజేతగా నిలిచింది. అయితే.. గత కొన్ని సీజన్లుగా ఆ జట్టు పేలవ ప్రదర్శనతో అభిమానులను నిరాశపరుస్తోంది. గత సీజన్లో రోహిత్ శర్మను కాదని హార్దిక్ పాండ్యకు జట్టు పగ్గాలు అప్పగించడం.. ఆటగాళ్ల మధ్య సఖ్యత లోపించడం లాంటి సమస్యలను ఎదుర్కొంది. ఈసారి ఎలా రాణిస్తుందో చూడాలి. 2020లో చివరిసారిగా టైటిల్ గెలిచిన ఆ జట్టు.. ఆ తర్వాత 2023లో మాత్రమే ప్లేఆఫ్స్ వరకూ రాగలిగింది.

ఇంకా టైటిల్ వేటలోనే.. ఆర్సీబీ

ప్లేఆఫ్స్ రేసులోకి అత్యధికసార్లు వచ్చిన మూడో జట్టు ఆర్సీబీ 9 సార్లు టాప్4లోకి వచ్చినప్పటికీ.. ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయింది. జట్టు నిండా స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ.. కీలకమైన ప్లేఆఫ్స్‌లో ఆ జట్టు చేతులెత్తేస్తోంది. ఇప్పటివరకూ మూడుసార్లు ఫైనల్ వరకూ వచ్చినా.. ఒక్కసారి కూడా కప్ ముద్దాడలేకపోయింది. మరి ఈసారి యువ ఆటగాడు రజత్ పటీదార్ నేతృత్వంలో అయినా ఆ జట్టు తన కలను నెరవేర్చుకుంటుందో, లేదో చూడాలి.

ప్లేఆఫ్స్ రైజింగ్ జట్టు..

2016-2020 మధ్యలో వరుసగా ఐదుసార్లు ప్లేఆఫ్స్ రేసులోకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచిన సన్‌రైజర్స్ 2016లో టైటిల్ నెగ్గింది. ఆ తర్వాత పేలవ ప్రదర్శనతో నిరాశపరిచింది. అయితే.. జట్టు రూపురేఖలను మార్చుకొని పాట్ కమిన్స్ సారథ్యంలో నూతన ఉత్సాహంతో బరిలోకి దిగిన సన్ రైజర్స్ గత సీజన్‌లో అదిరే ప్రదర్శన చేసింది. చివరి మెట్టుపై బోల్తా పడినప్పటికీ.. ట్రావిస్ హెడ్, క్లాసెన్ లాంటి భారీ హిట్టర్లతో ఉన్న ఆ జట్టు ప్రత్యర్థులకు ఎంతో ప్రమాదకరం. ఇప్పటివరకూ రెండుసార్లు టైటిల్ నెగ్గిన ఈ జట్టు 9 సార్లు ప్లేఆఫ్స్ రేసులోకి వచ్చింది. గత సీజన్‌లో మిస్ అయిన టైటిల్‌ను ఈసారి కమిన్స్ అందిస్తాడా చూడాలి.

కోల్‌కతా అనూహ్యం..

గత సీజన్‌లో అనూహ్యంగా పుంజుకొని టైటిల్ సాధించిన కోల్‌కతా ఇప్పటివరకూ 8 సార్లు ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల్లో ఆడింది. మూడుసార్లు టైటిల్ నెగ్గి.. ముంబయి, చెన్నై తర్వాత ఎక్కువసార్లు ట్రోఫీ నెగ్గిన జట్టుగా నిలిచింది. మరి ఈసారి సీనియర్ ఆటగాడు రహానెను కెప్టెన్‌గా ఎంచుకున్న ఆ జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

దిల్లీ.. ఆరుసార్లు

ఒక్కసారి కూడా టైటిల్ గెలవని జట్లలో ఒకటి దిల్లీ ఇప్పటివరకూ 6 సార్లు టాప్ 4లోకి వచ్చింది. ఒక్కసారి మాత్రమే అత్యుత్తమ ప్రదర్శనతో ఫైనల్ వరకూ చేరుకొని రన్నరప్‌గా నిలిచింది. 2020లో మంబయిపై ఓడి టైటిల్‌ను చేజార్చుకుంది. మరి అక్షర్‌పటేల్ నేతృత్వంలో ఈసారైనా ప్లేఆఫ్స్‌నకు చేరి టైటిల్ గెలవాలని ఆ జట్టు అభిమానులు కోరుకుంటున్నారు.

తొలి టైటిల్ గెలిచినా..

ఐపీఎల్ తొలి టైటిల్ గెలిచిన జట్టుగా చరిత్రలో నిలిచిన రాజస్థాన్ రాయల్స్ ఆ తర్వాత ఒక్కసారి కూడా కప్‌ను ముద్దాడలేకపోయింది. ఇప్పటివరకూ ఐదుసార్లు ప్లేఆఫ్స్ రేసులోకి వచ్చింది. గత సీజన్‌లో టాప్ 4 వరకూ చేరినా నిరాశపరిచింది.

ఆడిన తొలి సీజన్‌లోనే..

ఇక గుజరాత్ టైటాన్స్ ఆడిన తొలి సీజన్ (2022)లోనే టైటిల్ నెగ్గి చరిత్ర సృష్టించింది. ఆతర్వాత సీజన్‌లో ఫైనల్ వరకూ వచ్చినా.. చెన్నై చేతిలో ఓటమి పాలైంది.

ఇక లఖ్‌నవూ, పంజాబ్ రెండుసార్లు ప్లేఆఫ్స్ వరకూ చేరినా.. కప్ సాధించలేకపోయాయి. మరి ఈసారి ఏయే జట్లు ప్లేఆఫ్స్ వరకూ వస్తాయో.. ఈ రేసులో తుదివరకూ నిలిచి ఏ జట్టు టైటిల్ నెగ్గుతుందో చూడాలి.

# 2025: ఐపీఎల్ 2025.. కోట్లు కుమ్మరించారు.. మరి పరుగులు రాబడతారా?

%ఐపీఎల్ ( మొదలైన ప్రతిసారీ భారీ రేటుతో కొన్న ఆటగాళ్లు ఎలా ఆడతారో అని అభిమానులు ఎదురు చూస్తుంటారు. కానీ అత్యధిక ధర పలికిన ప్లేయర్లు దాదాపు ప్రతిసారీ విఫలం అవుతుంటారు. ఒత్తిడికి లోనై అంచనాలు అందుకోలేక కనీస ప్రదర్శన కూడా చేయలేక ఘోరంగా ఫెయిల్ అయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈసారి ఐపీఎల్ మెగా వేలంలోనూ కొంతమంది క్రికెటర్లకు అనూహ్య ధర పలికింది. కొన్ని ఫ్రాంఛైజీలు ఏరికోరి మరీ కోట్లు పెట్టి కొందరిని దక్కించుకున్నాయి. మరి వాళ్లు సత్తా చాటుతారా.. ఫ్రాంఛైజీలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటారా?




ఐపీఎల్ సీజన్-18లో అత్యధిక ధర పలికిన ప్లేయర్లలో రిషబ్ పంత్ ముందు వరుసలో ఉంటాడు. లఖ్‌నవూ జట్టు ఏకంగా రూ.27 కోట్లు పెట్టి ఈ స్టార్‌ని సొంతం చేసుకుంది. ఘోర రోడ్డు ప్రమాదం తర్వాత గతేడాది పునరాగమనం చేసిన పంత్... దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడాడు. కానీ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అంతర్జాతీయ స్థాయిలోనూ అతడు పెద్ద మెరుపులు మెరిపించలేకపోయాడు. పైగా గాయాల సమస్యలతో కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇలాంటి పరిస్థితి ఉన్నా కూడా పంత్‌పై ఎల్ఎస్‌జీ నమ్మకం ఉంచింది. కేఎల్ రాహుల్ ( దిల్లీకి వెళ్లడంతో పంత్‌ను కెప్టెన్‌గా ఎంచుకుంది.

మరి అటు బ్యాటర్, ఇటు కీపర్.. మరోవైపు కెప్టెన్‌గా పంత్ మూడు పాత్రలకు ఎలాంటి న్యాయం చేస్తాడనేది ఆసక్తికరం. మరోవైపు శ్రేయస్ అయ్యర్ ది ఇంకో కథ. గతేడాది కోల్‌కతా జట్టును విజేతగా నిలిపిన శ్రేయస్‌ను ఆ జట్టు వేలంలో వదులుకుని ఆశ్చర్యపరిచింది. దీంతో అతడి కోసం తీవ్రంగా పోటీపడిన పంజాబ్ కింగ్స్ ఏకంగా రూ.26.75 కోట్లు పెట్టి దక్కించుకుంది. తాజా ఛాంపియన్స్ ట్రోఫీతో తిరిగి ఫామ్‌లోకి వచ్చిన శ్రేయస్.. పంజాబ్‌ను ఎలా నడిపిస్తాడో చూడాలి. ఇప్పటిదాకా టైటిల్ ముఖం ఎరుగని పంజాబ్ శ్రేయస్ రాకతో అదృష్టం మారుతుందని భావిస్తోంది.

అతడికి అంతా?

ఈసారి ఐపీఎల్‌లో ఓ ప్లేయర్‌కి దక్కిన మొత్తం చూసి అభిమానులతో పాటు విశ్లేషకులు కూడా ఆశ్చర్యపడ్డారు. అతడే వెంకటేశ్ అయ్యర్. మరి అద్భుతమైన ఆటగాడేం కాదు. గత కొన్ని సీజన్లలో అదిరే ప్రదర్శనలు కూడా చేయలేదు. కానీ వెంకటేశ్ అయ్యర్‌ను ఏకంగా రూ.23.75 కోట్లతో కోల్‌కతాఅట్టి పెట్టుకుంది. ఇంత మొత్తం పెట్టారు కాబట్టి కచ్చితంగా సారథ్యం కూడా ఇస్తారు అనుకుంటే అజింక్య రహానె ను కెప్టెన్ చేసింది కేకేఆర్. వెంకటేశ్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించింది. మరి ఇంతటి అంచనాలు నిలబెట్టుకుంటాడా అనేది అనుమానమే.

మరోవైపు విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా రూ.23 కోట్లు పెట్టింది. క్లాసెన్ చెలరేగితే మ్యాచ్ ఫలితాలను తారుమారు చేయగలడన్న ఉద్దేశంతోనే ఎస్ఆర్‌హెచ్ ఇంత మొత్తాన్ని ఈ సఫారీ బ్యాటర్‌పై వెచ్చించింది. గత సీజన్లో అతడు ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్‌లు కూడా క్లాసెన్‌కు ఇంత ధర పలకడానికి కారణం. అయితే ఈసారి ఒత్తిడికి గురి కాకుండా సహజశైలిలో చెలరేగుతాడో లేదో చూడాలి.

ఇక ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ను రూ.16.50 కోట్లకు కొన్న దిల్లీ అతడిపై పెద్ద నమ్మకమే పెట్టుకుంది. ఈ ఆల్‌రౌండర్‌కు కెప్టెన్సీ పగ్గాలు కూడా అప్పగించింది. భారీ ధర దక్కించుకున్న యశస్వి జైస్వాల్ (రూ.18 కోట్లు, రాజస్థాన్ రాయల్స్), రుతురాజ్ గైక్వాడ్ (రూ.18 కోట్లు, చెన్నై సూపర్‌కింగ్స్), చాహల్ (పంజాబ్, రూ.18 కోట్లు), అర్ష్‌దీప్ (పంజాబ్, 18 కోట్లు), ఆర్చర్ (రాజస్థాన్, రూ.12.5 కోట్లు) కూడా సత్తా చాటగలరా అనేది ఆసక్తికరం.



# అది నన్ను ఆశ్చర్యపర్చలేదు.. అతడి నిబద్ధతకు నిదర్శనం: ద్రవిడ్‌పై బ్యాటింగ్ కోచ్ ప్రశంసలు

రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ () ఊతకర్రల సహాయంతో ట్రైనింగ్ క్యాంపులకు హాజరవడంపై ఆ జట్టు బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ స్పందించాడు. ఈ విషయం తనను ఆశ్చర్యానికి గురి చేయలేదని.. జట్టు పట్ల అతడి నిబద్ధతకు ఇది నిదర్శనమని కొనియాడాడు. త్వరలో ప్రారంభం కానున్న ఐపీఎల్ కోసం జట్టును సిద్ధం చేయడంలో ద్రవిడ్ పూర్తిస్థాయి కోచింగ్ బాధ్యతల్లో నిమగ్నమయ్యాడని పేర్కొన్నాడు.

"రాహుల్ సర్ ఎప్పుడూ ఎంతో ఉత్సాహంగా ఉంటాడు. అతడు ఆడే రోజుల్లో కూడా ఇలాగే ఉండేవాడు. చేసే ప్రతిపనిని అంకితభావంతో చేస్తాడు. కాలికి గాయం అయినా లెక్కచేయక.. ఆటగాళ్లతో కలిసిపోతున్నాడు. ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడుతున్నాడు. వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నాడు. పూర్తిస్థాయిలో కోచ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు" అని విక్రమ్ రాథోడ్ ప్రశంసించాడు.

ఇటీవల బెంగళూరులో విజయ సీసీ తరఫున జయాంగర్ క్రికెటర్స్ జట్టుతో క్లబ్ మ్యాచ్ ఆడుతుండగా ద్రవిడ్ ఎడమ కాలి పిక్క కండరానికి గాయమైంది. ఈ మ్యాచ్‌లో అతడు తన తనయుడు అన్వయ్‌తో కలిసి ఆడాడు. ప్రస్తుతం కోలుకుంటున్నాడు. ఊతకర్రల సాయంతోనే రాజస్థాన్ ట్రైనింగ్ క్యాంప్‌నకు హాజరవుతున్నాడు.




# ఐపీఎల్ 2025 ప్రారంభ వేడుకకు.. బాలీవుడ్ స్టార్లు

៝: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ మార్చి 22న ప్రారంభం కానుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభోత్సవ వేడుక జరగనుంది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్ తారలు ( మెరవనున్నట్లు సమాచారం. బాలీవుడ్ నుంచి షారుఖ్ ఖాన్, సల్మాన్, విక్కీ కౌశల్, సంజయ్ దత్ వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అరిజిత్ సింగ్, శ్రేయా ఘోషల్ సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. శ్రద్ధా కపూర్, వరుణ్ ధావన్, దిశా పటానీ స్పెషల్ డ్యాన్స్ షో జరగనుంది. అంతేకాకుండా, పంజాబ్ స్టార్ ర్యాపర్ కరణ్ ఔజ్లా ప్రత్యేక షో చేయనున్నారు. అమెరికన్ పాప్ బ్యాండ్ వన్ రిపబ్లిక్ ప్రదర్శన కోసం ఆ బృందాన్ని సంప్రదించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కాగా.. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ అలరించనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజుల పాటు జరుగుతాయి. తొలి మ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభం కానుంది. మార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్ - రాజస్థాన్ జట్ల మధ్య పోరు ఉండనుంది. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి రెండు మ్యాచ్‌లను కేటాయిస్తూ ఐపీఎల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మార్చి 24న దిల్లీ - లఖ్‌నవూ, మార్చి 30న దిల్లీ- హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

# అదొక్కటి చేయండి..: ముంబయి ఫ్యాన్స్‌కు హార్దిక్ పాండ్య స్పెషల్ రిక్వెస్ట్

గతేడాది ఐపీఎల్ సందర్భంగా ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య )పై తీవ్రస్థాయిలో హేళనలు వచ్చాయి. రోహిత్‌ను తప్పించి పాండ్యకు ముంబయి జట్టు పగ్గాలు అందించడంతో విమర్శలూ వినిపించాయి. టాస్ వేసేందుకు వెళ్లిన ప్రతి మ్యాచ్ సమయంలో ప్రేక్షకులు అరుస్తూ పాండ్యను ఎగతాళి చేసినట్లు ప్రవర్తించారు. ఆ తర్వాత జరిగిన టీ20 ప్రపంచకప్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. దీంతో అతడిపై విమర్శలు చేసినవారే ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పుడు ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ ముంబయి కెప్టెన్‌గా హార్దిక్ కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ముంబయి ఫ్యాన్స్‌కు హార్దిక్ స్పెషల్ రిక్వెస్ట్ చేశాడు.

''నేను జట్టులో ముఖ్యపాత్ర పోషించాలని అభిమానులు కోరుకోవడంలో తప్పులేదు. వారితో నేను అంగీకరిస్తున్నా. అయితే, నేను ఎప్పుడు బ్యాటింగ్ చేసినా ఉత్సాహపరచండి. సిక్స్ కొట్టినా.. టాస్‌కు వెళ్లినా అలానే చేయండి. ఇక్కడ నేను ఇతర రంగులను చూడటం లేదు. వాంఖడే స్టేడియంలో మన కలర్‌ను మాత్రమే చూస్తా. మీ నుంచి నేను ఆశించేది అదే. గత ఐపీఎల్ తర్వాత నుంచి ప్రయాణం చాలా అద్భుతంగా జరిగింది. కష్టాలు ఎదురైనప్పటికీ ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. నేనెప్పుడూ జట్టుకు ముఖ్యమైన ప్లేయర్‌గానే భావిస్తా. నా ఆల్‌రౌండ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తే అది జట్టుకే ప్రయోజనమని నిరంతరం ఆలోచిస్తా.




# అమెజాన్‌లో పొదుపు చర్యలు.. 14వేల ఉద్యోగాల కోతకు రెడీ

: ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా మేనేజింగ్ విభాగంలోని 14 వేల మందిని తొలగించబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెజాన్ శ్రామికశక్తిలో ఈ సంఖ్య 13 శాతంతో సమానం. ఈ కొలువులు తొలగింపు వల్ల సంస్థకు ఏడాదికి రూ.210 కోట్ల నుంచి రూ.360 కోట్లు ఆదా అవుతుందని అంచనా. ఈ తొలగింపులు చేపడితే ఇ-కామర్స్ సంస్థలో మేనేజర్ల సంఖ్య 1.05 లక్షల నుంచి 91వేలకు తగ్గనుందని 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' తెలిపింది.

కంపెనీ పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఇటీవల కమ్యూనికేషన్, సస్టైయినబిలిటీ విభాగాల్లో ఉద్యోగాలను అమెజాన్ తొలగించింది. ఇప్పుడు మేనేజింగ్ విభాగంపై దృష్టిసారించింది. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచే అమెజాన్ ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. ఇందులోభాగంగా మేనేజర్లకు వచ్చే డైరెక్ట్ రిపోర్టుల సంఖ్యను పెంచింది. అలాగే, సీనియర్ లెవల్‌లో ఉద్యోగాల నియామకాన్ని కూడా పరిమితం చేసింది. పరిహారానికి సంబంధించిన విధివిధానాలను పునఃసమీక్షించుకోవడం వంటి చర్యలు చేపట్టింది. తాజాగా ఉద్యోగాల తొలగింపును చేపట్టేందుకు సిద్ధమవుతోంది.

నిర్వహణ సామర్థ్యాలు, లాభదాయకతను పెంచుకోవడంపై గత కొన్నాళ్లుగా అమెజాన్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది జనవరి నుంచి వారానికి ఐదు రోజుల పాటు ఆఫీసుకు రావాలని ఉద్యోగులకు కంపెనీ సీఈఓ ఆండీ జాస్సీ పేర్కొన్నారు. అప్పుడే వేగంగా నేర్చుకోవడంతో పాటు తోటివారితో మెరుగైన సంబంధాలు కలిగిఉండడానికి కారణమవుతుందన్నారు. కొవిడ్ సమయంలో అమెజాన్ ఉద్యోగుల సంఖ్యను భారీగా పెంచుకుంది. దీంతో 2019 నాటికి 7.98 లక్షలుగా ఉన్న సంఖ్య 2021 నాటికి 16 లక్షలకు పెరిగింది. ఆపై ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా 2022, 2023లో వివిధ సందర్భాల్లో 27 వేల మందిని తొలగించింది.

# వాడని క్రెడిట్ కార్డ్ క్లోజ్ చేస్తున్నారా? ఈ విషయాలు తెలుసుకున్నాకే

గృహోపకరణాలు కొనుగోలు చేయాలన్నా, ఆసుపత్రి బిల్ చెల్లించాలన్నా, ఆఖరికి షాపింగ్ చేయాలన్నా వెంటనే గుర్తుకొచ్చేది క్రెడిట్ కార్డ్. డిజిటల్ యుగంలో ఇలా ఏది కొనాలన్నా దాదాపు అందరూ క్రెడిట్ కార్డునే వినియోగిస్తున్నారు. లాంజ్ యాక్సెస్, ఫ్యూయల్, షాపింగ్.. ఇలా ఒక్కోదానికి ఒక్కో క్రెడిట్‌కార్డు తీసుకోవడంతో కార్డుల సంఖ్య పెరిగిపోతూ ఉంటుంది. తీరా ఖర్చులు పెరిగిపోతున్నాయనే కారణంతో పెద్దగా వాడుకలో లేని క్రెడిట్ కార్డ్‌లు తీసేయాలనుకుంటారు చాలామంది. ఒకవేళ మీరు కూడా ఇలానే వినియోగించని కార్డ్‌ని తీసేయాలనుకుంటున్నారా? అయితే ఈ విషయాల్ని గుర్తుంచుకోండి.




ప్రతికూలతలు

క్రెడిట్ కార్డ్‌ని తీసేయడం వల్ల క్రెడిట్ హిస్టరీ దెబ్బతింటుంది. ముఖ్యంగా బాగా పాత కార్డు క్లోజ్ చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం చూపుతుంది. ఒకవేళ మీ పాత క్రెడిట్ కార్డ్ హిస్టరీ మెరుగ్గా ఉంటే రుణ మంజూరు సులభం అవుతుంది. మంచి హిస్టరీ ఉన్న క్రెడిట్ కార్డ్‌ని వినియోగించడం లేదన్న ఒకే కారణంతో తీసేస్తే.. క్రెడిట్ హిస్టరీపై ప్రభావం పడుతుందన్న విషయం గుర్తుంచుకోవాలి.

క్రెడిట్ కార్డు పరిమితిలో ఎంత శాతం క్రెడిట్‌ను వాడుకున్నామో తెలిపేదే క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో (%జఖ=%). క్రెడిట్ కార్డు వినియోగంలో దీని పాత్ర కీలకం. ఎల్లప్పుడూ ఈ రేషియో 30 శాతానికి మించకూడదని నిపుణులు చెబుతుంటారు. ఒకవేళ మీరు మీ క్రెడిట్ కార్డ్‌ని క్లోజ్ చేస్తే ఆ మేరకు మీ క్రెడిట్ లిమిట్ తగ్గిపోతుంది. సీయూఆర్ పరిమితి కూడా తగ్గుతుంది. కాబట్టి క్రెడిట్ కార్డుతో ఖర్చు చేసేటప్పుడు సీయూఆర్ మించకుండా చూసుకోవాలి.

అత్యవసర సమయాల్లో వాడిన క్రెడిట్ కార్డ్‌లు బ్యాకప్‌గా ఉపయోగపడతాయి. మీరు ఆదా చేసుకున్న సొమ్ముపై ఎలాంటి ప్రభావం పడకుండా ఉంటుంది. అంటే మీకో ఆర్థిక భద్రత ఉన్నట్లే! అందుకే కార్డుల్ని యాక్టివ్‌గా ఉంచడం ప్రయోజకరంగా ఉంటుంది.

అనుకూలతలు

క్రెడిట్ కార్డులు క్లోజ్ చేయడం వల్ల ప్రతికూలతలే కాదు.. కొన్ని అనుకూలతలూ ఉన్నాయి. క్రెడిట్ కార్డు ఉంది కదా అవసరం లేకపోయినా అతిగా ఖర్చు చేసేవారు అధిక వడ్డీ ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలా అనవసరమైన ఖర్చులతో ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి రావచ్చు. అలాంటి వ్యక్తులు కార్డుని తీసేయడమే ఉత్తమం.

కొన్ని సంస్థలు మీరు క్రెడిట్ కార్డు ఉపయోగించకపోయినా అధిక వార్షిక రుసుములు వసూలుచేస్తారు. దీని ప్రయోజనాల కంటే నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తుంటే అటువంటి క్రెడిట్ కార్డ్‌ని తీసేయడం ఉత్తమం.

ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉన్నప్పుడు.. ఉపయోగించని క్రెడిట్ కార్డులు మోసానికి గురయ్యే అవకాశం ఉంది. ఒకవేళ అన్ని కార్డుల్ని యాక్టివ్‌గా ఉంచాలని భావిస్తుంటే దాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించండి. అనధికార లావాదేవీలను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుంది. కనీసం ఏడాదికోసారైనా క్రెడిట్ స్కోరును తనిఖీ చేసుకోవాలి.

చివరగా: ఉపయోగించని క్రెడిట్ కార్డ్‌ని అలానే ఉంచాలా? రద్దు చేయాలా? అనేది ఫీజులు, ఆర్థిక లక్ష్యాలు, భవిష్యత్ అవసరాలపై ఆధారపడి ఉంటుంది. కార్డులు దీర్ఘకాల ప్రయోజనాలు అందిస్తే దాన్ని యాక్టివ్‌గా ఉంచడం మంచిది. ఖర్చుల్ని పెంచుతున్నాయనుకుంటే రద్దు చేయడమే బెటర్.




# చిన్న యూపీఐ లావాదేవీలకు ప్రోత్సాహకాలు.. కేబినెట్ ఆమోదం

దిల్లీ: చిన్న మొత్తంలో జరిపే యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1500 కోట్లు కేటాయించింది. తక్కువ విలువతో కూడిన యూపీఐ లావాదేవీలకు (వ్యక్తి నుంచి వ్యాపారికి) ఈ స్కీమ్ కింద ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఈ ప్రోత్సాహకాల కింద రూ.1500 కోట్లు చెల్లించేందుకు కేబినెట్ నిర్ణయించింది. దీనివల్ల చిన్న వ్యాపారులకు లబ్ధి చేకూరనుంది. యూపీఐ లావాదేవీలు అనుమతించినందుకు గానూ చిన్న వ్యాపారులు ఒక్కో లావాదేవీకి 0.15 శాతం చొప్పున ప్రోత్సాహం కింద అందుకుంటారు. ఆపై మొత్తాలపై ఎలాంటి ప్రోత్సాహకాలు లభించవు. ప్రస్తుతం యూపీఐ లావాదేవీలకు ఎండీఆర్ ఛార్జీలు వర్తించడం లేదు. వచ్చే ఏడాదీ ఈ స్కీమ్ కొనసాగుతుందని మంత్రి తెలిపారు.

ఇతర నిర్ణయాలు: యూపీఐతో పాటు రూ.10,601 కోట్లతో అస్సాంలో నూతన బ్రౌన్‌ఫీల్డ్ అమ్మోనియా యూరియా కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనివల్ల దిగుమతులపై ఆధారపడడం తగ్గుతుందని మంత్రి తెలిపారు. రూ.2,790 కోట్లతో దేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి పచ్చజెండా ఊపారు. నవీ ముంబయిలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ పోర్ట్‌ను జాతీయ రహదారితో 6 వరుసల రహదారి నిర్మాణానికి రూ.4500 కోట్లు కేటాయించినట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

# రియల్‌మీ నుంచి రెండు కొత్త మొబైల్స్.. ఫీచర్లు ఇవే

్క: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ మరో రెండు కొత్త మొబైల్స్ లాంచ్ చేసింది. ఆకర్షణీయమైన లుక్‌తో దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. రియల్‌మీ పీ3 5జీ( రియల్‌మీ పీ3 అల్ట్రా 5జీ ఎరిట వీటిని విడుదల చేసింది. 6,000%పొాష్ట్ర% బ్యాటరీ, 16 ఎంపీ సెల్ఫీ కెమెరాతో వీటిని తీసుకొచ్చారు. ఈ రెండు మొబైల్స్‌కి సంబంధించిన పూర్తి వివరాలు చూసేయండి.

రియల్‌మీ పీ3 5జీ ఫీచర్లు..

6.67 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లేతో వస్తోంది. 120%ఎఓ% రిఫ్రెష్ రేటు, 2,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగిఉంటుంది.

స్నాప్‌డ్రాగన్ 6జెన్4 5జీ ప్రాసెసర్ ఉపయోగించారు. ఆండ్రాయిడ్ 15 ఆధారిత రియల్‌మీ యూఐ 6.0తో పనిచేస్తుంది.

50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ కెమెరా, 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు.

6,000mAh బ్యాటరీ, 45 ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.

6జీబీ ం128జీబీ వేరియంట్ ధర రూ.16,999, 8జీబీ ం128జీబీ వేరియంట్ ధర రూ.17,999, 8జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.19,999.

గ్రే, పింక్, సిల్వర్ రంగుల్లో లభిస్తుంది. మార్చి 26 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈరోజు నుంచే ఎర్లీ బర్డ్ సేల్ ప్రారంభం.

# రూ.1,647 కోట్ల ఆర్డర్లను పొందిన ట్రాన్స్‌ట్రైల్ లైటింగ్

ట్రాన్స్‌రైల్ లైటింగ్ లిమిటెడ్(ట్రాన్స్‌ట్రైల్) ఈ రోజు(బుధవారం) విద్యుత్ సరఫరా, పంపిణీ, రైల్వే రంగాలలో రూ.1,647 కోట్ల విలువైన కొత్త ఆర్డర్‌లను పొందినట్లు ప్రకటించింది. ఈ కొత్త ఆర్డర్‌లలో విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు, సబ్‌స్టేషన్ల ఇంజనీరింగ్ పనులు, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణంతో కూడిన విదేశీ మార్కెట్లలోని ప్రధాన ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూష ప్రాజెక్టులకు లెటర్స్ ఆఫ్ అవార్డులు ఉన్నాయని కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ సంవత్సరం ఆర్డర్లు దాదాపు రూ. 9,200 కోట్లకు చేరుకోవడంతో, లాభాలతో కూడిన ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియోను నిర్మించనున్నామని %వీణ �డ జజూూ% రణదీప్ నారంగ్ అన్నారు. ముంబైకి చెందిన ట్రాన్స్‌రైల్..సివిల్, రైల్వేలు, విద్యుత్ స్తంభాలు, లైటింగ్‌తో పాటు %�uడణ% విభాగంలో ప్రముఖ నిర్మాణ సంస్థ. ఇది 59 దేశాలలో తన ఉనికిని కలిగి ఉంది. కంపెనీ తన విస్తృత మానవ వనరుల సామర్థ్యాల ద్వారా (స్వీయ-తయారీ ఉత్పత్తులతో సహా) విద్యుత్ సరఫరా, పంపిణీకి సంబంధించి 200 కంటే ఎక్కువ ప్రాజెక్టులను పూర్తి చేసింది.




# ఎంజీ కామెట్ ఈవీ 2025 విడుదల.. మార్పులు ఇవే




్క: ప్రముఖ కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కామెట్ విద్యుత్ కారు 2025 ఎడిషన్‌ను లాంచ్ చేసింది. ఈ కాంపాక్ట్ ఎలక్ట్రిక్ కారు ధరను రూ.4.99 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్ (ఆప్షన్‌లో భాగంగా తీసుకొచ్చారు. అంటే బ్యాటరీకి కిలోమీటర్‌కు రూ.2.5 చొప్పున అద్దె రూపంలో కంపెనీకి చెల్లించాల్సి ఉంటుంది.

ఇక ఫీచర్ల విషయానికొస్తే.. ఎగ్జిక్యూటివ్, ఎక్సైట్, ఎక్సైట్ ఫాస్ట్ ఛార్జ్, ఎక్స్‌క్లూజివ్, ఎక్స్‌క్లూజివ్ ఫాస్ట్ ఛార్జింగ్ ఇలా ఐదు వేరియంట్లలో లభిస్తుంది. ఎక్సైట్, ఎక్సైట్ ఎఫ్‌సీ (ఫాస్ట్ ఛార్జింగ్) వేరియంట్‌ల్లో కొత్తగా పార్కింగ్ కెమెరా, పవర్- ఫోల్డింగ్ ఓఆర్‌ఎంలతో ఇచ్చారు. ఇక ఎక్స్‌క్లూజివ్, ఎక్స్‌క్లూజివ్ ఫాస్ట్ ఛార్జింగ్ వేరియంట్‌లో కొత్తగా లెథర్ సీట్లు, 4- స్పీకర్ ఆడియో సిస్టమ్ ఇచ్చారు. అన్ని ఎఫ్‌సీ వేరియంట్లు 17.4 %ఎౌష్ట్ర% బ్యాటరీ ప్యాక్‌తో వస్తోంది. ఇవి సింగిల్ ఛార్జ్‌తో 230 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చు. డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్‌బ్యాగ్స్, ఏబీఎస్, రేర్ పార్కింగ్ సెన్సర్, స్పీడ్- సెన్సింగ్ ఆటో డోర్ లాక్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, రివర్స్ పార్కింగ్ కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, హోమ్ హెడ్‌ల్యాంప్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

# శబరిమలలో మోహన్‌లాల్.. మమ్ముట్టి కోసం ప్రత్యేక పూజలు




మలయాళ అగ్ర నటులు మోహన్‌లాల్ ( మమ్ముట్టి మధ్య ఎన్నోఏళ్ల నుంచి ఆత్మీయ స్నేహబంధం ఉన్న విషయం తెలిసిందే. తన స్నేహితుడు మమ్ముట్టి )పై ఉన్న అభిమానాన్ని మోహన్‌లాల్ మరోసారి బయటపెట్టారు. తన తదుపరి చిత్రం 'ఎల్2: ఎంపురాన్' రిలీజ్‌ను పురస్కరించుకొని మంగళవారం ఆయన శబరిమలను సందర్శించారు. ఇందులోభాగంగా తన కుటుంబసభ్యులతోపాటు ఆప్తమిత్రుడు మమ్ముట్టి కోసం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ పూజా సమయంలో మమ్ముట్టి అసలు పేరు మహ్మద్ కుట్టి అని ఆయన చెప్పినట్లు స్థానిక పత్రికల్లో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై సినీప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

మమ్ముట్టి అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నారంటూ ఇటీవల వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆయా కథనాలను ఆయన టీమ్ కొట్టి పారేసింది. "మమ్ముట్టి ఆరోగ్యం గురించి జరుగుతోన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. రంజాన్ కారణంగా ఆయన షూట్స్ నుంచి బ్రేక్ తీసుకొని వెకేషన్‌కు వెళ్లారు. విరామం నుంచి తిరిగి వచ్చిన వెంటనే ఆయన మోహన్‌లాల్‌తో కలిసి మహేశ్ నారాయణన్ చిత్రంలో పాల్గొననున్నారు" అని టీమ్ పేర్కొంది.

'ఎల్2: ఎంపురాన్' సినిమా విషయానికి వస్తే.. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ఇది. లూసిఫర్‌కు సీక్వెల్‌గా ఇది సిద్ధమవుతోంది. ఇంద్రజిత్ సుకుమారన్, మంజు వారియర్, టొవినో థామస్, సాయికుమార్‌తోపాటు విదేశీ నటీనటులు ఇందులో భాగమయ్యారు. మార్చి 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

# అదీ ఒక టైటిలేనా..?: అక్షయ్ చిత్రంపై జయా బచ్చన్ విమర్శలు






ముంబయి: బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ నటించిన 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' చిత్రంపై బాలీవుడ్ నటి, ఎంపీ జయాబచ్చన్ తీవ్ర విమర్శలు చేశారు. ఆ సినిమా తాను చూడలేదని అన్నారు. ఆ సినిమా టైటిల్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. అదేం పేరంటూ కామెంట్స్ చేశారు. అదొక ఫ్లాప్ సినిమా అంటూ జాతీయ మీడియా నిర్వహించిన కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

"సినిమాలు చూసే విషయంలోనూ నేను కొన్ని పరిమితులు ఫాలో అవుతుంటా. 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' పేరు నాకు ఏమాత్రం నచ్చలేదు. ఒక్కసారి ఆ టైటిల్ చూడండి. అలాంటి పేరు ఉన్న సినిమాలు చూడాలని నేను ఎప్పుడూ అనుకోను. అసలు అదేం పేరు? నిజంగా అది కూడా ఒక పేరేనా?" అని ప్రశ్నించారు. అనంతరం ఆమె కార్యక్రమంలో పాల్గొన్న ప్రేక్షకులను ఉద్దేశించి.. 'ఇలాంటి టైటిల్స్ ఉన్న చిత్రాలు చూడాలని మీరు కోరుకుంటారా?' అని అడిగారు. కొంతమంది చేతులు ఎత్తగా.. "ఈ కార్యక్రమంలో ఇంతమంది ఉండగా.. కేవలం నలుగురు మాత్రమే ఇలాంటి సినిమాలు చూడాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇది నిజంగా బాధాకరం. కాబట్టి ఇది ఫ్లాప్ సినిమా. ఇప్పుడున్న రోజుల్లో రాజకీయ పార్టీలు సైతం సినిమాలు రూపొందిస్తున్నాయి. దాని గురించి మాట్లాడాలంటే ఇప్పుడు చాలా సమయం పడుతుంది. ఇది కూడా అలాంటి ప్రచార చిత్రమే'' అని ఆమె అభిప్రాయం వ్యక్తంచేశారు.

అక్షయ్‌కుమార్, భూమి ఫడ్నేకర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమే 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' . శ్రీ నారాయణ్ సింగ్ దీనికి దర్శకత్వం వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మరుగుదొడ్ల కొరతను ఎత్తి చూపుతూ దీనిని రూపొందించారు. తన భార్య కోరిక మేరకు గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించడానికి ఒక వ్యక్తి ఏం చేశాడు? అనే ఆసక్తికర కథాంశంతో ఈ సినిమా తెరకెక్కించారు. 2017లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు వసూలు చేసి విజయాన్ని అందుకుంది.

# నన్ను జడ్జ్ చేయడానికి మీకున్న అర్హత ఏమిటి..?: కంగనా ఫైర్



చిత్ర పరిశ్రమకు చెందిన వారిపై నటి, ఎంపీ కంగనా రనౌత్ (ఆగ్రహం వ్యక్తంచేశారు. తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని ఉద్దేశించి దర్శక నిర్మాత సంజయ్‌గుప్తా ఇచ్చిన రివ్యూపై ఆమె స్పందించారు. కంగన తన అంచనాలు తప్పని నిరూపించారని ఆయన పేర్కొనడంపై ఆమె మాట్లాడారు. ముందుగానే తనపై ఒక అభిప్రాయానికి రావొద్దని విజ్ఞప్తి చేశారు.

''నాపై ముందుగానే ఒక అభిప్రాయానికి వచ్చినట్టు ఆయన తన పోస్ట్‌లోనే అంగీకరించారు. నన్ను అర్థం చేసుకోవడంలో మీరు పరాజయం అయినప్పుడు.. మళ్లీ నాపై ఒక అభిప్రాయానికి రావాలని ఎందుకు అనుకుంటున్నారు? తన అభిప్రాయం తప్పిందని ఆయన పేర్కొన్నారు. నేను ఎలాంటి సినిమా చేశానో మీకు ముందే ఎలా తెలుసు? నా గురించి ముందే తెలుసుకునేందుకు మీవద్ద ఏమైనా అద్భుత శక్తులు ఉన్నాయా? ఒక వ్యక్తి గురించి ఏదైనా అభిప్రాయానికి రావాలంటే వాళ్ల గురించి అన్ని విషయాలు తెలుసుకొని ఉండాలి. అయినా నన్ను జడ్జ్ చేసేందుకు మీకున్న అర్హతలు ఏమిటి? మీరు ఎలాంటి సినిమాలు రూపొందించారు? ఇండస్ట్రీలో ఉన్నవాళ్లు కూడా.. తాము ఎలాంటి సినిమాలు తెరకెక్కిస్తున్నారో ఒక్కసారి చెక్ చేసుకోవాలి" అని ఆమె పేర్కొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాకు దర్శకత్వం వహించి నిర్మాతగానూ వ్యవహరించిన కంగనా ఇందిరాగాంధీ పాత్రలో నటించారు. జయప్రకాష్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పాత్రలో శ్రేయస్ తల్పడే కనిపించారు. ఎన్నో అడ్డంకులు దాటుకుని ఈ ఏడాది ఇది ప్రేక్షకుల ముందుకువచ్చింది. ప్రస్తుతం ఇది ఓటీటీలో అందుబాటులో ఉంది.

ఇటీవల ఈ సినిమా గురించి సంజయ్‌గుప్తా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "ఎమర్జెన్సీ' వీక్షించా. కంగన దీనిని ఇంత చక్కగా రూపొందిస్తారని నేను ఏమాత్రం ఊహించలేదు. ఆమె నా అంచనాలు తారుమారు చేశారు. ఇదొక అద్భుతమైన చిత్రం. చిత్రాన్ని ఆమె తెరకెక్కించిన తీరు.. ఆమె నటన చాలా బాగున్నాయి'' అని ఆయన రాసుకొచ్చారు.

# ఈ సారి మరింత మంది ఆస్వాదిస్తారు



''మనకు కొన్ని సినిమాలతో ప్రత్యేకమైన ప్రేమ, అనుబంధం పెనవేసుకుని ఉంటుంది. తెలుగులో నాకు అలాంటివి మూడు నాలుగు చిత్రాలు ఉంటాయి. 'ఎవడే సుబ్రమణ్యం?' చూసి ఆ సినిమా గురించి నాతో మాట్లాడుతున్నప్పుడు వాళ్లలోనూ అలాంటి ప్రేమ కనిపిస్తూ ఉంటుంది. పదేళ్లకు ముందు తీసిన ఈ సినిమా అప్పటి పరిస్థితులకు ఎంత దగ్గరగా ఉండేదో... ఇప్పుడూ అంతే! ఇప్పటికీ మనం అదే పరుగులోనే ఉన్నాం. అందుకే ఈతరం ప్రేక్షకులకీ ఈ సినిమాని చూపించాలని ఎప్పట్నుంచో ఉండేది. ఈసారి మరింత మంది ఈ సినిమాని చూసి ఆస్వాదిస్తారని, మంచి అనుభూతిని పొందుతారని నమ్ముతున్నా" అన్నారు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ ఆయన తన తొలి ప్రయత్నంగా తెరకెక్కించిన చిత్రమే 'ఎవడే సుబ్రమణ్యం?'. నాని, విజయ్ దేవరకొండ, మాళవిక నాయర్, రీతూవర్మ కీలకపాత్రలు పోషించారు. స్వప్నదత్, ప్రియాంక దత్ నిర్మాతలు. ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చి పదేళ్లు పూర్తయింది. ఈ నెల 21న రీరిలీజ్‌గా మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

ఈ సందర్భంగా నాగ్ అశ్విన్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో సమావేశమయ్యారు. "పదేళ్ల కిందట చిన్న రిలీజ్‌గానే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. చివరి నిమిషంలో హడావుడిగా విడుదల చేశాం. బాగా ఆడింది కానీ... ఇప్పుడు కొత్తగా విడుదలై ఉంటే ఎంత మంది చూసేవాళ్లో తెలియదు కానీ, అప్పట్లో ఆ స్థాయి ఆదరణ పొందలేదనేది నా అభిప్రాయం. అందుకే ఈసారి మరింత భారీగా విడుదల చేస్తున్నాం" అన్నారు. ఈ పదేళ్ల తన ప్రయాణంపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ... ''ప్రతి సినిమాని మరొకరు చేయలేని ఓ కొత్త కాన్సెప్ట్‌తో తీస్తున్నా. అవి విజయవంతం అవుతున్నందుకు ఆనందంగా ఉంది. 'కల్కి2898 ఎ.డి' (%ఖుశ్రీఎఅ%) విడుదలకు ముందు నాలో చాలా ఒత్తిడి ఉండేది. చాలా భారీ చిత్రం. ఎంతో బాధ్యత నాపై ఉండేది. విడుదల తర్వాత ఫలితం ఎంతో తృప్తినిచ్చింది. ఓ మైలురాయి లాంటి సినిమా చేశాం. భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన సినిమాలు చేయగలమనే నమ్మకం వచ్చింది. 'కల్కి2' స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది చివర్లో ఆ సినిమాని ప్రారంభిస్తాం. ఈసారి సినిమాలో ప్రభాస్ పాత్ర పరిధి ఎక్కువగా ఉంటుంది'' అన్నారు నాగ్ అశ్విన్.

# సికందర్ స్టెప్పులు...



నిన్ను రక్షించేది.. పూజించేది ఈ సికందర్ మాత్రమే. నిన్ను గెల్చుకోవడానికి మరణించడానికైనా వెనకాడను" అంటూ తన ప్రియురాలి కోసం పాటలు పాడుతున్నారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ . ఆయన నటిస్తున్న 'సికందర్' సినిమా కోసమే ఇదంతా. రష్మిక కథానాయిక. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్ర ప్రచార కార్యక్రమాలు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మరో గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'సికందర్ నాచే' అంటూ సాగుతున్న ఈ పాటలో రష్మిక, సల్మాన్‌ల స్టైలిష్ స్టెప్పులు సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమా ట్రైలర్‌ను త్వరలో విడుదల చేయబోతున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. కాజల్, సత్యరాజ్, ప్రతీక్ బబ్బర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా ఈద్‌కు రాబోతుంది.

# నిహారిక సొంత బ్యానర్‌పై ఫీచర్ ఫిల్మ్.. డైరెక్టర్ ఎవరంటే



నటిగా అలరిస్తూనే ప్రొడ్యూసర్‌గా మారారు నిహారిక కొణిదెల . 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' () పేరుతో బ్యానర్‌ను నెలకొల్పారు. దీనిపై ఇప్పటికే 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాను నిర్మించి ఆదరణను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌తో అలరించేందుకు సిద్ధమయ్యారు.

మానస శర్మ దర్శకత్వంలో ఈ సినిమా రానున్నట్లు ప్రకటించారు. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌లో మానస క్రియేటివ్ డైరెక్టర్‌గా రెండు సిరీస్‌లకు దర్శకత్వం వహించారు. జీ5 వేదికగా అలరిస్తోన్న 'ఒక చిన్న ఫ్యామిలీ', సోనిలీవ్‌లో టెలికాస్ట్ అవుతోన్న 'బెంచ్ లైఫ్' సిరీస్‌లకు మానస దర్శకత్వం వహించారు. ఆమె దర్శకత్వంలో మూడో ప్రాజెక్ట్‌గా ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ రానుంది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటించనున్నారు.

# బరువు తగ్గాలనుకుంటున్నారా..? రోజు ఈ చిట్కాలు పాటించండి..!

ఊబకాయం(ఒబెసిటీ).. ఈ జనరేషన్‌లో చాలా మందిని వేధిస్తున్న సమస్య. చాలామంది కంప్యూటర్ల ముందు గంటలు గంటలు కూర్చొని పనిచేయడంతో సమస్య వేధిస్తోంది. పొట్ట చుట్టూ అనవసర కొవ్వు పేరుకుపోవడం వల్ల.. అధికంగా బరువు పెరుగుతున్నారు. దీంతో ఒబెసిటీ సమస్య వస్తోంది.. పలు సందర్భాల్లో భావోద్వేగ స్థాయిలో సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఊబకాయం పెరగడంతో శరీరం వికారంగా కనిపిస్తుంది. ఈ ఊబకాయంతో అనేక వ్యాధులకు కూడా కారణం అవుతాయి.



అధిక బరువు పెరగడంతో అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బరువు తగ్గడం కోసం ఎన్నో వ్యాయామాలు, డైట్‌ల గురించి చెప్పినా ఒక్కోసారి పని వల్ల, మరికొన్ని సార్లు బద్ధకంతో ఎందరో బరువు తగ్గించుకోలేకపోతున్నారు. ప్రతి రాత్రి కొన్ని చిట్కాలు పాటించడం, ఆహారంలో స్వల్ప మార్పులు చేయడం ద్వారా సులభంగా బరువును తగ్గించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

పుష్కలంగా నీరు తాగాలి

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నీళ్లు తాగడం చాలా ముఖ్యం. బరువును నియంత్రించడంలో నీరు ప్రభావవంతంగా ఉంటుంది. బరువును అదుపులో ఉంచుకోవడానికి.. నీరు ఎక్కువగా తాగాలి. తద్వారా కడుపు నిండిన అనుభూతిని కలిగించడంతో పాటు అనవసరమైన కేలరీలను తీసుకోకుండా ఉండేందుకు సహాయపడుతుంది. నీరు ఎక్కువగా తాగడంతో శరీరంలోని టాక్సిన్స్ కూడా బయటకు వెళ్లిపోతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజుకు 8 గ్లాసుల నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి.

పడుకునే ముందు తేలికపాటి వ్యాయామం చేయాలి

మీరు మీ పెరుగుతున్న బరువును నియంత్రించాలనుకుంటే.. క్రమం తప్పకుండా పడుకునే ముందు.. పది నుంచి పదిహేను నిమిషాల పాటు తేలికపాటి వ్యాయామం చేయాలి. బరువు తగ్గడానికి ఇది చాలా ప్రభావవంతమైన మార్గం.

# చిన్నపిల్లల్లో శ్వాసకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఎలాంటి ఆహారం ఇవ్వాలి..?

శిశువు జబ్బు పడినప్పుడు, పెరుగుదలలో లోపం రాకుండా జాగ్రత్తపడటం తల్లిదండ్రుల కర్తవ్యం. అంటువ్యాధులకు ఆహార లోపాలు తోడైతే పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కుంటుపడుతుంది. అనారోగ్య సమయంలో పసిబిడ్డల ఆకలి బాగా తగ్గిపోతుంది. వాంతులు అవుతాయి. దీనివల్ల తీసుకునే ఆహార పరిమాణమూ తగ్గిపోతుంది.



అతిసార వ్యాధి, మశూచి వచ్చినప్పుడైతే, తీసుకున్న ఆహారంలో కొంత మాత్రమే ఒంటికి పడుతుంది. ఇప్పటికీ కొందరు 'లంఖణం పరమౌషధం' అన్న మాటనే నమ్ముతారు. పిల్లలకు ఆహారం ఇవ్వకుండా కడుపు మాడ్చుతారు. నిజానికి ఆరోగ్యవంతులతో పోలిస్తే, అనారోగ్యపీడితుల ఆహార అవసరాలే ఎక్కువగా ఉంటాయి.

వ్యాధిని ఎదిరించడానికి మందులతోపాటు బలవర్ధకమైన ఆహారం అవసరం. అందువల్ల, అనారోగ్య సమయంలో పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారం తినిపించడం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. అందులోనూ, కోలుకుంటున్న దశలో బాగా ఆకలి వేస్తుంది. కాబట్టి, అంతకుముందు కన్నా ఎక్కువ ఆహారాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాలి.

ఇష్టమైన పదార్థాలను మెత్తగా చేసి, కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు పెట్టాలి. అందులోనూ తల్లిపాలు చాలా ముఖ్యం. ఈ సమయంలో బిడ్డలు ద్రవ పదార్థాలపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. బిడ్డ వ్యాధికి పూర్వం ఉన్న బరువుకు తిరిగి చేరుకోగలిగితే, అనారోగ్యం నుండి పూర్తిగా కోలుకున్నట్టే.

పిల్లలను తరచూ ఇబ్బందిపెట్టే రుగ్మతలు దగ్గు, జలుబు. వీటిని అశ్రద్ధ చేస్తే న్యుమోనియా అనే ఊపిరితిత్తుల వ్యాధికి దారితీయవచ్చు. తల్లిపాలతో న్యుమోనియాను అరికట్టవచ్చు. విటమిన్–ఎ ఎక్కువగా ఉండే పసుపుపచ్చ ఫలాలు, ఆకుకూరలు కూడా శ్వాసకోశ వ్యాధుల నుంచి రక్షిస్తాయి.

దగ్గు, జలుబు ఉన్నప్పుడు తల్లిపాలు తాగడం పిల్లలకు కష్టం కావచ్చు. అలా అని ఆపకూడదు. అమ్మ పాలు రోగనిరోధక శక్తిని ఇవ్వడమే కాదు, పోషకాహార లోపాలనూ నివారిస్తాయి. పిల్లల ముక్కును తరచూ శుభ్రం చేయడం వల్ల పాలు తాగడం సులభం అవుతుంది.

అయినా ఇబ్బందిగా ఉంటే, శుభ్రమైన కప్పులోకి పాలు పిండి చెంచాతో తాగించాలి. తరచూ ద్రవ పదార్థాలు ఇవ్వడం వల్ల శ్వాస నాళాలలోని స్రవాలు చిక్కబడవు. దగ్గినప్పుడు సులభంగా బయటికి వచ్చేస్తాయి.

# మెల్లగా ఆహారం తినండి.. శరీరం బరువు తగ్గించుకోండి..!

దృఢమైన చక్కని ఆకృతిలో శరీరాన్ని సొంతం చేసువాలంటే.. డైటింగ్, వర్కవుట్స్.. రెండూ ముఖ్యమైనవే అని భావిస్తాం. ఉపవాసం, కష్టతరమైన వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేకుండానే శరీరం బరువును తగ్గించుకోవడంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు అంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. నెమ్మదిగా తినండి అంటే చాలా మందికి కోపంగా ఉంటుంది. శరీరం బరువు తగ్గించుకోవడానికి ముందుగా ఆహారాన్ని బాగా నమిలి తినడం అలవాటు చేసుకోవాలి. ఆహారాన్ని బాగా నమలడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో ఆహారాన్ని మెల్లగా తింటారు. అంతేకాదు కడుపారా తిన్న సంతృప్తి కూడా కలుగుతుంది. ఫలితంగా ఎక్కువగా తినకుండా ఉంటారు. ఎంత తింటున్నారు అనేది కూడా చాలా ముఖ్యం. డైటింగ్ చేయనప్పటికీ చిన్న ప్లేట్‌లో తినడం వల్ల ఎక్కువగా తిన్నామన్న భావన కలిగి తినే మోతాదు తగ్గిపోతుంది. భోజనం చేయడానికి ముందు ఎక్కువగా నీళ్లు తాగాలి. దీంతో మీరు తక్కువ తినగానే పొట్ట నిండుగా అనిపిస్తుంది. మెల్లగా ఆహారం తీసుకోవడం వల్ల మన శరీరం బరువు తగ్గించుకోవడంతోపాటు అనేక ప్రయోజనాలు ఉంటాయి. అవేంటంటే..




మంచి పోషక శోషణ:

నెమ్మదిగా తినడం వల్ల మంచి జీర్ణక్రియ సాధించవచ్చు. శరీరం ద్వారా పోషకాలను గ్రహించడం కూడా గరిష్ఠంగా ఉంటుంది.

ఒత్తిడి స్థాయిలు తగ్గుతాయి:

నమలడం, ఆహార సంతృప్తి పెరుగడం ద్వారా ప్రశాంతమైన, సంతోషకరమైన మనసును పొందడానికి దారితీస్తుంది. ఇది తక్కువ స్థాయి ఒత్తిడిని సాధించడానికి నేరుగా దోహదం చేస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ:

నెమ్మదిగా తినడం వల్ల మరింత నమలడం అవసరం అవుతుంది. ఇది జీర్ణక్రియ ప్రక్రియను మెరుగుపరచడానికి తద్వారా శరీరం బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది.

సంతృప్తి ప్రేరేపణ:

నెమ్మదిగా తినడం వల్ల ఆహారాన్ని పూర్తి స్థాయిలో ఆస్వాదించడానికి వీలుంటుంది. తినడం ఎల్లప్పుడూ సరిపోకపోవచ్చు. అయితే దాని రుచి, వాసన, ఆకృతిని గుర్తించి అభినందిస్తున్నప్పుడు తినడం మరింత సంతృప్తి చెందడానికి సహాయపడుతుంది.

నమలడాన్ని ప్రోత్సహిస్తుంది:

నెమ్మదిగా తినేటప్పుడు దంతాలతో నమలడం మెరుగుపడుతుంది. ఇది క్యాలరీల వినియోగాన్ని నియంత్రించడానికి, తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా శరీరం బరువు తగ్గడాన్ని ప్రోత్సహిస్తుంది.

అదేవిధంగా, ఒత్తిడి, ఉద్వేగంగా ఉన్నప్పుడు ఎక్కువగా తినేస్తారు. ఒత్తిడికి లోనైన సమయాల్లో ఎక్కువగా విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్.. ఆకలిని పెంచుతుంది. బరువు పెరగడానికి నిద్రలేమి కూడా ఒక కారణంగా తేల్చారు. చాలినంత నిద్ర లేకపోవడం వల్ల హార్మోన్ల విడుదలలో అసమతౌల్యం ఏర్పడి ఊబకాయం సమస్య వస్తుంది. కాబట్టి కంటినిండా నిద్రపోవడం అలవర్చుకోవాలి.

# ఆ ఉల్లిగడ్డలను తిని జనాలు ఎందుకు జబ్బుపడుతున్నారు? వాటిలో ఏముంది?

ఉల్లిగడ్డలను తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది అని పెద్దలు చెబుతుంటారు. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. కానీ.. ప్రస్తుతం ఆ ఉల్లిగడ్డలను తినడం వల్లనే చాలామంది వ్యాధి బారిన పడుతున్నారు. ఇప్పటి వరకు ఉల్లిగడ్డలను తినడం వల్ల యూఎస్‌ఏలోని 37 రాష్ట్రాల్లో 652 మందికి పలు ఆరోగ్య సమస్యలు వచ్చాయి. అందులో 129 మంది ఆసుపత్రి పాలయ్యారు. దానికి కారణం వాళ్లు తిన్నది సాల్మొనెల్లా అనే బ్యాక్టీరియా ఉన్న ఉల్లిగడ్డలను తినడం. ఆ ఉల్లిగడ్డలను మెక్సికో నుంచి యూఎస్‌కు ఇంపోర్ట్ చేశారు. వాటిని తిని ఇప్పటి వరకు ఎవరూ చనిపోలేదు కానీ.. ఆసుపత్రుల పాలు అవడం.. పలు ఆరోగ్య సమస్యలకు గురి కావడంతో యూఎస్‌లో ఉల్లిగడ్డలను తినాలంటే అక్కడి ప్రజలు వణికిపోతున్నారు.



అసలు సాల్మొనెల్లా అంటే ఏంటి?

సాల్మొనెల్లా అనేది ఓ బ్యాక్టీరియా. అది ఎక్కువగా ఆహార పదార్థాల్లో ఉంటుంది. వాటిని తినగానే ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ బ్యాక్టీరియా ఉన్న ఫుడ్‌ను తీసుకోగానే పేగుల్లో సమస్యలు వస్తాయి. తద్వారా కడుపు నొప్పి వస్తుంది. ఈ బ్యాక్టీరియా ద్వారా ఆరోగ్య సమస్యలు వస్తే వాటిని సాల్మొనెల్లోసిస్ అని అంటారు.

ఈ రకం బ్యాక్టీరియా ఎక్కువగా జంతువుల్లో, మనిషి పేగుల్లో ఉంటుంది. ఈ బ్యాక్టీరియా మల విసర్జన ద్వారా బయటికి వెళ్లి ఆహార పదార్థాల్లో, నీళ్లలో కలిసి పోయి.. తిరిగి మనుషుల్లోకి చేరుతుంది. ఈ బ్యాక్టీరియా మనుషుల్లోకి చేరిందని తెలుసుకోవడం చాలా కష్టం.

ఈ బ్యాక్టీరియాతో ఇన్‌ఫెక్ట్ అయితే వాంతులు అవడం, డయోరియా, జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. 5 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలు.. 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు ఈ బ్యాక్టీరియా సోకే ప్రమాదం ఎక్కువ.

ఈ బ్యాక్టీరియా రక్త ప్రవాహంలో కలిస్తే మాత్రం చాలా ప్రమాదం. అది మెదడులోని కణజాలాన్ని, వెన్నుముకను డ్యామేజ్ చేస్తుంది. రక్తనాళాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. పైన చెప్పిన లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# ఈ పండుతో ఆరోగ్య ప్రయోజనాలు మెండు!

సీజనల్ పండ్లు ఆరోగ్యానికి చేకూర్చే ప్రయోజనాలు మెండు అని నిపుణులు చెబుతున్నారు. శీతాకాలంలో లభించే శీతాఫలాల్లో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు మనకు శక్తితో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఈ పండులో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు మెదడును ఉత్తేజితం చేస్తాయి. శీతాఫలంలో పుష్కలంగా లభించే ఫైబర్‌తో జీర్ణప్రక్రియ సాఫీగా సాగుతూ ప్రేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఈ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్ లుటెన్ కంటి ఆరోగ్యాన్ని కాపాడుతూ కంటి సమస్యలు రాకుండా నివారిస్తుంది.



ఇక సీతాఫలంలో పుష్కలంగా ఉండే మాగ్నీషియం, పొటాషియం ఇతర పోషకాలు రక్తపోటు స్థాయిని మెరుగ్గా నియంత్రిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆరోగ్యకరమైన మధుమేహ లెవెల్స్ ఉండేలా చేస్తాయి. వాపు వల్ల వచ్చే వ్యాధులను నియంత్రించడంతో పాటు ఇవి గుండె ఆరోగ్యాన్నీ సంరక్షిస్తాయని నిపుణులు చెబుతారు. ఈ పండులో ఉండే విటమిన్ సీ ద్వారా రోగనిరోధక వ్యవస్థ బలపడుతుందని, ఇది లో గ్లైసిమెక్ ఇండెక్స్‌ను కలిగి ఉండటంతో మధుమేహ రోగులూ శీతాఫలం తినవచ్చని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు.

# కూల్‌డ్రింక్స్ అధికంగా తాగితే డేంజరే..!

ఎండాకాలం వచ్చిందంటే చాలు.. చాలా మంది కూల్‌డ్రింక్స్‌ను ఎడా పెడా తాగేస్తుంటారు. ఇంకా కొంత మందైతే కాలాలతో సంబంధం లేకుండా కూల్ డ్రింక్స్‌ను తాగుతుంటారు. అయితే నిజానికి ఇవి మన ఆరోగ్యానికి చేటు చేస్తాయి. కూల్ డ్రింక్స్‌ను ఎక్కువగా తాగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయి. వ్యాధులు



కూల్‌డ్రింక్స్‌ను అధికంగా తాగితే బరువు త్వరగా పెరుగుతారు. వాటిలో ఉండే చక్కెర శరీరంలో కొవ్వును పెంచుతుంది. దీంతో అధిక బరువు పెరుగుతారు. ఫలితంగా డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. అలాగే ఇతరులు కూడా కూల్ డ్రింక్స్‌ను ఎంత తక్కువగా తాగితే అంత మంచిది. కూల్ డ్రింక్స్ తాగాలనిపించినప్పుడు సహజసిద్ధమైన పానీయాలు తాగండి. కొబ్బరి నీళ్లు, పుచ్చకాయ రసం, చెరుకు రసం తదితర పానీయాలు తాగడం వల్ల మనకు ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి..!

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy